వాహినీ
నవ సాహిత్యంపై విశ్లేషణ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఖమ్మం
: fb.com/vaartha Digital
Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
8-6-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 127 పేజీలు: 8+16 వెల: 8.00

చేప ప్రసాదం నేడు, రేపు పంపిణీ 3
వలసదారులే లక్ష్యంగా ఇమ్మిగ్రేషన్ దాడులు 5

# కేబినెట్ విస్తరణ నేడే



## గడ్డం వివేక్, వాకిటి శ్రీహరి, కవ్వంపల్లి ఖరారు?
### సుదర్శన్‌రెడ్డికి కూడా అధిష్ఠానం గ్రీన్‌సిగ్నల్!
### పలువురు ఆశావహుల తుది ప్రయత్నాలు
### డిప్యూటీ స్పీకర్‌ను నియమించే అవకాశం
### ఇద్దరు మంత్రుల శాఖలు మారే సూచన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్7:** గత కొన్ని నెలలుగా తెలంగాణ మంత్రివర్గ విస్తరణపై కొనసాగుతున్న ఊహాగానాలకు తెరపడింది. ఎట్టకేలకు మంత్రివర్గ విస్తరణకు కాంగ్రెస్ హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆదివారం మధ్యాహ్నం తెలంగాణ కేబినెట్ విస్తరణకు ప్రభుత్వం సిద్దంగా ఉంది. ఈ నేపథ్యంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అపాయింట్‌మెంట్ కావాలంటూ రాజ్‌భవన్‌కు సమాచారం పంపింది. అయితే ప్రస్తుతం త్రిపురలో ఉన్న ఆయన శనివారం రాత్రి పొద్దుపోయాక చేరుకున్నట్లు సమాచారం. గవర్నర్ రాగానే కేబినెట్ విస్తరణ, ప్రమాణ స్వీకారంపై క్లారిటీ రానుంది. మధ్యాహ్నం 12.30 గంటలకు లేదా మధ్యాహ్నం 2 తర్వాత ముహూర్తాలు చూస్తున్నారని సమాచారం. మరోవైపు పదవి దక్కుతుందో లేదోనని అశావాహుల్లో అలజడి మొదలైంది. మంత్రివర్గంలో కొత్తగా ముగ్గురికి చోటు దక్కనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ఇప్పటి వరకు 12 మంది కేబినెట్‌లో మంత్రులుగా ఉన్నారు. మరో ఆరుస్థానాలను భర్తీచేయాల్సి ఉంది. అయితే ప్రస్తుతానికి మూడు లేదా నాలుగు మంత్రి పదవులనే భర్తీ చేస్తారని సమాచారం. డిప్యూటీ స్పీకర్ నియామకం జరిగే అవకాశం ఉంది. ఇటీవల మీనాక్షి నటరాజన్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్‌గా నియమితులైన తర్వాత ఆశావాహులంతా కూడా ఆమె కలిసి మంత్రి పదవి కోసం వినతులు చేశారు. కొత్తగా ఎన్నికైన నేతలు, సీనియర్ నేతలు తమకు అవకాశం కల్పించాల్సిందిగా సీఎం రేవంత్ రెడ్డితో పాటు, ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ పెద్దలను కలుస్తున్నారు. ఈ క్రమంలో మంత్రి వర్గ విస్తరణపై కాంగ్రెస్ హైకమాండ్ సంకేతాలు ఇచ్చింది. ఆదివారం మంత్రివర్గ >>2



శనివారం కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం పిన్నాపురంలో గ్రీన్ కో ఇంటిగ్రేటెడ్ పవర్ ప్రాజెక్టును సందర్శించిన డి.సిఎం భట్టి

# భవిష్యత్తు 'గ్రీన్ పవర్'దే
### 2030 నాటికి 20 వేల మె. వా ఉత్పత్తి లక్ష్యం
### ఇప్పటికే లక్షకోట్ల పెట్టుబడికి ఎంఒయులు
### ఎపిలోని పిన్నాపురం గ్రీన్ కో పవర్ ప్రాజెక్టును సందర్శించిన డి.సిఎం భట్టి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్7:** భవిష్యత్తు అంతా గ్రీన్ పవర్ దే, ఆ మేరకు తెలంగాణ రాష్ట్రం ప్రాధాన్యరంగంగా గుర్తించి, ప్రణాళికలతో ముందుకు వెళుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. శనివారం కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం పిన్నాపురం గ్రామంలో గ్రీన్ కో ఇంటిగ్రేటెడ్ పవర్ ప్రాజెక్టును సందర్శించిన అనంతరం ఆయన స్థానికంగా మీడియాతో మాట్లాడారు. ఏపీలోని కర్నూలు జిల్లాలో నిర్మితమవుతోన్న పిన్నాపురం గ్రీన్ కో ప్రాజెక్టు దేశానికి, ప్రపంచానికి మార్గదర్శిలా నిలిచిందని, దీనికి ఏపీని అభినందిస్తున్నానని ఆయన అన్నారు >>2

# పేదరికం తగ్గుతోంది!



### పదేళ్లలో 27.1 % నుంచి 5.3%కు తగ్గుదల
### 26.9 కోట్లమందికి పేదరికం నుంచి విముక్తి
### ప్రపంచ బ్యాంకు నివేదిక వెల్లడి

**న్యూఢిల్లీ, జూన్ 7:** భారత్‌లో గడచిన దశాబ్దకాలంలో పేదరికం గణనీయంగా తగ్గిందని ప్రపంచ బ్యాంకు విశ్లేషించింది. 2011-12 సంవత్సరంలో 27.1 శాతం ఉన్న పేదరికం 2022-23 సంవత్సరాంతానికిగాను 5.3శాతానికి తగ్గిందని బ్యాంకు వెల్లడించింది. సుమారు 75.24 మిలియన్ల మంది ప్రజలు దుర్భరదారిద్రంలోఉన్నట్లు తేల్చింది. అదే దశాబ్దం క్రితం గణాంకాలనుచూస్తే ఆనాడు 344.47 మిలియన్ల జనాభా కడు పేదరికంలో జీవించినట్లు నివేదికలు వెల్లడించింది. దీన్నిబట్టిచూస్తే మొత్తం 26.9 కోట్లమంది ప్రజలు పేదరికంనుంచి విముక్తిపొందినట్లు తేలింది. 11 ఏళ్లలోనే భారత్ గణనీయమైన ప్రగతిని సాధించిందని ప్రపంచ బ్యాంకు ఈసందర్భంగా వెల్లడించింది. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు 2011-12 మధ్యకాలంలో దేశంలోని మొత్తం నిరుపేదల్లో 65శాతం మంది ఈరాష్ట్రాల్లోనే ఉన్నట్లు తేల్చింది. ఈ దశాబ్దకాలంలో 344.47 మిలియన్లనుంచి కేవలం 75.24 మిలియన్లకు తగ్గారని, దీన్నిబట్టిచూస్తే పేదరికం గణనీయంగా >>2



# బనకచర్ల ప్రాజెక్టుపై నిర్ణయించలేదు..
### ప్రాజెక్టు డిపిఆర్‌ను కేంద్రం ఇంకా పరిశీలించలేదు
### అభ్యంతరాలపై సిఎం రేవంత్ కేంద్రానికి లేఖ రాయాలి
### త్వరలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుని ఎన్నిక: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, జూన్ 7 ప్రభాతవార్త:** బనకచర్ల మీద కేంద్రంనిర్ణయం తీసుకోలేదు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అని తేల్చి చెప్పారు. గోదావరి జలాల పంపిణీ మేరకు తెలంగాణకు అన్యాయం జరగవద్దని, ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని కోరుతున్నానని అన్నారు. ఎందుకు బనకచర్ల ప్రాజెక్టును నిలిపి వేయాలనే దానిపై పూర్తి వివరాలతో జల వనరుల శాఖను కలవాలి అని కోరారు. బనకచర్ల ప్రాజెక్టు వలన తెలంగాణకి ఏ విధంగా నష్టం జరుగుతోందో డీటెయిల్డ్‌గా లేఖ రాయాలని తెలంగాణ ప్రభుత్వానికి సూచనలు చేశారు. అయితే, గత వారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రానికి డిపిఆర్ ఇచ్చిందని అన్నారు. కేంద్రం ఇంకా ఆ రిపోర్ట్ పరిశీలించలేదని అన్నారు. బనకచర్ల ప్రాజెక్ట్ రిపోర్ట్ చదవలేదని, అధ్యయనం చేసిన తరువాత నిర్ణయం తీసుకుంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నిష్పక్షపాతంగా వ్యవహరిస్తోంది అని కిషన్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర అధ్యక్ష ఎన్నికకు ఎలిజిబిలిటీ వచ్చింది అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. త్వరలో అధ్యక్షుడి ఎన్నిక ఉంటుందని, తాను మరోసారి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉండనన్నారు. సేవ్ తెలంగాణ నినాదంతో బిజెపి ముందుకు వెళ్తుందని స్పష్టం చేశారు. తెలంగాణలో అధికారమే లక్ష్యంగా ముందుకెళ్తాం అన్నారు. బిజెపి నేతగా ఈటల రాజేందర్‌ను కాళేశ్వరం కమిషన్ ముందుకు వెళ్లలేదని, గత ఆర్థిక మంత్రిగా ఈటల విచారణకు వెళ్లారని, బిజెపి స్టాండ్ చెప్పాలని కమిషన్ అడగలేదని, ఆర్థిక మంత్రిగా ఏం జరిగిందో ఈటల కమిషన్ ముందు వివరించారని తెలిపారు. కాళేశ్వరం కమిషన్ ముందు ఈటెల రాజేందర్ తనకు తెలిసిందే చెప్పారని అన్నారు. కమిషన్ ముందు, బయట ఈటల ఒకటే చెప్పారని, కెసిఆర్ మీద చర్యలు తీసుకోవాలని ఈటల చెప్పినట్లు తెలిపారు. ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి అవినీతికి పాల్పడిన మంత్రులు, ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకుంటామని చెప్పారని కానీ ఎవరిపై చర్యలు తీసుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. మేడిగడ్డ ప్రాజెక్ట్ క్రాష్ అయింది నిజం కాదా? ఎన్‌డిఎస్‌ఏ రిపోర్ట్ తప్పు ఏవిధంగా అవుతుందని ప్రశ్నించారు. కాళేశ్వరంపై సిబిఐ దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు. గత ఎన్నికల్లో ఈవిఎంల ట్యాంపరింగ్ చేసి ఎన్‌డిఏ అధికారంలోకి వచ్చిందని రాహుల్ గాంధీ అనటం హాస్యాస్పదంగా ఉందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఈవిఎంల ట్యాంపరింగ్ జరిగితే తెలంగాణలో కాంగ్రెస్ ఎలా గెలిచిందని ప్రశ్నించారు. ఎన్‌డిఏ 11 ఏళ్ల పాలనపై కాంగ్రెస్ విమర్శలు చేస్తుందని దానిని తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా అన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ఈ సారి అసంబ్లీపై ఎగిరేది కాశాయ జెండానే అని ధీమా వ్యక్తం చేశారు. సోషల్ >>2



ఘటనా స్థలంలో పోలీసులు,స్థానికులు

### విషాద స్నానం!
### మేడిగడ్డ బ్యారేజ్‌లో
# ఆరుగురు గల్లంతు


**ప్రభాతవార్త, జయశంకర్ భూపాలపల్లి బ్యూరో:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజ్‌లో శనివారం సరదాగా ఈత కోసం ఏడుగురు యువకులు దిగారు. ఈక్రమంలో ఈత చేస్తున్న క్రమంలో వరద ఉధృతికి ఆరుగురు యువకులు గల్లంతయ్యారు. ఏడుగురిలో ఒకరు సేఫ్ అయ్యారు. ఈసంఘటనతో అంబట్‌పల్లి గ్రామం విషాధంలో నెలకొంది. గల్లంతైన యువకులందరికీ దాదాపుగా 18 సంవత్సరాలు ఉన్నట్లు సమాచారం. గల్లంతైన వారిలో >>2



# నేడు రేపు ఐసెట్ పరీక్ష
### 96 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు

**హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఎంబిఎ, ఎంసిఎ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించే కామన్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ ఐ సెట్-2025 పరీక్షలు నేడు(ఆదివారం), ప్రారంభం కానున్నాయి. రేపు(సోమవారం) కూడా నిర్వహించనున్నారు. ఐ సెట్-2025కి 71,757 మంది దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షను ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్‌లలో నిర్వహించనున్నారు. పరీక్ష కేంద్రం గేట్లను.. పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందుగానే మూసివేయనున్నట్టు అధికారులు ప్రకటించారు. ఉదయం 10 గంటలకు పరీక్ష ప్రారంభం కానుండగా.. 9.45 గంటలకే గేట్లను మూసివేయనున్నట్టు తెలిపారు. అభ్యర్థులు త్వరగా పరీక్షా >>2

# ఈటల మాటలు అసత్యాలే..



### కాళేశ్వరం ప్రాజెక్టు కేబినెట్ ఆమోదం పొందలేదు
### నాటి కేబినెట్ సబ్ కమిటీ కాళేశ్వరంపై కాదు
### మంత్రి తుమ్మల కౌంటర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్7:** బీజేపీ నేత, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ వ్యాఖ్యలను తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తప్పుబట్టారు. కాళేశ్వరం కమిషన్‌కు ఈటల అసత్యాల వాంగ్మూలం ఇచ్చారని మంత్రి తుమ్మల ఆగ్రహించారు. కమిషన్ అడిగిన ప్రశ్నలకు ఈటల పొంతనలేని సమాధానం ఇచ్చారని, ఆయన చెప్పిన సబ్ కమిటీ.. కాళేశ్వరం కోసం వేసింది కాదన్నారు. కాళేశ్వరానికి శాంక్షన్ ఇచ్చిన తర్వాత పెండింగ్ ప్రాజెక్టుల కోసం వేసిన సబ్ కమిటీ అదని తుమ్మల క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేశారు. శనివారం సాయంత్రం ఆయన సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. ప్రాణహిత, దేవాదుల, కాంతలపల్లి, తుపాకులగూడెం పనుల కోసం సబ్ కమిటీ వేశారని బీఆర్ఎస్ పాలనా సమయంలో జరిగిన విషయాల్ని మంత్రి తుమ్మల గుర్తు చేశారు. ఆ సబ్ కమిటీ కాళేశ్వరం బ్యారేజీలపై ఎలాంటి నివేదిక ఇవ్వలేదని.. కాళేశ్వరం నిర్మాణానికి సబ్ కమిటీ ఆమోదం తెలిపిందనడం అబద్ధమని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు కేబినెట్ ఆమోదం >>2



శనివారం తెలంగాణ భవన్‌లో 'కాళేశ్వరం ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇస్తున్న హరీష్‌రావు

# 'కాళేశ్వరం' కల్పతరువు
### రాజకీయ లబ్ధికోసమే కాంగ్రెస్ తప్పుడు ప్రచారం
### 20.33 లక్షల ఎకరాలకు సాగునీరు
### పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌లో హరీష్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్ 7:** కాళేశ్వరం ప్రాజెక్టు రాష్ట్రానికి కల్పతరువని బీఆర్ఎస్ సీనియర్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మొత్తం 20లక్షల 33 వేల 572 ఎకరాలకు సాగునీరు అందిస్తే, ఒక్క ఎకరాకు నీళ్లు ఇవ్వలేదని కాంగ్రెస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఒక ఏడాది కరువు వస్తే, ఎస్సారెస్పీకి కూడా నీళ్లనురివర్స్ పంపింగ్ చేశామన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో 'కాళేశ్వరం ప్రాజెక్టుపై దుష్ప్రచారాలు-వాస్తవాలు'పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మిడ్ మానేర్ నుంచి ఎల్‌ఎండీకి నీళ్లు తెచ్చి, అక్కడి నుంచి ఎస్సారెస్పీ స్టేజ్ 1కు నీళ్లిచ్చామన్నారు. ఎస్సారెస్పీ స్టేజ్2లో తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ దాకా నీరు అందించామని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం కాళేశ్వరం నీళ్లు పంపించి పంటలు కాపాడిందని తెలిపారు. ఇది వాస్తవమైన రిపోర్టు అని, నీటి పారుదలశాఖ అధికారులిస్తున్న నివేదిక అని వెల్లడించారు. కానీ కాంగ్రెస్ నాయకులు 50వేల ఎకరాలే పారిందని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ఏర్పడక ముందు గోదావరి జలాల సద్వినియోగానికి ఎవరూ కృషి చేయలేదు. 2007 నుంచి 2014 వరకు కేంద్రంలో, మహారాష్ట్రలో, ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ ప్రభుత్వాలే ఉన్నప్పటికీ తుమ్మిడి హట్టి వద్ద ప్రాజెక్టునిర్మాణం కోసం కేంద్రం నుంచి ఏ అనుమతి సాధించలేదు. బీఆర్ఎస్ పార్టీలో ఆలోచన చేసినం, తెలంగాణ పచ్చబడాలంటే గోదావరి జలాలే కావాలనుకున్నం. గోదావరి నది 1465 కిలోమీటర్లు ప్రవహిస్తుంటే, అందులో 750 కిలోమీటర్లు తెలంగాణలోనే ప్రవహిస్తున్నది. ఉమ్మడి ఏపీ రాష్ట్రంలో 1480 టీఎంసీల కేటాయింపులుంటే, తెలంగాణ వాటా 969 టీఎంసీలు. కానీ, వాస్తవంగా >>2



### ఎన్‌కౌంటర్‌లో మరో 5గురు మావోయిస్టులు
# హతం
### మృతుల్లో ఇద్దరు మహిళలు

**చర్ల : జూన్ 7, ప్రభాతవార్త:** ఆపరేషన్ నేషనల్ అటవిప్రాంతంలో మూడురోజులు జరుగుతున్న సెర్చ్ ఆపరేషన్ లో గురు,శుక్రవారంలో కేంద్రకమిటి సభ్యుడు సుధాకర్ రాష్ట్ర కమిటి సభ్యుడు భాస్కర్‌లుమృతిచెందగా తాజా శనివారం ఐదుగురు మావోయిస్టులు మృతిచెందినట్లు చత్తీస్‌గఢ్ పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు. మృతిచెందిన వారిలో ఇద్దరు మహిళలు ఉన్నారని తెలిపారు. మృతుల గుర్తింపు పక్రియ కొనసాగుతుందని. నేషనల్ పార్క్ ఏరియాలో సెర్చ్ ఆపరేషన్‌ను మరింత ఉధృతం చేసామన్నారు. దట్టమైన అటవి ప్రాంతం కావడంతో భద్రతా బలగాలకు కొంత సవాల్‌గా మారిందని కొందరు విషపూరిత క్రిమీకిటకాలు పాము కాటుకు గురైయ్యారని అనారోగ్య >>2

**న్యూఢిల్లీ, జూన్ 7:** దేశంలో కరోనాకేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. శనివారంఉదయానికి దేశంలో మొత్తం 5755 కేసులునమోదయినట్లు కేంద్ర ఆరోగ్యశాఖ ప్రకటించింది. ఒక్కరోజులోనే 391 కేసులుపెరిగాయి. అలాగే ఒక్కరోజులోనే నలుగురు మృతిచెందారు. మొత్తం మరణాలు 59గా నమోదయ్యాయి. ప్రస్తుతం ఆందోళన అవసరం లేదని, వైరస్ సోకినట్లు అనుమానం వచ్చినవెంటనే సమీపంలోని వైద్యులను సంప్రదించాలని వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తంచేసింది. దేశంలో రాష్ట్రాలవారీగాక ఏసులను చూస్తే కేరళలో అత్యధికంగా ఉన్నాయి. మొత్తం 1806 మందికి వైరస్‌సోకినట్లు తేలింది. ఆ తర్వాత స్థానంలో గుజరాత్ 717 కేసులుండగా ఢిల్లీమూడోస్థానంలో 665 కేసులతో నిలిచింది. దక్షిణాదిలో కర్ణాటకలో 444 కేసులునమోదయినట్లు ఆరోగ్యశాఖప్రకటించింది. అలాగే మహారాష్ట్రలోకూడా 577 మందికి వైరస్ నిర్ధారణ కాగా పశ్చిమబెంగాల్‌లో 622 మందికి వైరస్‌సోకినట్లు కేంద్రం ప్రకటించింది. ఒక్కరోజులోమృతిచెందినవారిలో మద్యప్రదేశ్‌కు చెందిన 45 ఏళ్ల మహిళ ఒకరుకాగా మహారాష్ట్రలో 63 ఏళ్ల వ్యక్తి ఒకరు ఉన్నారు.

### 6 వేలకు చేరువలో
# కరోనా కేసులు
### వివిధ రాష్ట్రాల్లో మృతులు 59



### ఇక మస్క్
# కొత్త పార్టీ!
### అధ్యక్షునితో వార్ సీరియస్
### అన్ని కాంట్రాక్టులు, రాయితీలు రద్దు చేస్తామన్న ట్రంప్



3



నక్సల్ వ్యతిరేక కార్యకలాపాల్లో కీలక పాత్ర పోషించిన అధికారులను శనివారం న్యూఢిల్లీలో అభినందిస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

# మావోయిస్టులు హతం

>> సమస్యలతో కొంత ఇబ్బందులు పడ్డారని ప్రస్తుతం వారందరూ ఆరోగ్య పరిస్థితి మెరుగుపడిందని చత్తస్ ఫుడ్ పోలీస్ ఉన్నతాధికారులు వెల్లడించారు. ఆపరేషన్ కగార్ అంతిమ దశకు చేరిందా అంటే అవుననే సమాదానం వస్తుంది కేంద్ర చత్తీస్‌గఢ్ ప్రభుత్వాల నుండి ఇప్పటికే బస్తర్ ప్రాంతాన్ని మావోయిస్టు రహిత జిల్లా ప్రకటించారు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా శనివారం ఆపరేషన్ పర్యవేక్షిస్తున్న అధికారులను అభినందించారు. ఇప్పటికే కర్రిగుట్టలు మాఢ్ ఏరియాలలో మావోల ఉనికి లేకుండా చేసిన భద్రతా బలగాలు ఇంద్రావతి నేషనల్ పార్క్ ఏరియాలోని దట్టమైన అటవి ప్రాంతంలోకి మావోయిస్టు అగ్రనేతలు తలదాచుకున్నట్లు నిఘా వర్గాల సమాచారం మేరకు ఆపరేషన్ నేషనల్ పార్క్ ను ప్రారంబించాయి. గడిచిన మూడురోజుల వ్యవధిలో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్ బాస్కర్ తోపాటు ఐదుగురు మావోయిస్టులు మృతిచెందారు. అగ్రనేతలు అందరూ ఆ ప్రాంతంలో ఉన్నారన్న సమాచారం మేరకు విశృత సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు.

**హిడ్మా తాజా చిత్రం వెలుగులోకి**

కేంద్రచత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వాల మోస్టు వాంటెడ్ నాయకుడు మాడ్వి హిడ్మా ఆలియాస్ సంతోష్ తాజా చిత్రం వెలుగులోకి వచ్చింది. ఇప్పటి వరకు హిడ్మా 25 సంవత్సరాల క్రితం ఫొటో నే ఇన్నాళ్లు అందు బాటులో ఉంది. ఆపరేషన్ అంతిమ దశకు చేరుకుంటున్న క్రమంలో హిడ్మా 51ఏళ్ల నాటికి చిత్రం బహిర్గతం కావడం తీవ్ర చర్చీయనాంశం అయ్యింది. అయితే తాజా చిత్రమా లేక గతంలో తీసిందా అన్న అనుమానాలు ఉన్నాయి. ఇన్నాళ్లు భద్రతా బలగాల దగ్గర లేన హిడ్మా ఫొటో ఇప్పుడు బహిర్గతం కావడంలో ఆయన కనుసన్నల్లో నడిచే పిఎల్ జి ఏ బలగాలు లొంగిపొయిన క్రమంలో పోలీసు అధికారుల చెంతకు చేరినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

# కేబినెట్ విస్తరణ నేడే

>> విస్తరణ ఉండే అవకాశం ఉందని ప్రచారం జరుగుతున్నప్పటికీ శనివారం రాత్రి పొద్దుపోయే వరకు కూడా జ్‌భవన్ నుంచి అధికారిక ప్రకటన వెలువడ లేదు. మంత్రి వర్గంలో చోటు దక్కించుకునేందుకు అనేక మంది పోటీ పడుతున్నారు. ఎస్సీ సామాజిక వర్గం నేతలు, రెడ్డి సామాజిక వర్గం నేతలు మంత్రి వర్గంలో స్థానం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ముదిరాజ్‌లకు కచ్చితంగా అవకాశం ఇస్తానని గత ఎన్నికల సమయంలో సీఎం రేవంత్ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. అంతేకాకుండా మైనార్టీలకు కూడా కేబినెట్‌లో చోటు లభించలేదు. అయితే ఇప్పుడు కేబినెట్ విస్తరణలో బీసీ, ఎస్సీ మాల, ఎసీ-మాదిగ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన ఎమ్మెల్యేలకు చోటు లభించే ఛాన్స్ ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఉన్న మంత్రుల్లో రెడ్డి సామాజిక వర్గం నుంచి ఎక్కువ సంఖ్యలో ఉండ టంతో ఈసారి కేటాయింపుల్లో వారికి నిరాశ ఎదురయ్యే అవకాశం లేకపోలేదు. ఈ సస్పెన్స్‌తో ఆశావాహుల్లో ఒకింత ఉత్కంఠ, మరోవైపు ఆందోళన నెలకొన్నాయి. మంత్రివర్గ విస్తరణలో నిన్నటి మొన్నటి వరకు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఆది శ్రీనివాస్, విజయశాంతి, సుద ర్శన్‌రెడ్డి, గడ్డం వివేక్, వాకిటి శ్రీహరి, ప్రేమ్‌సాగర్‌రావు, మదన్‌మోహన్‌రావు పేర్లు ప్రముఖంగా వినిపించాయి. తమ సామా జిక వర్గానికి మంత్రి పదవి ఇవ్వాలంటూ ఇటీవల మాదిగ సామాజిక వర్గం ఎమ్మెల్యేలు గళమెత్తారు. ఢిల్లీ పెద్దలను కూడా కలిశారు. ఈ క్రమంలో కేబినెట్ విస్తరణలో తమకు చోటు కల్పించాలంటూ మాదిగ సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యేలు శనివారం జూబ్లీ హిల్స్ నివాసం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. ముఖ్యమంత్రి ని కలిసిన వారిలో ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, చేవేళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యఉన్నారు. వీరిలో ఒకరికిఛాన్స్ ఇస్తా మని సిఎం హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. కాగా, కవ్వంపల్లి సత్య నారాయణ(మానకొండూరు)కు మినిస్టర్ పదవి కన్‌ఫార్మ్ అయిందని ప్రచారం జరుగుతోంది. ముదిరాజ్ సామాజికవర్గ నుంచి మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి అవకాశం వచ్చినట్లుగా జోరుగా ప్రచారం జరుగుతోంది. మాల సామాజికవర్గ నుంచి చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి కూడా మంత్రి పదవి దక్కే అవకాశం ఉందని అంటు న్నారు. సుదర్శన్ రెడ్డికి మంత్రి వర్గంలో కచ్చితంగా చోటు ఇవ్వాల్సిం దేనని పట్టుబడుతున్నట్లు సమాచారం. ఇప్పటికే కసరత్తు చేసిన పేర్లను పార్టీ అధిష్ఠానానికి నివేదించినట్లు సమాచారం. రాష్ట్ర వ్యవహా రాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడుతూ సమన్వయం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇద్దరు మంత్రుల శాఖలు మారే అవకాశాలు ఉన్నాయని, ఆ శాఖలలో ఒకటి సిఎం రేవంత్‌రెడ్డి ఖాతాల్లోకి వెడుతుందని, సిఎం రేవంత్‌రెడ్డి వద్ద ఉన్న ఒక శాఖ కొత్త మంత్రికి కేటాయింపు జరగవచ్చునని అంటున్నారు. కాగా, ఈసారి బీసీకి ఉప ముఖ్యమంత్రి పదవి వచ్చే అవకాశం కూడా ఉందని అంటు న్నారు. మంత్రివర్గంలో కూడికలు, తీసివేతలపై కూడా అధిష్ఠానం తీవ్ర కసరత్తు చేసినట్లు సమాచారం. గ్రేటర్ హైదరాబాద్ నుంచి ఎమ్మెల్సీ విజయశాంతికి మంత్రి పదవి ఖాయం అనేది సర్వత్రా చర్చ మొద లైంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టాక.. రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, ఖైరతాబాద్ నియోజకవర్గాలకు చెందిన బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరినప్పటికీ వారిలో ఎవరికీ మంత్రి పదవి రావడం ఖాయం కావడం లేదు. ఎమ్మెల్సీగా ఉన్న విజయశాం తి పేరు అధికంగా వినిపించింది. ఎన్నికల్లో పార్టీ తరపున ప్రచారం చేశారు. అధికారం వచ్చాక ఏమీ అడగలేదనీ, ఎమ్మెల్సీ పదవిని పిలిచి ఇచ్చారనేది టాక్ ఉన్నది. ప్రస్తుతం రాష్ట్ర మంత్రి వర్గం 11 మందితో ఉండగా అందులో ఇద్దరు మహిళల( కొండా సురేఖ, సీతక్కలు)కు మాత్రమే మంత్రి పదవి లభించింది. ఉన్న వారిలోనూ 1:3 గా చూసినా మరో మహిళకు మంత్రివర్గంలో చోటుకల్పించాల్సిన పరిస్థి తులు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనూ విజయశాంతికి మంత్రి పదవి లభించే అవకాశాలు కనిపిస్తున్నాయని ప్రచారం. దీనికి తోడు సినీరంగానికి చెందిన ఆమెకు మంత్రి పదవి ఇవ్వడం వల్ల చలనచిత్ర పరిశ్రమ కాంగ్రెస్‌కు అనుకూలంగా మారే దిశగా ప్రయత్నం చేసిన ట్టుగా ఉంటుందనేది రాజకీయ వర్గాల్లోని అభిప్రాయం. అయితే, గ్రేట ర్ నుంచి ప్రాతినిథ్యం వహించిన చిరంజీవికి గతంలో కేంద్ర మంత్రి పదవి లభించింది. సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి గెలిచిన సినీరంగానికి చెందిన జయసుధకు మంత్రి పదవి రాలేదు. ఇప్పుడు సినీరంగానికే చెందిన విజయశాంతికి మంత్రి పదవి ఇచ్చే అవకాశం లేకపోలేదని ప్రచారం. రంగారెడ్డి జిల్లాకు కేబినెట్‌లో కచ్చితంగా ప్రాతినిథ్యం కల్పించాలని పలువురు కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఈ కోటాలో మల్‌రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్ రెడ్డి తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కూడా మంత్రి పదవిని కోరుకున్నారని ప్రచారం.

# నేడు రేపు ఐసెట్ పరీక్ష

>> కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్ష కోసం రాష్ట్ర వ్యాప్తంగా 16 జోన్లలో 96 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలకి 34,409 మంది పురుషులు దరఖాస్తు చేసు కోగా.. 37,331 మంది మహిళలు దరఖాస్తు చేసుకున్నారు. నేడు (ఆదివారం) ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్‌లలో పరీక్షను నిర్వ హించనుండగా.. సోమవారం ఉదయం సెష న్‌ను నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 10 గంటలనుంచి 12.30 గంటల వరకు ఒక సెషన్‌ను.. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మరో సెషన్‌ను నిర్వహించనున్నారు. సోమవారం సెషన్‌ను ఉదయం 10గంటల నుంచి 12.30 గంటల వరకు పరీక్షను నిర్వహించనున్నారు.

# వైద్యపరీక్షల కోసం సిమ్లా ఆసుపత్రికి సోనియా గాంధీ

**సిమ్లా, జూన్ 7:** కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ అస్వస్థతకు గురి కావడంతో సిమ్లాలోని ఇందిరాగాంధీ మెడికల్ కళాశాల ఆసుపత్రిలో చేరారు. ముందురోజు కొంత ఆమె హైబిపితో అసహనానికి గురికావ డంతో వెంటనే ఆసుపత్రికి తరలించారు. హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి ప్రధాన సల హాదారు నరేష్ చౌహాన్ మాట్లాడుతూ ఆమె తరచూ నిర్వహించే వైద్య చెకప్‌లకోసమే వచ్చారని స్వల్పంగా ఆరోగ్యసమస్యలుండటం తో తనిఖీలకు వచ్చారన్నారు. కొన్ని పరీక్షలు చేసామని ప్రస్తుతం ఆరోగ్యం స్థిరంగా నిల కడగా ఉందన్నారు. 78 ఏళ్ల సోనియా గాంధీ ప్రైవేటు పర్యటనగా సిమ్లాకు వచ్చారు. ఛార బ్రాలో సోనియా కుటుంబానికి ఉన్న ప్రైవేటు నివాసంలోనే ఆమె బసచేసారు. సోనియాతో పాటు ఆమెకుమార్తె ప్రియాంక గాంధీ వాద్రా కూడా వెంట వచ్చారు. అయితే ఐజిఎంసి మేనేజ్‌మెంట్ మాత్రం సోనియా ఆరోగ్యంపై ఎలాంటిప్రకటన జారీచేయలేదు. గతంలో సోనియాను న్యూఢిల్లీలోని ఉదర సంబంధిత సమస్యలపై సర్‌గంగారామ్ ఆసుపత్రిలో చేర్చారు. అప్పుడు కూడా ఆసుపత్రి వైద్యులు ఆందోళనలేదని, ఆమె చికిత్సతో మెరుగుపడు తుందని ధీమా చెప్పారు. గతనెల 27వ తేదీ ఆమె చివరిసారిగా ప్రజల్లోకి వచ్చారు. నెహ్రూ 61వవర్ధంతి సందర్భంగా ఆమెఢిల్లీలోని శాంతి వనానికి వచ్చి నివాళులర్పించారు. అదే ఆమె ప్రజల్లోకి వచ్చిన సందర్భంగా పార్టీశ్రేణులు చెపుతున్నాయి. కాగా సిమ్లాలో వైద్యచికిత్సల అనంతరం తిరిగి ఆమె ఢిల్లీకి వెళ్లిపోయారు.

## వారం - వర్జ్యం

తేది : 08-06-2025, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
జ్యేష్ఠ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, శుక్ల పక్షం
ద్వాదశి ఉ.7.18
స్వాతి మ.12.40
వర్జ్యం సా.6.56-8.43
దు.సా.4.51-5.43
శుభసమయం : ఉ.8.30-9.15
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం :** పారిశ్రామిక, సాంకేతిక, కళారంగాల వారికి యోగదాయకమైన కాలం.

**వృషభం :** శాస్త్ర సాంకేతిక విషయంలో ఆసక్తి చూపుతారు. ఆర్థికంగా బలం చేకూరుతుంది.

**మిథునం:** ఆరోగ్యం మెరుగు పడుతుంది. మానసిక ప్రశాంతత పొందుతారు.

**కర్కాటకం:** సంఘంలో గౌరవం పొందు తారు. ఆరోగ్య సమస్యలు ఎదురైనా అధికమించి ముందుకు సాగుతారు.

**సింహం:** కాంట్రాక్టులు చేపట్టే వీలుంది. ప్రముఖులనుండి ముఖ్య సమాచారం అందుతుంది.

**కన్య :** ఉద్యోగులు ఊహించని ప్రమోషన్లు పొందుతారు. సమీప బంధువు లను కలిసి ఉల్లాసంగా గడుపుతారు.

**తుల :** ఇంటా బయటా ప్రోత్సాహం పొందుతారు. రాజకీయ రంగాలవారికి పదవియోగం.

**వృశ్చికం:** ఉద్యోగాలలో ఇంక్రిమెంట్లు పొందుతారు. రెండు, మూడు విధాలుగా ఆర్థిక లాభాలు పొందుతారు.

**ధనుస్సు:** ఉద్యోగులకు బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు. క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు.

**మకరం:** రుణాలు తీరి ఊరట చెందుతారు. భూ వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి.

**కుంభం:** పనుల్లో ఆటంకాలు ఎదురైనా అధి గమిస్తారు. విద్యార్థులు యత్నాలలో ఆటంకాలు ఎదురైై సన్నిహితుల సాయం అందుకొంటారు.

**మీనం :** ఇంటా బయటా ప్రోత్సాహం పొందుతారు. ఆర్థిక పరిస్థితి మెరుగు తుంది. వాహనసౌఖ్యం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 'కాళేశ్వరం' కల్పతరువు

>> అందులో తెలంగాణ వాడకం ఏనాడూ 400 టీఎంసీలు మించలేదు. 2014 వరకు తెలంగాణలో గోదావరిపై కట్టిన ప్రాజెక్టులు ఎస్సారెస్పీ, దేవాదుల మాత్రమేనని వివరించారు.. తెలంగాణ ఉద్యమం ఉప్పెనలా వస్తే, తలొగ్గిన కాంగ్రెస్ ప్రభుత్వం.. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది. అక్కడ నీటి లభ్యత ఉండదు. ప్రాణహితచేవెళ్ల నీటి నిల్వ సామర్థం కేవలం 11 టీఎంసీలు మాత్రమే. కాళేశ్వరం ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థం 141 టీఎంసీలు.. రెండింటి మధ్య ఎంత తేడా.. 2014 వరకు కాంగ్రెస్ నాయకులు సర్వే, మొబిలైజేషన్ అడ్వాన్సుల కింద రూ.2328 కోట్లు కాంట్రాక్టర్లకు ఇస్తే, పనులు జరగనేలేదు. ఇందులో తట్టెడు మట్టి కూడా ఎత్తకుండా మొబిలైజేషన్ అడ్వాన్సుల పేరిట రూ.1052 కోట్లు కాంగ్రెస్ ప్రభుత్వం స్వాహా చేసిందని స్వయంగా కాగ్ తన రిపోర్టులో వెల్లడించింది. ఇట్లా ఆ పైసలు కాంగ్రెస్ నాయకులు తీసుకొని జేబులు నింపుకున్నరు. అప్పుడు మంత్రులుగా ఉన్నది కూడా ఇదే కోమటిరెడ్డి, ఉత్తమ్, శ్రీధర్ బాబులే. ఆనాడు రేవంత్ రెడ్డి తెలుగుదేశం పార్టీలో ఉండి విమర్శించిండు. జలయజ్ఞం కాదు.. ధనం యజ్ఞం అన్నడు. కానీ ఈరోజు రేవంత్ రెడ్డే కాంగ్రెస్ అవినీతిని వెనకేసుకొస్తున్నడు. ఈ మధ్య ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడిండు. ప్రాణహిత చేవెళ్ల కోసం మేం రూ.10 వేల కోట్లు ఖర్చు పెట్టినం, ఇంకో రూ.20 వేల కోట్లు పెడితే అయిపోతుండె అన్నడు. నేను లెక్కలన్నీ తీయిస్తే కాంగ్రెస్ ఖర్చు చేసింది రూ.3700 కోట్లు మాత్రమేనని తేలింది. ఎందుకీ గోబెల్స్ ప్రచారం?. ప్రాజెక్టు ఖర్చు పెరిగిందని ఈ కాంగ్రెస్ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నరని ఆరోపించారు. 2007లో రూ.17,875 కోట్లకు జీవో ఇచ్చి, ఏ పని చేయకుండానే ప్రాజెక్టు ఖర్చును రూ.38,500 కోట్లకు పెంచింది కూడా కాంగ్రెస్ వాళ్లే అని ఆరోపించారు. ఆ తర్వాత కేంద్రానికి పంపినపుడు ఇదే కాంగ్రెస్ నాయకులు రూ.40,300 కోట్లకు పెంచారు అని హరీశ్‌రావు అన్నారు. కాళేశ్వరం కమిషన్ ముందు విచారణకు వెళ్తామని హరీశ్ రావు చెప్పారు. ఇక్కడ ఎవరూ భయపడడం లేదని తెలిపారు. తమకేం భయం లేదని, బాజాప్తా విచారణకు హాజరవుతామని స్పష్టం చేశారు. రాజకీయ లబ్ధి కోసమే కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, మేడిగడ్డ బ్యారేజీలో రెండు పిల్లర్లు కుంగితే మొత్తం కాళేశ్వర ప్రాజెక్టు కూలినట్లు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీళ్లిచ్చి కన్నీళ్లు తుడిచిన కేసీఆర్‌పై అభాండాలు వేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి తెలంగాణ గొంతు పిసికే ప్రయత్నం చేస్తున్నాయని చెప్పారు. కాళేశ్వరంపై ప్రజలకు వాస్తవాలు తెలియాలని, తాము చెప్పే విషయాలు నూటికి నూరుపాళ్లు నిజమన్నారు. కాళేశ్వరం అంటే 3 బ్యారేజీలు, 15 రిజర్వాయర్లు, 19 సబ్‌స్టేషన్లు, 21 పంప్‌హౌస్‌లు, 203 కి.మీ సొరంగాలు, 1,531 కి.మీ గ్రావిటీ కాలువలు, 98 కి.మీ ప్రెజర్ మెయిన్స్, 530 మీటర్ల ఎత్తుకు నీటి ఎత్తిపోతలు అని వివరించారు. మేడిగడ్డ బ్యారేజీని 7 బ్లాకులుగా 85 పియర్లుగా నిర్మించారు. ఈ ప్రాజెక్టుకు 3 వనరుల ద్వారా నీటి లభ్యత ఉంది. ఆ నీటితో వేలాది చెరువులు నింపొచ్చు. మేడిగడ్డ నుంచి మల్లన్న సాగర్ వరకు నిర్మించినవన్నీ వాడకంలోనే ఉన్నాయి. కాళేశ్వరం కింద కాలువ ద్వారానే 90 వేల ఎకరాలకు నీరు అందించొచ్చునని చెప్పారు. ఒక్క మల్లన్న సాగర్ లోనే 50 టీఎంసీల నీటి నిల్వ ఉంటుంది. ఎస్సారెస్పీకి నీళ్లు రానప్పుడు, కడెం నిండకుండా ఎల్లంపల్లికి కూడా నీళ్లు రానపుడు, మేడిగడ్డలో నీళ్లుంటాయి. ఎక్కడా నీళ్లు లేనపుడు కూడా నీళ్ల లభ్యమయ్యే పాయింట్ మేడిగడ్డ. వర్షాలు బాగా కురిసినపుడు ఎస్సారెస్పీ నుంచి మిడ్ మానేరుకు నీళ్లు తెచ్చుకున్నం. మిడ్ మానేర్‌లో పంప్ చేసి నుంచి అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండ పోచమ్మ సాగర్ వరకు నీళ్లు తెచ్చుకున్నం. కాళేశ్వరం కింద ఒక్క ఎకరా పారలేదు అంటడు సీఎం రేవంత్ రెడ్డి. ఇక ఉత్తమ్ కుమార్ రెడ్డి అయితే, 50 వేల ఎకరాలు మాత్రమే సాగయింది అంటడు. ఇంకో కాంగ్రెస్ నాయకుడేమో లక్ష ఎకరాలే పారింది అంటడు. ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు, ఒక్కో నాయకుడు ఒక్కో లెక్క చెబుతడు. కాళేశ్వరం నీళ్లతో ఇప్పటి వరకు నేరుగా 98,570 ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరందింది. కాళేశ్వరం ప్రాజెక్టు కాల్వల ద్వారా నింపిన 456 మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల ద్వారా 39,146 ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరందింది. కాళేశ్వరం ప్రాజెక్టు నీటితో ఎస్సారెస్పీ స్టేజీ 1, ఎస్సారెస్పీ స్టేజీ 2 , నిజాంసాగర్ నీటితో నింపిన 2143 మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల ద్వారా 1 లక్షా 67 వేల కొత్త ఆయకట్టు సాగయింది. ఎస్సారెస్పీ స్టేజీ 1, ఎస్సారెస్పీ స్టేజీ 2, నిజాంసాగర్ ప్రాజెక్టులకు కాళేశ్వరం నీరందించి 17 లక్షల 8 వేల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించడం జరిగింది. కాళేశ్వరం నీళ్లు కూడెల్లి వాగు, హల్దీ వాగుల ద్వారా 66 చెక్ డ్యాములతో మరో 20 వేల 576 ఎకరాలకు సాగునీరందింది అని హరీశ్‌రావు అన్నారు.

# భవిష్యత్తు 'గ్రీన్ పవర్'దే

>> తెలంగాణ రాష్ట్రంలో గ్రీన్ పవర్ ఉత్పత్తికి సంబంధించి లక్ష కోట్ల రూపాయలు విలువైన ఎంఓయు లు జరిగాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. తెలంగాణ రాష్ట్రం 2025 న్యూ ఎనర్జీ పాలసీని తీసుకువచ్చింది, 2029-30 నాటికి తెలంగాణ రాష్ట్రంలో 2000 మెగావాట్ల గ్రీన్ పవర్ ఉత్పత్తి లక్ష్యంగా ముందుకు పోతున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. దేశవ్యాప్తంగా పెరుగుతున్న విద్యుత్తు వీడియో గాని దృష్టిలో పెట్టుకొని వివిధ మార్గాల్లో విద్యుత్ ఉత్పత్తికి అవకాశాలను అన్వేషిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మిగులు విద్యుత్ దిశగా ముందుకు పోతుందని తెలిపారు. ఈ ప్రపంచంలో ప్రతి ఉత్పత్తికి విద్యుత్తు అవసరం, ఉత్పత్తి పెరగాలంటే విద్యుత్తు సరఫరా పుష్కలంగా ఉండాలి, ఉత్పత్తులు పెరిగితే ఉపాధితో పాటు రాష్ట్ర జీడీపీ పెరుగుతుంది ఇదంతా ఒక చక్రంలా తిరుగుతుందని డిప్యూటీ సీఎం వివరించారు. దేశవ్యాప్తంగా విద్యుత్ వినియోగం రోజురోజుకు పెరుగుతోంది కేవలం బొగ్గు ఆధారంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తే ఖర్చు పెరగడంతో పాటు, కాలుష్యం పెరిగి వాతావరణ సవాతుల్యం దెబ్బతింటుంది. ఈ నేపథ్యంలో ప్రపంచం మొత్తం గ్రీన్ పవర్ వైపు పరుగులు పెడుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు. అన్ని దేశాలు సోలార్‌తో పాటు విండ్, థర్మల్, అప్పుడు స్టోరేజ్, ఫ్లోటింగ్ సోలార్, హైడ్రోజన్ పవర్ వంటి మార్గాల ద్వారా విద్యుత్పత్తిని ప్రోత్సహిస్తూ ముందుకు పోతున్నాయని తెలిపారు.

పగలు సోలార్ ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్ ను స్టోరేజీ చేసుకొని, రాత్రివేళ పంపుడు స్టోరేజ్ ద్వారా పీక్ అవర్స్ లో విద్యుత్తు ఉత్పత్తి చేయడం విదేశాలకు సరఫరా చేస్తున్న గ్రీన్ కో ఇంటిగ్రేటెడ్ పవర్ ప్రాజెక్టును కంపెనీ యాజమాన్యం ఆహ్వానం మేరకు గ్రీన్ పవర్ ఉత్పత్తి పరిశీలనకు కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం పిన్నాపురం గ్రామానికి వచ్చినట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. గ్రీన్ కో పవర్ కంపెనీ అనుకున్న సమయానికి విద్యుత్తు ఉత్పత్తిని ప్రారంభించడం అభినందించదగిన విషయం అన్నారు. వారు 4వేల ఎకరాల విస్తీర్ణంలో ఒకే చోట సోలార్, విండ్, పంపుడ్ స్టోరేజీ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయడం ప్రపంచంలోనే మొదటిసారి అని తెలిపారు. గ్రీన్ కో కంపెనీ సోలార్ ద్వారా నాలుగు వేల మెగావాట్లు, విండ్ పవర్ ద్వారా వేయి మెగావాట్లు, పంపుడు స్టోరేజీ ద్వారా 1,680 మెగావాట్లు మొత్తంగా ఒకే చోట 6,680 మెగావాట్ల గ్రీన్ పవర్ ఉత్పత్తి అభినందించదగిన విషయం అన్నారు. దేశంలో భవిష్యత్తులో గ్రీన్ కో వంటి ప్రాజెక్టులు పెద్ద ఎత్తున రావాల్సిన అవసరం ఉందని అన్నారు.

గ్రీన్ కో పవర్ ప్రాజెక్టు సందర్శనలో భాగంగా భాగంగా డిప్యూటీ సీఎం ప్రాజెక్ట్ సైట్‌పై హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే నిర్వహించారు. క్లోజ్డ్‌లూప్ పంప్డ్ స్టోరేజ్ సిస్టమ్‌కు సంబంధించిన ఎగువన మరియు కింది రిజర్వాయర్లు, పవర్‌హౌస్ కాంప్లెక్స్, ఆధునిక సబ్ స్టేషన్ వంటి కీలక మౌలిక సదుపాయాలను పరిశీలించారు. గ్రీన్‌కో సంస్థకు చెందిన ఇంజినీర్లు మరియు నిర్వహణ బృందంతో మాట్లాడిన ఉప ముఖ్యమంత్రి, ఈ ప్రాజెక్టులో సోలార్ పవర్, విండ్ పవర్ మరియు రోజుకు రెండు సార్లు నాలుగు గంటల నిల్వ సామర్థంతో కూడిన 1,680 మెగావాట్ల హైడ్రో పవర్ నిల్వ వ్యవస్థ కలిపి నిర్వహిస్తున్న విధానాన్ని డిప్యూటీ సీఎం తన అధికార బృందంతో కలిసి పర్యటించారు. డిప్యూటీ సీఎం వెంట ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ట్రాన్స్‌కో సిఎండి కృష్ణ భాస్కర్, జెన్ కో సిఎండి హరీశ్, దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శనివారం బక్రీద్ సందర్భంగా హైదరాబాద్‌లోని గోల్కొండ టూంబ్స్ వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు

# బనకచర్ల ప్రాజెక్టుపై నిర్ణయించలేదు..

>> మీడియా వర్క్ షాప్ లో మాట్లాడుతూ పాకిస్థాన్ ఉగ్రవాదుల చేతుల్లో వందల మంది చనిపోతే కాంగ్రెస్ ఏనాడు స్పందించలేదన్నారు. కానీ ఇప్పుడు ఈ అంశంపై విమర్శలు చేయడాన్ని తప్పుపట్టారు. పాక్ మన సైనికులని చంపితే ఉగ్రవాద స్థావరాలని సర్జికల్ స్ట్రైక్ పేరుతో ధ్వంసం చేశామని, అదే విధంగా పహల్గాంలో ఉగ్రవాదులు టూరిస్ట్‌లని చంపితే సింధూర్ పేరుతో దాడులు చేశామని చెప్పారు. రాహుల్ గాంధీ దమ్ముంటే తమను విమర్శించాలని, సైనికులని కాదని అన్నారు.

**బిజెపి సోషల్ మీడియా అసలైన వార్ చేస్తుంది**

బిజెపి సోషల్ మీడియా పనితీరు బాగున్నట్లు చెప్పిన కిషన్ రెడ్డి.. సోషల్ మీడియా అసలైన వార్ చేస్తుందని కొనియాడారు. తెలంగాణ అభివృద్ధి జరగాలంటే బిజెపి రావాలని, తెలంగాణను రక్షించే పార్టీ బిజెపియేనని ఈ సందర్భంగా అన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు ప్రజలకి ఇచ్చినా హామీలను అమలు చేయడంలో విఫలమయ్యాయని విమర్శించారు.

**రక్షణ రంగంలో మరో ముందడుగు**

భారత రక్షణ రంగంలో మరో ముందడుగు పడిందన్నారు. ఫ్రాన్‌కు చెందిన ప్రఖ్యాత డసో ఏవియేషన్ సంస్థ యొక్క రఫేల్ యుద్ధ విమానాల ప్రధాన భాగాలైన ఫ్యూసిలేజ్లు ఇకపై హైదరాబాద్లో తయారు కానున్నాయి. ఈ మేరకు టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ (టీఏఎస్ఎల్), డసో ఏవియేషన్ మధ్య ఒక ఒప్పందం కుదిరిందని తెలిపారు. రఫేల్ యుద్ధ విమానాల తయారీకి సంబంధించి ఫ్రాన్స్ వెలుపల ఇటువంటి అత్యాధునిక విడిభాగాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ఇదే మొదటిసారి.

ఈ ఒప్పందం ద్వారా రఫేల్ యుద్ధ విమానాలకు అవసరమైన ఫ్యూసిలేజ్లను హైదరాబాద్లోని టాటా అడ్వాన్స్డ్ సిస్టమ్స్ ఉత్పత్తి చేయనుందని తెలిపఆరు. ఈ పరిణామం తెలంగాణలో విమాన తయారీ పరిశ్రమ విస్తరణకు, దేశీయ సంస్థలు తమ తయారీ సామర్థ్యాన్ని మరింత ఉన్నతస్థాయికి తీసుకువెళ్లడానికి దోహదపడుతుందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా ప్రపంచ రక్షణ ఉత్పత్తుల సరఫరా వ్యవస్థలో భారత్ తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకోనుందని ఆయన అభిప్రాయపడ్డారు. రక్షణ ఎగుమతులలో భారత్ ప్రగతిప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో రక్షణ ఎగుమతులు గణనీయంగా వృద్ధి చెందాయని కిషన్ రెడ్డి తెలిపారు. 2013-14 ఆర్థిక సంవత్సరంలో రూ.686 కోట్లుగా ఉన్న రక్షణ ఉత్పత్తుల ఎగుమతులు 2024-25 నాటికి రూ.23,622 కోట్లకు చేరాయని ఆయన వివరించారు. ప్రస్తుతం భారత్ 80కి పైగా దేశాలకు రక్షణ ఉత్పత్తులను ఎగుమతి చేస్తోందని, ఇది దేశానికి గర్వకారణమని అన్నారు.

# ఆరుగురు గల్లంతు

>> నలుగురు యువకులు మహదే వపూర్ మండలం అంబట్‌పల్లి గ్రామానికి చెందిన వారు కాగా మరో ఇద్దరు యువకులు మహముత్తారం మండలం కొర్లకుంట, స్థంభంపల్లి (పిపి) గ్రామాలకు చెందిన వారుగా గుర్తించారు. గల్లంతైన వారిలో అంబట్‌పల్లి గ్రామానికి చెందిన మధుసూదన్, శివ మణి(నాని), రక్షిత్, సాగర్, మహముత్తారం మండలం స్థంభంపల్లి(పిపి) గ్రామానికి చెందిన పసుల రాహుల్, కొర్లకుంట గ్రామానికి చెందిన బొల్లెద్ల పండుగా గుర్తించారు. గల్లంతైన యువకులంతా ఒకే సామాజిక వర్గానికి చెందిన కుటుంబసభ్యులు, బంధువులుగా గుర్తించా రు. కాగా వీరంతా గ్రామంలోని బంధువుల వివాహానికి హాజరైనట్లుగా తెలుస్తోంది. వివాహం, విందు జరిగిన మరుసటి రోజు కార్యక్రమానికి హాజరైన యువకులంతా ఓ ఆటోలో మేడిగడ్డ బ్యారేజ్ వద్ద ఈతకోసం సరదాకు వచ్చి ఈత చేస్తున్న క్రమంలో వరద ప్రవాహానికి ఒకొక్కరుగా గల్లంతైనట్లుగా తెలిపారు. ఇద్దరు యువకులు సహాయం చేస్తున్న క్రమంలో వారు కూడా వరద ఉధృతికి గల్లంతైనట్లుగా తెలుస్తోంది. కాగా విషయం తెలుసుకున్న యువకుల కుటుంబ సభ్యులు, బంధువులు సంఘటన స్థలానికి చేరుకొని రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. సమాచారం అందు కున్న వెంటనే జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే, కాటారం డిఎస్పీ గడ్డం రామ్మోహన్ రెడ్డి, మహదేవపూర్ సిఐ రాంచందర్ రావు, మహదేవపూర్ ఎస్సై కె.పవన్ కుమార్ చేరుకొని సహాయక చర్యలు చేపడుతున్నారు.

# పేదరికం తగ్గుతోంది!

>> తగ్గిపోయిందని ప్రపంచ బ్యాంకు ప్రకటించడం భారత్‌కు శుభసూచకం. రోజుకు 3 డాలర్ల దినసరి వేతనం వస్తున్నట్లయితే గ్రామీణ ప్రాంతాల్లో కొంతమేర విముక్తికి ఆస్కారం ఉంటుందని తేల్చింది. 2017 ధరలప్రకారంచూస్తే రోజుకు 2.15 డాలర్ల వ్యయం అవసరం అవుతోంది. దుర్భరదారిద్ర్యంలో ఉన్న ప్రజానీకం జనాభాలో 2.3వాతం వరకూ ఉన్నట్లు తేలింది. అదే దశాబ్దం క్రితంచూస్తే 16.2శాతం వరకూ ఉన్నట్లు ప్రపంచబ్యాంకు చూపించింది. ఇక మల్టీడైమన్షనల్ పావర్టీ సూచీని బట్టిచూస్తే 2005-06లో 53.8శాతం ఉన్న పేదరికం 2019-21 నాటికల్లా 16.4శాతానికి దిగివచ్చిందని, రానురాను 2022-23నాటికి 15.5శాతంగా వచ్చిందన్నారు.

బిజెపి ఆధ్వర్యంలోనిఎన్డీయే ప్రభుత్వం కేంద్రంలో 11ఏళ్ల పాలన పూర్తిచేసుకుంది. ఈ పదకొండేళ్ల కాలంలోనే పేదరికాన్ని గణనీయంగా తగ్గించేందుకు కృషిచేసింది. పిఎం ఆవాస్‌యోజన, పిఎం ఉజ్వల యోజన, జన్‌ధన్‌యోజన, ఆయుష్మాన్‌భారత్ వంటిపథకాలు గ్రామీణ భారతావనికి ఎంతోమేలుచేసినట్లు తెలుస్తోంది. నేరుగా లబ్దిబదిలీ (డిబిటి) ద్వారా నేరుగా ప్రభుత్వప్రయోజనాలు లబ్దిదారుల ఖాతాల్లోనే జమ అవుతున్నట్లు తేలింది.

# ఈటల మాటలు అసత్యాలే..

>> పొందలేదని మంత్రి తుమ్మల తేల్చిచెప్పారు. కాళేశ్వరం ఎప్పుడూ కేబినెట్ ముందుకు రాలేదు. పరిపాలన అనుమతులతోనే కాళేశ్వరం అమలులోకి వచ్చింది. ఈటెల రాజేందర్ ప్రజలకు తప్పుడు సమాచారం ఇచ్చారు. కమిషన్ ముందు ఈటలకు అబద్ధాలు ఆడాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది. ఈటల పట్ల గౌరవం ఉంది, కానీ ఆయన ప్రకటన చూసిన తర్వాత కొంత బాధేసింది. నేను స్వయంగా కమిషన్‌కు సబ్ కమిటీ రిపోర్ట్‌ను ఇవ్వాలని అనుకుంటున్నా. కమిషన్ వివాదంలోకి నన్ను ఎందుకు లాగాల్సి వచ్చిందో ఈటలే సమాధానం చెప్పాలి. తుమ్మల కూడా కాళేశ్వరం కోసం సబ్ కమిటీ రిపోర్ట్ పై సంతకం చేశారని ఇచ్చిన వాగ్మూలం బాధాకరం. కాళేశ్వరం అంశం కేబినెట్ ఉమ్మడి నిర్ణయమని చెప్పడం సరికాదు. హరీష్ రావు అబద్దాల హరీష్ రావుగా మారిపోయారని మంత్రి తుమ్మల అన్నారు. కాళేశ్వరం కేబినెట్ ముందుకు వచ్చినట్లు రుజువు చూపించాలని ఈటలను తుమ్మల డిమాండ్ చేశారు. కాళేశ్వరం వివాదంలోకి తనను లాగుతున్నారని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. కాళేశ్వరం కమిషన్ ముందు ఈటల అబద్దాలు చెప్పారని.. సబ్ కమిటీకి కాళేశ్వరానికి సంబంధం లేదని పేర్కొన్నారు. మేడిగడ్డకు అనుమతులు ఇచ్చిన తర్వాత కమిషన్ వేశారని తెలిపారు. ఈటల రాజేందర్ చేసిన ప్రకటన అవాస్తవమని.. కమిషన్ ముందు అబద్దాలు చెప్పాల్సిన అవసరం ఏంటని ప్రశ్నించారు. ఈటెల తన వాంగ్మూలాన్ని అనాలోచితంగా ఇచ్చారా లేక ఇవ్వాల్సిన పరిస్థితులు వచ్చాయా అని అడిగారు. తప్పుడు ప్రకటనలతో ఎక్కువ రోజులు మభ్యపెట్టలేరని పేర్కొన్నారు. తాను సుమోటోగా కాళేశ్వరం కమిషన్ ముందుకు వెళ్తానని మంత్రి తెలిపారు. కాళేశ్వరంపై సబ్‌కమిటీ ఎప్పుడూ నివేదిక ఇవ్వలేదని.. అందుకు సంబంధించిన వివరాలన్నీ కమిషన్ దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. ప్రాణహితపై మాత్రమే స్టేటస్ రిపోర్టు ఇచ్చామని, పెండింగ్ ప్రాజెక్టులపై మాత్రమే కమిషన్ వేశారని పేర్కొన్నారు. కాగా, తుమ్మల గతంలో బీఆర్ఎస్ పార్టీలో ఉండే వారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీలోకి చేరి ప్రస్తుతం మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.



# ఢిల్లీ విమానాశ్రయంలో రోజుకు 114 విమానసర్వీసులు రద్దు

### డయల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ వెల్లడి

**న్యూఢిల్లీ, జూన్ 7:** ఢిల్లీలో ఈ నెల 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు ప్రతిరోజు 114 దేశీయ విమాన సర్వీసుల రాకపోకలను రద్దు చేస్తున్నట్లు ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయ లిమిటెడ్ ప్రకటించింది. ఢిల్లీ విమానాశ్రయ రన్‌వే ఆధునీకరణలో భాగంగా వీటిని రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు. మరో 86 విమానాలను తిరిగి రీ షెడ్యూల్ చేయనున్నట్లు తెలిపారు. వాటాదారులతో విస్తృత చర్యలు జరిపిన తర్వాత దీనిపై నిర్ణయానికి వచ్చినట్లు డయల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ విదేహ్ కుమార్ జైపురియార్ పేర్కొన్నారు. ఇక్కడ 4 రన్‌వేలు ఉండగా ప్రయాణికుల కోసం రోజుకు 1,450 విమాన సర్వీసులు ఉంటాయి. తాజాగా పలు విమాన సర్వీసులను రద్దు చేయడంతో ప్రయాణికులకు కొంతమేర అసౌకర్యం కలిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. విమానాల రద్దు వల్ల ప్రయాణికులకు ఇబ్బందులు రాకుండా రద్దీ వేళల్లో అందుబాటులో ఉండే విమానాలను సాధారణ సమయాల్లోనూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు జైపురియార్ తెలిపారు. ఇందులోభాగంగా ప్రముఖ విమానయాన సంస్థలైన ఇండిగో, ఎయిర్ ఇండియాలు రోజుకు 33, 25 విమాన సర్వీసులను రద్దు చేసుకునే అవకాశం ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఢిల్లీ విమానాశ్రయంలో విమాన సర్వీసుల రద్దు వల్ల దేశంలోని పలు ప్రధాన విమానాశ్రయాల్లోని విమానాలపై స్వల్ప ప్రభావం పడుతుందన్నారు. ముంబయి విమానాశ్రయం నుంచి రాకపోకలు 56 నుంచి 54కు తగ్గుతాయని, కోల్‌కతాలో 22 నుంచి 21కి, అహ్మదాబాద్‌లో 21 నుంచి 19కి, బెంగళూరులో 38 నుంచి 36కి, చెన్నైలో 20 నుంచి 19కి, పట్నాలో 13 నుంచి 12కి తగ్గుతాయని వివరించారు.

## అలనాటి మేటినటి విజయభాను కన్నుమూత



విజయభాను (ఫైల్)

**హైదరాబాద్, జూన్ 7:** అలనాటి నటీమణి, 70వ దశకంలో ఒక వెలుగు వెలిగిన అగ్రశ్రేణి కథానాయకి విజయభాను కన్ను మూసారు. చెన్నైలోని ఆమె స్వగృహం చూసుకునేందుకు అమెరికా నుంచి వచ్చిన ఆమె ఇక్కడే పరమ పదించారు. ఆమె వయసు 68 యేళ్లు. ఆమె ఏకైక కుమార్తె అమెరికా యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. విజయభాను స్వస్థలం అనంతపురం. అయితే ఆమె పుట్టింది, పెరిగింది చెన్నైలోనే. కెరీర్ శిఖరాయ మాన స్థితిలో ఉండగానే ఒక అమెరికన్‌తో ప్రేమలోపడి కెరీర్‌తోపాటు భారత్‌ను విడిచి అమెరికాలోని లాస్‌ఏంజెల్స్‌లో స్థిరపడ్డారు. స్వతహాగా నృత్యకారణి కావడంతో శ్రీశక్తి శారదా నృత్యనికేతన్ స్థాపించి అమెరికాలోనే వేలాదిమందికి శిక్షణ ఇచ్చారు. భరత నాట్యం, కూచిపూడి, కథక్, కథాకళి వంటి నృత్యరీతుల్లో విజయభాను నిష్ణాతురాలు. అప్పటి ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి చేతులమీదుగా నాట్యమయూరి బిరుదును కూడా స్వీకరించారు. ప్రపంచవ్యాప్తంగా అనేక నృత్య ప్రదర్శనలిచ్చిన విజయభాను అనంతపురంలో ఆమె తల్లి కట్టించిన శివనారాయణ పంచముఖ ఆంజనేయ దేవాలయానికి ఇతోధికంగా సాయం చేసారు. భారత్ పర్యటనకు గత నెలలోనే వచ్చి చెన్నై లోని సొంత ఇంటిని చూసుకునేందుకు వెళ్లి వడదెబ్బకు గురై అసువులు బాసారు. నిప్పులాంటి మనిషి, ఇదికథ కాదు, కిలాడి బుల్లోడు, ఒకనారి వంద తుపాకులు, చందన, ప్రియబాంధవి, స్త్రీ, శభాష్ పాపన్న, చిన్నకృష్ణుడు తదితర చిత్రాలు విజయభానుకు మంచిపేరు తెచ్చి పెట్టాయి. విజయభాను సోదరి కలైమామణి డా.సింధూరి జయసింఘే మాట్లాడుతూ స్ఫూర్తిదాయకమైన ఆమె జీవితంపై పుస్తకం తీసుకురావాలని నిర్ణయించామన్నారు. ఆమె మృతికి మాజీ ఎంపి జయప్రద, నటుడు సుమన్, ప్రముఖ దర్శక నిర్మాత వైవిఎస్ చౌదరి తదితరులు సంతాపం తెలిపారు.

## బెంగళూరు కమిషనర్ దయానంద సస్పెన్షన్‌పై
# విశ్రాంత ఐపిఎస్‌ల అభ్యంతరం

### కమిషనర్ ఒక్కరినే బాధ్యుడిని చేయడం సరికాదు: కిరణ్‌బేడి

**హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త:** బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరిగిన తొక్కిసలాట ఘటనకు సంబంధించి బెంగళూరు పోలీసు కమిషనర్ దయానందను కర్ణాటక సర్కారు సస్పెండ్ చేయడంపై మాజీ లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్‌బేడిసహా విశ్రాంత ఐపిఎస్ అధికారులు తీవ్రఅభ్యంతరం వ్యక్తం చేశారు. ఐపిఎల్ ట్రోఫీ గెలుచుకుని బెంగళూరులో జరిగిన సన్మానసభకు హాజరైన ఆర్‌సిబి జట్టు సభ్యులను చూసేందుకు క్రికెట్ అభిమానులు చిన్న స్వామి స్టేడియం వద్దకు భారీగా రావడం, వీరిని అదుపు చేయడంలో పోలీ సులు విఫలమవడంతో తొక్కిసలాట జరగడం తెలిసిందే. ఈ తొక్కిసలాటలో 11 మంది మరణించగా 50 మందికిపైగా గాయపడ్డారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన కర్ణాటక సర్కారు బెంగళూరు పోలీసు కమిషనర్ దయానందతోపాటు స్థానిక డిసిపి, ఎసిపి సహా ఐదుగురు పోలీసు అధికా రులను సస్పెండ్ చేయడం విదితమే. తొక్కిసలాట ఘటన జరిగి నాలుగు రోజులు గడవగా అధికారులపై వేటుపడి మూడు రోజులవుతోంది. దీనిపై శనివారం పుదుచ్చేరి మాజీ లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్‌బేడి స్పందిస్తూ బెంగ ళూరులో జరిగిన తొక్కిసలాట ఘటనకు పోలీసు కమిషనర్ దయానంద ఒక్క డినే బాధ్యుడిని చేయడం సరైంది కాదన్నారు. పోలీసు వ్యవస్థలో ఆయన ఒక భాగమని, ఆర్‌సిబి సన్మానసభకు ఒకరోజు ముందు దయానంద ఆయన బృందం బందోబస్తు ఏర్పాట్లు చేశారని, ఇందులో రాజకీయ నేతలతోపాటు ఇతర విభాగాల అధికారులు కూడా ఉన్నారని, అయితే అందరిని వదిలి కేవలం దయానందను మాత్రమే సస్పెండ్ చేయడం ఏమిటని కిరణ్‌బేడి ప్రశ్నించారు. ఏ రాష్ట్రంలో అయినా శాంతిభద్రతల అంశం ప్రత్యేకమైనదిగా ఆమె అభి వర్ణించారు. అయితే ఏదైనా అనుకోని ఘటన జరిగినపుడు ఇది ఎందుకు జరిగిందనడానికి ఒకరు కావాలని ఆమె తెలిపారు. ఈ ఘటనలో దయానం దను బలిపశువు చేయడం అన్యాయమని ఆమె తెలిపారు. ఈ చర్య మొత్తం పోలీసు వ్యవస్థను నిరాశకు గురిచేసిందని ఆమె తెలిపారు. ఇటువంటి ఘట నలు జరిగినపుడు ప్రభుత్వంలోని ఉన్నతాధికారులు పోలీసులతో చర్చలు జరపాల్సి ఉందని, బెంగళూరులో అలా జరగలేదని ఆమె అభిప్రాయపడ్డారు. కాగా ఇదే ఘటనపై బెంగళూరు మాజీ పోలీసు కమిషనర్ భాస్కర్‌రావు మాట్లాడుతూ దయానంద వంటి నిజాయితీ అధికారులను సస్పెండ్ చేయడం సరైంది కాదని తెలిపారు. ఆర్‌సిబి సన్మానసభకు బందోబస్తు కోసం దయా నంద ఆయన సహచర అధికారులు అంతకుముందు రోజునుంచే నిద్రాహా రాలు మాని విధుల్లో ఉన్నారని భాస్కర్‌రావు తెలిపారు. ఇందుకు బదులుగా కర్ణాటక సర్కారు దయానందను సస్పెండ్ చేసిందని ఆయన ఆవేదన చెందారు. ఈ ఘటనపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తావులేకుండా పోలీ సులు విచారణ సాగించాలని ఆయన పేర్కొన్నారు.

## నేడు చేపప్రసాదం పంపిణీ సర్వం సిద్ధం

**హైదరాబాద్ గోషామహల్, జూన్ 7, ప్రభాతవార్త:** ప్రతి యేటా మాదిరిగానే ఈ యేడు కూడా ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జూన్ 8, 9 తేదిల్లో జరుగనున్న చేప ప్రసాదం పంపిణికి ప్రభుత్వం తరపున చేయాల్సిన ఏర్పాట్లను పూర్తి చేశారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే ప్రజలందరూ(ఆస్తమారోగులు)తమ వంతు వచ్చే వరకు క్యూలైన్లలో వేచి ఉండి ప్రశాంతంగా ప్రసాదం స్వీకరించి సురక్షితంగా తిరిగివెళ్లేందుకు ప్రభుత్వపరంగా చర్యలు చేపట్టారు.

**వివిధ విభాగాల అధికారుల సమన్వయంతో చేపప్రసాదం ఏర్పాట్లు**

పోలీసురెవెన్యూ, అర్అండ్‌బి. వాటర్‌వర్క్స్ మత్స్య, సమాచార, విద్యుత్, వైద్య, జిహెచ్‌ఎంసి, అగ్నిమాపక, జలమండలి తదితర శాఖల సమన్వయంతో రోగులకు ఎటువంటి ఇబ్బంది అసౌకర్యం కలుగకుండా అవసరమైన ఏర్పాట్లు చేశామని తెలిపారు. ముఖ్యంగా పరిస్థితులను ఎప్పటికప్పుడు బేరీజ్ వేస్తూ తగు చర్యలు తీసుకునేందుకు ప్రజలకు తగు సూచనలు అందించేందుకు వీలుగా పోలీసు సమాచార, రెవెన్యూతదితర శాఖల అధికారులతో కూడిన కంట్రోల్ రూంను ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. ఇందులో తెలుగు, హిందీ, ఉర్దూ తదితర భాషలో ప్రజలకు సూచనలు ఇచ్చేందుకు అనౌన్సర్లను కూడా ఏర్పాట్లు చేశామన్నారు. ఇప్పటికే బ్యారికేడింగ్, పబ్లిక్ అడ్రస్‌సిస్టమ్, సూచికలు, మంచినీరు, షెడ్లు పారిశుద్ధ్యం వంటి ఏర్పాట్లు పూర్తి అయ్యాయన్నారు. రోగులకు అత్యవసర పరిస్థితుల్లో చికిత్సలు అందించడానికి వీలుగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆద్వర్యంలో ఆరోగ్య శిబిరాలు 4, అంబులెన్స్ 3, సర్వీ సులు కూడా సిద్ధంగా ఉన్నట్లు ఆయనతెలిపారు. మత్స్య శాఖద్వారా ఇప్పటికే లక్ష32వేల చేపపిల్లలు సిద్ధంచేశారని, 32టోకెన్ కౌంటర్లు, 32 చేపపిల్లల కౌంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో గలటాయిలైట్లు కాకుండా మొబైల్ టాయిలైట్లు కూడా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జలమండలి ద్వారా మంచినీటిట్యాంకర్లు త్రాగునీటి ప్యాకెట్లు సిద్ధం చేసినట్లు తెలిపారు. సెం ట్రల్‌జోన్ పోలీసులు దాదా 1000మంది పోలీసులు బందోబస్తు చేయనున్నట్లు చెప్పారు. 75 సిసి కెమెరాలను కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. హైదరాబాద్ ఆర్‌డిఓతోపాటు ఆయా మండల తహాసిల్దార్లు ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.

**నేటి నుంచి 9వ తేదీ వరకు ట్రాఫిక్ అంక్షలు**

**ట్రాఫిక్ జాయింట్ కమిషనర్**

నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ప్రతి యేటా మృగ శిర కార్తె సందర్భంగా ఈనెల 8 నుంచి 9 తేది వరకు ట్రాఫిక్ అంక్షలను అమలు చేస్తున్నట్లు నగర ట్రాఫిక్ జాయింట్ కమీషనర్ జోయల్ డేవిస్ తెలిపారు. చేప ప్రసా దం పంపిణి సందర్బంగా ప్రధాన రహదారిపై సాధారణ వాహనాలకు అనుమతి ఉండదన్నారు. సిద్దింబర్ బజార్ మసీద్ నుంచి ఎంజె మార్కెట్, పుత్లీబౌలి, గాంధీభవన్ వైపునకు భారీ వాహనాలను అనుమ తించ మన్నారు. చేపప్రసాదం కోసం వచ్చేవారు తమ వాహనాలను గృహకల్ప, గగన్‌విహార్, చంద్ర విహార్ పార్కింగ్‌లలో నిలుపుకోవా లన్నారు. బస్ ఇతర వాహనాల్లో వచ్చే వారిని గాంధీభవన్, బస్‌స్టాప్ నుంచి గేట్ నెంబర్ 2 నుంచి అనుమతి ఇస్తామన్నారు.

## సిరప్ వికటించి చిన్నారి మృతి
### మరో నలుగురికి అస్వస్థత

**అల్లాదుర్గం, జూన్ 7, ప్రభాతవార్త:** జ్వరం నయం కావడానికి వినియోగించిన సిరప్ వికటించి ఐదేళ్ళ చిన్నారి మృతి చెందగా మరో నలుగురు చిన్నారులు అస్వస్థతకు గురియిన సంఘటన మండల పరిధిలో శనివారం మండల కేంద్రమైన అల్లాదుర్గంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... అల్లాదుర్గం గ్రామానికి చెందిన సిద్దప్ప, భార్య సాయమ్మలకు 5 మంది సంతానంకు (ఇద్దరు కుమరులు, ముగ్గురు ఆడపిల్లలు) శుక్రవారం జ్వరం సోకడంతో ఇంట్లో ఉన్న సిరప్‌ను చిన్నారులకు తాగించాలని భర్త భార్యకు చెప్పి పనిపై బయటకు వెళ్లిపోయా డన్నారు. 5 గురు చిన్నారులు తల్లి జ్వరం సిరప్ తాపడంతో చిన్నారులు అస్వస్థలకు గురయ్యారు. 5 సంవత్స రాల చిన్నారి ప్రియ మృతి చెందగా అస్వస్థకు గురైన మిగతా నలుగురు చిన్నారులను జోగిపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. సంఘటనపై బంధువులు అనుమానం వ్యక్తం చేయడంతో పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శంకర్ వివరించారు.



చిన్నారులకు తాగించిన సిరప్ బాటిల్

**విచారణ చేపట్టి డ్రగ్ కంట్రోల్ అధికారులు**

సిరప్ వికటించి చిన్నారి మృతి, మరో నలుగురు చిన్నారులు అస్వస్థకు గురయినట్లు తెలుసుకున్న డ్రగ్ కంట్రోల్ అధికారి చంద్రకళ శనివారం అల్లా దుర్గం ఆసుపత్రికి చేరుకుని ఆసపత్రిలోని మందులను, రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలోని పలు కంపెనీల జ్వరం సిరప్‌లను ల్యాబ్‌కు పంపిస్తున్నట్లు, పూర్తి విచారణ చేస్తామని చంద్రకళ వివరించారు.

# విద్యుత్ స్తంభానికి ఢీకొట్టిన కారు



ప్రమాదానికి గురైన కారు (ఇన్‌సెట్‌లో భార్గవ్, వర్షిత్)

### ఇద్దరు దుర్మరణం.. మరొకరికి తీవ్రగాయాలు
### ఫాంహౌస్‌లో విందులు.. మద్యం మత్తుతోనే ప్రమాదం

**ఘట్‌కేసర్, జూన్ 7, ప్రభాతవార్త:** కారు అదుపుతప్పి విద్యుత్ స్తంభానికి ఢీకొట్టగా ఇద్దరు ఐటీ ఉద్యోగులకు తీవ్ర గాయాలైఅక్కడికక్కడే మృతిచెందిన సంఘటన మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వినోదం కోసం వచ్చి మద్యం మత్తులో అర్ధరాత్రి దాటిన తర్వాత కారులో ప్రయాణిస్తూ రోడ్డు పక్కన ఉన్న కరెంట్ స్తంభానికి ఢీకొట్టడంతో ఇద్దరు ప్రాణాలు కోల్పోయిన ఈ విషాద సంఘటన ఎదులాబాద్ సమీపంలో జరిగింది. భార్గవ్‌యాదవ్, వర్షిత్, ప్రవీణ్, దినేష్‌లు యా క్సెంచర్ ఐటీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా పని చేస్తున్నారు. నలుగురు కూడా ఫాంహౌస్‌లో ఎంజాయ్ చేయాలని నిర్ణయించుకొని ఘట్‌కేసర్ మున్సిపల్ ఎదులాబాద్ సమీపంలోని విహారి ఫాంహౌస్‌కు శు క్రవారం వచ్చి బస చేశారు. ఫాంహౌస్‌లో మద్యం తాగి నృత్యాలు చేస్తూ సంతోషంగా గడిపారు. ఫాంహౌస్ నుంచి అర్ధరాత్రి దాటిన తర్వాత నలుగురు కారు (టిఎస్08 హెచ్‌ఈ-5796)లో హైదరాబాద్‌కు బయలు దేరారు. ఎదులాబాద్-మాదారం మలుపు వద్దకు రాగానే వీరు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న కరెంట్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో కారు దెబ్బతిని అందులో ఉన్న భార్గవ్‌యాదవ్, వర్షిత్‌ల తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందగా కారు నడిపిస్తున్న ప్రవీణ్‌కు తీవ్ర గాయాలు కాగా దినేష్‌కు ఏలాంటి గాయం కాలేదు. ప్రమాదంపై స్థానికులు అందించిన సమాచారం మేరకు ఘట్‌కేసర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాయపడ్డ డ్రైవర్ ప్రవీణ్‌ను ఆసుపత్రికి తరలించారు. మద్యంతాగి కారు వేగంగా నడపడంతోనే అదుపుతప్పి స్తంభానికి ఢీకొట్టగా కారులో ఎయిర్ బెలూన్లు తెరచుకున్నప్పటికి ఫలితం లేకుండా పోయింది. కుంట్లూర్‌కు చెందిన భార్గవ్‌యాదవ్, సైనిక్‌పురికి చెందిన వర్షిత్‌లు దుర్మరణం చెందగా ప్రమాదం ధాటికి వారి తలభాగాలు నుజ్జినుజ్జై తీవ్ర రక్తస్రావం జరిగింది. ఓల్డ్‌అల్వాల్‌కు చెందిన ప్రవీణ్‌కు తీవ్ర గాయాలు కాగా ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. ప్రాణాలతో బయటపడ్డ దినేష్ విశాఖపట్నంకు చెందిన వాడు కాగా ప్రమాదం జరిగిన తీరు పోలీసులకు తెలియజేశారు. పోలీసులు ఘటనకు సంబంధించిన మృతుల వివరాలు సేకరించి మృతదేహాలను పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ పరుశురాం తెలిపారు. ఫాంహౌస్‌లలో యువకులు విందులు చేసుకుంటూ మద్యం మత్తులో వాహనాలు నడిపి ప్రమాదాల భారిన పడుతున్నారని తెలిపారు.



## మాగంటి గోపినాథ్‌ను పరామర్శించిన బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

**హైదరాబాద్ (శేరిలింగంపల్లి), జూన్ 7, ప్రభాతవార్త:** గుండెపోటుతో గత మూడు రోజులుగా గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను రాష్ట్ర మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. శనివారం ఉదయం కేటీఆర్ అమెరికా నుంచి రాగానే ఆసుపత్రికి చేరుకుని మాగంటి గోపీనాథ్ ఆరోగ్య పరిస్థితిని గురించి వైద్యులను అడిగితెలుసుకున్నారు. కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. విదేశీ పర్యటనలో ఉన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాగంటి ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తూవచ్చారు. గోపీనాథ్ కుటుంబసభ్యులతోనూ, ఏఐజీ ఆసుపత్రి వైద్య బృందంతోనూ ఫోన్‌లో మాట్లాడుతూ వచ్చారు. అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని వైద్యులకు ఆయన సూచించారు. గోపీనాథ్ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న నేపథ్యంలో ఆమెరికా పర్యటనలో ఉన్న కేటీఆర్ తన విదేశీ పర్యటనను కుదించుకున్న కేటీఆర్ హుటాహుటిన హైదరాబాద్ చేరుకున్నారు. ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న మాగంటి గోపీనాథ్‌ను కేటీఆర్‌తోపాటు కొందరు బీఆర్ ఎస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పరామర్శించారు. జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత మాగంటి గోపినాథ్ ఆర్యోగం ఇంకా విషమంగానే ఉంది. ఆయనకు గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రిలో వెంటి లేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. ఆయన కార్డియాక్ అరెస్ట్‌కు గురైనట్లు వైద్యులు తెలిపారు. సీపీఆర్ చేయటంతో తిరిగి గుండె కొట్టుకోవడం, నాడి, బీపీ సాధారణ స్థితికి రావడంతో ఐసీయులో వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు తెలిపారు. ఆయన ఆరోగ్యం పై ఆసుపత్రి వైద్యులు బులెటెన్‌ను విడుదల చేసే అవకాశం ఉంది.

## ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ ఫలితాలు విడుదల
### 12 నుంచి 18 వరకు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు గడువు

**హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త:** తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ(టాస్) టెన్త్, ఇంటర్ ఫలితాలు విడుదలయ్యాయి. టెన్త్‌లో 57.60 శాతం ఉత్తీర్ణత సాధించగా.. ఇంటర్‌లో 59.77 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు టాస్ డైరక్టర్ శ్రీహరి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కి ఈ నెల 12 నుంచి 18 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రీకౌంటింగ్‌కి ఇంటర్ విద్యార్థులు సబ్జెక్టుకి రూ. 400, ఎస్ఎస్‌సి విద్యార్థులు రూ. 350 చెల్లించాలన్నారు. రీవెరిఫికేషన్‌కి ఇంటర్ విద్యార్థులు, ఎస్ఎస్‌సి విద్యార్థులు ప్రతి సబ్జెక్టుకి రూ. 1200 చొప్పును చెల్లించాలన్నారు. టాస్ టెన్త్, ఇంటర్ పరీక్షలు మే 20 నుంచి 26 వరకు జరిగిన విషయం తెలిసిందే. ఎస్ఎస్‌సి పరీక్షలకి 28,547 మంది హాజరు కాగా వారిలో 16,443 మంది ఉత్తీర్ణత సాధించారు. టెన్త్‌లో 57.60 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్మీడియట్‌లో 41,051 మంది పరీక్షలకు హాజరు కాగా.. వారిలో 24,538 మంది పాసయ్యారు. పరీక్షకి హాజరైన వారిలో 59.77 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు.

# ఓఆర్‌ఆర్ లోపల ఆటోల పర్మిట్‌కు సడలింపు

### కొత్తగా 20వేల ఎలక్ట్రిక్ ఆటోలకు అనుమతి
### ఉత్తర్వులిచ్చిన రవాణా శాఖ

**హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త:** ఔటర్ రింగ్‌రోడ్(ఓఆర్‌ఆర్) లోపల కొత్త ఆటో రిక్షా ల అనుమతి సడలిస్తూ రవాణా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఓఆర్‌ఆర్ లోపల పరిమిత సంఖ్యలో ఆటోలకు అనుమతిస్తూ ఆదేశాలు ఇచ్చి నట్టు రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్ నగరం లో గత కొంతకాలంగా కొత్త ఆటో రిక్షాలకు పరిమితి ఉంది. కొత్త ఆటో రిక్షాలకు పరిమిట్లు ఇవ్వడానికి లేదు. ఆ పరిమితిని సడలిస్తూ జీహెచ్‌ఎంసీ, ఓఆర్‌ఆర్ లోపల పరిమిత సంఖ్యలో ఎలక్ట్రిక్, సిఎన్జీ, ఎల్పీజీ ఆటో రిక్షాలకు అనుమతి ఇస్తూ జీవో నెంబర్ 263 విడుదల చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్ నగరంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా కాలుష్యాన్ని తగ్గించడానికి ఈ నిర్ణయం ఎంతగానో ఉపయోగపడుతుందని మంత్రి పొన్నం ప్రభాకరన తెలిపారు. హైదరాబాద్ నగరంలో రోజురోజుకు జనాభా పెరుగుదల, ఓఆర్‌ఆరనలోపల ఏర్పడిన కొత్త లేఅవుట్లు, అపార్ట్‌మెంట్లు ఫలితంగా పట్టణీకరణతో వివిధ సవాళ్లు తలెత్తాయి. నగర జనాభాలో అపారమైన పెరుగుదల కారణంగా ఆటో రిక్షా పర్మిట్లకు డిమాండ్ పెరిగిందని మంత్రి అన్నారు. ఈ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని, హైదరాబాద్ నగరంలో వాయు, శబ్ద కాలుష్యాన్ని నియంత్రించడానికి, ప్రజా రవాణా మెరుగు పరచడానికి ఎలక్ట్రిక్/ఎల్‌పిజి/సిఎన్‌జి ఆటో రిక్షాలను అనుమతించడం అవసరమని ప్రభుత్వం భావించిందన్నారు. ఓఆర్‌ఆర్ లోపల కొత్తగా 20 వేల ఎలక్ట్రిక్ ఆటో రిక్షాలకు అనుమతి ఇవ్వగా.. 10 వేల కొత్త ఎల్‌పిజి ఆటోలకు అనుమతి ఇస్తూ.. మరో 10 వేల కొత్త సిఎన్‌జి ఆటోలకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. డీజిల్, పెట్రోల్ వాహనాలకు సంబంధించిన ఆటోలకు రేటిరోఫిట్మెంట్ చేసి వాటి ఇంజన్‌ను ఎలక్ట్రిక్, ఎల్‌పిజి, సిఎన్‌జి లాగా మార్చుకోవడానికి 25 వేల వాహనాలకు అనుమతి ఇస్తూ జీవో విడుదల చేయడం జరిగింది. ఇప్పటి వరకు ఉన్న డీజిల్, పెట్రోల్ ఆటోల ట్రాన్స్‌ఫర్, డీజిల్ పెట్రోల్, కొత్త ఆటోలకు ఓఆర్‌ఆర్ పరిధిలో అనుమతించ బడవవని ఉత్తర్వులో స్పష్టం చేశారు. ఈ ఎలక్ట్రిక్ వాహనాలు ఎల్‌పిజి, సిఎన్‌జి తీసుకురావడానికి రెండు ప్రధాన కారణాలున్నాయని.. ఓఆర్‌ఆర్ లోపల ప్రజా రవాణాను మెరుగుపరచడం కోసమేనని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఎలక్ట్రిక్, ఎల్‌పిజి, సిఎన్‌జి ఆటోలకు అనుమతి ఇచ్చి నగరంలో కాలుష్యాన్ని తగ్గించవచ్చని.. ప్రభుత్వ ఆదేశాల ద్వారా సుమారు 65 వేల కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని మంత్రి తెలిపారు.

## రేపటి నుంచి ఎపి పిజి సెట్ పరీక్షలు
### రాష్ట్ర వ్యాప్తంగా 30 పరీక్షా కేంద్రాలు

**తిరుపతి విద్య జూన్ 7 ప్రభాతవార్త** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 17 యూవర్సిటీలలో పలు పీజీ కోర్సులలో ప్రవేశాల కోసం నిర్వహించనున్న ఏపీ పీజీసెట్2025 పరీక్షలు సోమవారం నుం ప్రారంభం కానున్నట్లు వీసీ, పీజీసెట్ ఛైర్మన్ ప్రొఫెసర్ అప్పారావు తెలిపారు. శనివారం ఎస్వీయూలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉన్నత విద్యామండలి ఆదేశాల మేరకు ఈ ఏడాది ఏపీ పీజీ సెట్‌ను ఎస్వీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. పీజీ సెట్ 2025ను రాష్ట్ర వ్యాప్తంగా 30 పరీక్షా కేంద్రాలలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. 31 సబ్జెక్టులలో పీజీ ప్రవేశాల కోసం జరగున్న ఈ సెట్లో 25,688మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. అత్యధికంగా 67శాతం మంది ఉత్తరాంధ్ర నుంచి ధరఖాస్తు చేసుకోవడం విశేష మన్నారు. గత ఏడాది కంటే 6వేల దరఖాస్తులు తగ్గాయన్నా రు. ఈ నెల 12వరకు జరగనున్న పరీక్షలకుఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు.



# ఇక మస్క్ కొత్త పార్టీ!

### అధ్యక్షునితో వార్ సీరియస్
### అన్ని కాంట్రాక్టులు, రాయితీలు రద్దు చేస్తామన్న ట్రంప్

**వాషింగ్టన్, జూన్ 7:** రిపబ్లికన్ నేత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆయన అనుంగు మిత్రుడుగా మెలిగిన టెస్లా అధినేత ఎలాన్ మస్క్‌లమధ్య ఇపుడు పచ్చగడ్డివేస్తే భగ్గుమంటోంది. ఒకరిపై ఒకరు నిప్పులు చెరుగుతున్నారు. ట్రంప్ చేపట్టిన సుంకాల కార్యాచరణలో కొన్నింటిని తీవ్రంగా వ్యతిరేకించిన మస్క్, తాజాగా రిపబ్లికన్లు ప్రవేశపెట్టిన రిపబ్లికన్ ట్యాక్స్‌ను కూడా తీవ్రంగా వ్యతిరేకించారు. అయినా కూడా ట్రంప్ తన మొండిపట్టుదలను వీడకుండా వీటిని అమలుచేసేందుకు ఉద్యుక్తులు అవుతున్నారు. పైగా మస్క్‌ను తీవ్రంగా విభేదించిన అధ్యక్షుడు ఏకంగా టెస్లా అధినేతకు ప్రభుత్వపరంగా ఇచ్చినరాయితీలు, సుంకాల మినహా యింపుతోపాటు స్పేస్ఎక్స్ ప్రాజెక్టుకు ఇచ్చిన కాంట్రాక్టులను కూడా రద్దుచేస్తామని ప్రకటించడంతో నాసాకు స్పేస్ఎక్స్ ఎయిర్‌క్రాఫ్ట్‌సరఫరాచేసే కాంట్రాక్టునుంచి వైదొలుగుతున్నట్లు మస్క్ ప్రకటించారు. ఎన్నికల్లో తనవల్లనే ట్రంప్ గెలిచారని చెపుతున్న మస్క్ ఆయన గెలుపుకోసం 30 కోట్ల డాలర్లు ఖర్చుచేసినట్లు చెపుతున్నారు. ఇపుడు తాజాగా ఏకంగా ట్రంప్‌పై అభిశంసన తీర్మానంప్రవేశపెడితే తాను మద్దతిస్తానని ప్రకటించి మరో అడుగు ముందుకేసారు. అక్కడితో ఆగకుండా 'ది అమెరికా పార్టీ' పేరిట ప్రత్యేక సొంతపార్టీకూడా పెట్టేందుకు కసరత్తులు చేస్తున్నారు. ఇందుకుగాను తన సోషల్ మీడియా 'ఎక్స్'లో నిర్వ హించిన అభిప్రాయసేకరణలో తనకు 80శాతంమంది అమెరికా ప్రజలు మద్దతుపలికారని, అందువల్ల ఇపుడు అమెరికాలో కొత్తపార్టీ పెట్టే తరుణం వచ్చినట్లుగా కనిపిస్తోందంటూ మస్క్ తన ఎక్స్ హ్యాండిల్‌పై చేసిన వ్యాఖ్యలు ట్రంప్‌నకు కాకపుట్టిస్తున్నాయి. అక్కడితో ఆగకుండా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ లైంగికవేధింపుల కేసుల్లో నిందితుడయిన జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో సన్నిహితంగా కొనసాగారని, ఆయనకు సంబంధించిన దర్యాప్తు ఫైళ్లలో ట్రంప్ పేరుకూడా ఉందని ఆరోపించారు. అందువల్లనే దర్యాప్తులో వెల్లడయిన అంశాలను ఇప్పటివరకూ బహిరంగపరచలేదని ఆరోపించారు. భవిష్యత్తులో ఇందుకు సంబంధించిననిజాలు వెల్లడి కావచ్చని చెప్పిన మస్క్ కొద్ది సేపటికే ఆ పోస్టును తొలగించారు. ఇదిలా ఉంటే ట్రంప్ మస్క్‌లమధ్య మధ్యవర్తిత్వం నెరపేందుకు తాను సిద్ధమేనని అయితే తనకు స్టార్‌లింక్‌లో వాటాలిస్తారా అంటూ రష్యామాజీ అధ్యక్షుడు తెచ్చిన ప్రతిపాదన కూడా అమెరికా అధ్యక్షుడు, బిలియనీర్ పారిశ్రామికవేత్తల మధ్య రాజు కుంటున్న వైరాన్ని స్పష్టంచేస్తోంది. ఇద్దరిమధ్య ఉన్న విభేదాలపై ట్రంప్‌ను ప్రశ్నించిన మీడియాకు ఆయన విచిత్రంగా సమాధానం చెప్పారు. తాను చాలా బిజీగా ఉన్నానని, చైనా, రష్యా, ఇరాన్ సంబంధిత అంశాలపై పనిచేస్తున్నా నాకు చాలా పనులున్నాయి. ఎలాన్‌మస్క్‌గురించి ఆలోచించే సమయంలేదని ఆయన బాగుండాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పడం ఇద్దరిమధ్య ఉన్న తీవ్రస్థాయి విభేదాలను స్పష్టంచేస్తోంది. అయితే ఆయన పెద్దమొత్తంలో సొమ్ములు అందుకున్నారు. చాలా సబ్సీడీలు కూడా పొందారు. వీటినిపరిశీలించాల్సిన అవసరం ఉంది. మస్క్ వల్లే తాను గెలిచాననడం అవాస్తవమని, తాను లేకపోయినా పెన్సిల్వేనియాలో గెలిచేవాడినని ట్రంప్ బదులిచ్చారు. ఈ పరిణామాల మధ్య ట్రంప్ కంపెనీలషేర్లు 14శాతం క్షీణించాయి. ఒక్కరోజులోనే 150 బిలియన్‌డాలర్లకుపైగా నష్టపోయారు. అయినా కూడాట్రంప్‌పై తన వైఖరిని వీడని మస్క్ ఇపుడు ఏకంగా కొత్తపార్టీ పెట్టే యోచనచేస్తుండటం అమెరికాలో కొత్త రాజకీయాలకు తెరలేపుతోంది.

# ఆశ నిరాశల్లో ఖరీఫ్

ఆశ నిరాశల మధ్య ఖరీఫ్ (వానాకాలం సాగు) సీజను ప్రారంభమైంది. నైరుతి రుతుపవనాల ఆగమనంతో తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా ఖరీఫ్ సీజనుపై రైతులు దృష్టిసారించారు. దేశంలోని మొత్తం వర్షపాతంలో రుతుపవనాలవాటా 80శాతం, ఖరీఫ్ పంటల విత్తనాలు మొదటి వర్షంపై ఎక్కువగా ఆధారపడి ఉంటాయి. సహజంగా అనూహ్యత కారణంగా రుతుపవనాల రాక ఆలస్యం, తక్కువ వర్షం లేదా వరదలుకూడా సంభవించవచ్చు. అయితే దీనికి భిన్నంగాఈ సారి ముందస్తుగానే రుతుపవనాలు ప్రవేశించాయి. ఇక ప్రాంతాలు, పంట వారీగా ఖరీఫ్ సీజను వ్యవధి మారుతుంటుంది. ఈ సీజను జూన్‌లో ప్రారంభమై అక్టోబరు నెలతో ముగుస్తుండగా, దేశంలోని వివిధరాష్ట్రాల్లో రుతుపవనాల రాకను బట్టి పంటలను విత్తుతారు. మరోపక్క దేశానికి అన్నంపెట్టే రైతుల పట్ల కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నాయి. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు రైతులను, వ్యవసాయాన్ని పావుగా ఉపయోగించుకుంటున్నాయి. ఒకచేత్తో రైతులకు ఇచ్చి నట్లేఇచ్చి మరో చేత్తో తిరిగి వాటికంటే మించి లాగుకుంటున్నాయి. అతివృష్టి,అనావృష్టి,వరదలు వంటి పకృతి వైపరీత్యాలు, తెగుళ్ల, పంటల బీమాను రాష్ట్రాలు అమలు చేయకపోవడం, కేంద్రం ప్రకటించే మద్దతుధరలు గిట్టుబాటు కాకపోవడం,రాష్ట్రాల్లో పంటల కొనుగోళ్లలో అక్రమాలు, దోపిడీ విధానాలు, రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం, పెట్టుబడులకు తగినంత రుణాలను బ్యాంకులు మంజూరు చేయకపోవడం వంటి కారణాలతో రైతులు అప్పులఊబిలో కూరుకుపోతున్నారు. వాటిని తీర్చేపరిస్థితి లేకపోగా, కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలుసైతం ఆదుకోకపోవడంతో గత్యంతరం లేక పలువురు రైతులు ముఖ్యంగా కౌలు రైతులు ఆత్మహత్యలను నమ్ముకుంటున్నారు. పంటల బీమా కేంద్రం అమలు చేస్తున్నా కొన్ని రాష్ట్రాలు వాటి అమలు చేస్తుండగా, తెలంగాణ, ఆంధ్రాలో ఏదీ అమలు కావడం లేదు.

**సిహెచ్.వి.వి.రఘుబాబు**

ఎన్నో కష్టాలు, మరెన్నో నష్టాలు ఎదుర్కొంటున్న అన్నదాతలు ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌పై ఆశలు పెట్టుకున్నారు. ప్రస్తుత వానాకాలం (ఖరీఫ్) సీజనులో తెలంగాణ వ్యాప్తంగా 1.34 కోట్ల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ ప్రతిపాదించింది. గత వానాకాలం సీజన్‌తో పోలిస్తే ఈసారి సాగు విస్తీర్ణం 4 లక్షల ఎకరాలకుపైగా పెరిగే అవకాశం ఉన్నట్టు అంచనా. కూరగాయలు, ఇతర ఉద్యానవన పంటలు కలిపి 10లక్షల ఎకరాల వరకు ఉండనుంది. అత్యధికంగా 66.80 లక్షల ఎకరాల్లో వరిని సాగు 60నుంచి 70 శాతానికి పైగా ఉండొచ్చని అంచనా. పత్తి 50లక్షల ఎకరాలతో రెండో స్థానం ఉండనుంది. ఈ వానాకాలంలో 16.70 లక్షల క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరమని పేర్కొంది. ఇందులో ఇప్పటికే 75లక్షల ఎకరాలకు సరిపడా విత్తనాలను అందుబాటులో ఉంచింది. 45 వేల క్వింటాళ్ల పత్తి విత్తనాలకు ప్రయివేటు కంపెనీలు 1.34లక్షల క్వింటాళ్ల బిటీ విత్తనాలను సిద్ధంగా ఉంచాయి. మొక్కజొన్న ఆరులక్షల ఎకరాలకు 48వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయనితేల్చింది. ఇవి కాకుండా కందులు, పెసలు, మినుములు, జొన్నలు, వేరుశనగ, ఆముదం, నువ్వులు తదితర పంటల విత్తన ప్రణాళికను సిద్ధం చేసింది. ఆంధ్రాలో ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 77.87 లక్షల ఎకరాలు కాగా, ఈ సీజనులో 86.47 లక్షల ఎకరాల్లో సాగుచేయాలని వ్యవసాయ శాఖ నిర్దేశించింది. ఇందులో 38.87 లక్షల ఎకరాల్లో వరి, 14.30 లక్షల ఎకరాల్లో వేరుశెనగ, 14.10 లక్షల ఎకరాల్లో పత్తి, 9.35లక్షల ఎకరాల్లోనఅపరాలు సాగు చేయనుంది. ఇందుకుగాను 6.32 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరమని లెక్కకట్టింది. ఇక రెండు రాష్ట్రాల్లోనూ సాగు వ్యయం ఏటికేడాది పెరుగుతోంది. గత ప్రభుత్వం పీఎం కిసాన్ యోజన, రైతుబంధు వంటి వాటిని అమలు చేస్తూ పెట్టుబడి నిమిత్తం రైతులకు కేంద్రం, తెలంగాణ రాష్ట్రం ఆర్థిక సాయం చేస్తున్నాయి. అయినా ఇవన్నీ ఏమూలకీ సరిపోవడం లేదు. ప్రస్తుత ఎపి సర్కార్ గత ప్రభుత్వం అమలు చేసిన వైఎస్సార్ రైతు నేస్తం తదితర పథకాల కన్నా అదనంగా ఇస్తామని ఎన్నికల్లో ప్రకటించినా, ఇంత వరకూ వేటినీ అమలు చేయలేదు. కాగా రెండు రాష్ట్రాల్లో ఏటా సాగు వ్యయం పెరుగుతోంది. సగటున మూడేళ్లలో 40 శాతంమేర సాగు వ్యయం పెరిగింది. మద్దతు ధర మాత్రం 13.50 శాతం లోపే పెరిగాయి. గత ఏడాదితో పోలిస్తే వ్యవసాయ పెట్టుబడులు రెట్టింపు అయ్యాయి. అలాగే వ్యవసాయ పరికరాల ధరలు 20 నుండి 100 శాతం పెరగడంతో సాగు చేయడం అన్నదాతలకు భారంగా



పరిణమించింది. సాగులో కూలీల కొరత కూడా పెద్ద సమస్యగా తయారవుతోంది. దీంతో సాగుకు యంత్రాల వినియోగం పెరుగుతుండటంతో కిరాయి రేట్లను భారీగా పెంచేస్తున్నారు. బోర్ల మీద ఆధారపడి సాగు చేస్తున్నా భూగర్భజలాలు పడిపోవడంతో సాగునీరు పూర్తిస్థాయిలో అందే పరిస్థితి మెట్ట ప్రాంతంలో లేదు. సాగుకు 24 గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తున్నామని రెండు రాష్ట్రాలు చెబుతున్నా, అనాధికారిక కోతలు పెడుతున్నాయి. ఇక కేంద్రం ప్రకటిస్తున్న మద్దతు ధరలతో పెట్టుబడి కూడా రానిదుస్థితి నెలకొంది. ఏటా పెట్టుబడులు పెరుగుతున్నా, మద్దతు ధరలు మాత్రం ఆమేరకు పెరగడం లేదు. కేంద్ర ధరల నిర్ణయక కమిటీ తక్కువ పెట్టుబడి అయ్యే రాష్ట్రాలను పరిగణలోకి తీసుకుని మొక్కుబడిగా మద్దతు ధరలను పెంచుతోంది. ఇది గిట్టుబాటుకాని నేపథ్యంలో వివిధ రాష్ట్రాలు దానికి అదనంగా మరికొంత మొత్తాన్ని ప్రకటిస్తున్నాయి. ఇలా కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో ఆయా ప్రభుత్వాలు మద్దతు ధరలకు అదనంగా క్వింటాకు రూ.300 నుండి రూ.400 వరకూభరిస్తూ రైతులకు నష్టం లేకుండా సహాయం చేస్తున్నాయి. తెలంగాణ, ఆంధ్రాలో అలాంటి అదనపు ఆర్థిక సాయాన్ని మాత్రం చేయడం లేదు. అయితే తెలంగాణలో ఒక్క సన్న రకం ధాన్యానికి మాత్రమే క్వింటాకు రూ. 500 మేర ప్రోత్సాహకంఇస్తోంది. మరోపక్క పెట్టుబడులకు సరిపడా బ్యాంకులు రుణాలుగా ఇవ్వడం లేదు. స్కేల్ ఆఫ్‌ఫైనాన్స్ నిబంధనను అడ్డం పెట్టుకుని రుణాల్లో భారీకోతపెడుతున్నాయి. రెండు రాష్ట్రాల్లో కేవలం 50 శాతం మంది రైతులకే బ్యాంకులు అరకొరకగా రుణ సౌకర్యాన్ని కల్పిస్తుండగా, మిగిలిన 50 శాతం మంది రైతులు ప్రైవేటు వ్యక్తుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు చేస్తున్నారు. 20నుండి 35శాతం చొప్పున అధిక వడ్డీలకు రైతులకు ప్రైవేటు వ్యాపారులే దిక్కవుతున్నారు. దీంతో పంటలు దెబ్బతిన్న రైతులు అధిక వడ్డీలతో పెరిగి పోయిన ప్రైవేటు అప్పులను తీర్చలేకపోతున్నారు. దీనికి తగిన ట్లుగా పంటల భీమా పథకం అమలు చేయకపోవడం రైతుల పాలిట శాపంగా పరిణమించింది. అతివృష్టి, అనావృష్టి పరిస్థితుల్లో నష్టపోయిన పంటలకు బీమాపరిహారం రైతులకు అందడం లేదు. కోర్టుల జోక్యంతో రెండు ప్రభుత్వాలు రైతులు ఆత్మహత్యలు చేసుకునేందుకు కారణాలు, వాటికి పరిష్కార మర్గాలను సేకరించినా అవి మూలపడ్డాయి. రైతుల ఆత్మహత్యలు గుర్తించే విధానాన్ని సులభతరం చేసేలా మార్గదర్శకాలను రూపొందించడంతోపాటు, బాధిత కుటుంబాలకు సహాయ చర్యల నిమిత్తం ఎక్స్‌గ్రేషియా ఇవ్వడంలో కచ్చితమైన కాలపరిమితి విధిస్తూ 421, 173 జివోలను సవరిస్తేనే రైతులకు ఆదాయ భద్రత కలుగుతుంది. సకాలంలో తగినంత రుణ సౌకర్యం కల్పించి, కల్తీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను నివారించి లాభసాటి ధరకు ఉత్పత్తులను కొనుగోలు చేసినట్లయితే రైతులకు మేలు జరుగుతుంది. విస్తరణ వ్యవస్థను ఏర్పాటు చేసి,ప్రకృతి వైపరీత్యాల సమయంలో నష్ట పరిహారం, బీమా సౌకర్యం విధిగా అందించాల్సి ఉంది. వ్యవసాయ అనుబంధ రంగాలను ప్రోత్సహించడం తప్పనిసరి చేయాలి. వ్యవసాయానికి బడ్జెట్ కేటాయింపులు పెంపుతోపాటు, వాటి ఖర్చులు పారదర్శకంగా, జవాబుదారితనంతో ఉండాల్సిన అవసరం ఉంది. ప్రతీ గ్రామంలోనూ విస్తరణ వ్యవస్థను పటిష్టం చేయడం, మెట్ట ప్రాంతాలకు అవసరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాల్సి ఉంది. ఆరుతడి పంటల దిగుబడులను పెంచడం, ఉత్పత్తి ఖర్చులు తగ్గించేలా వ్యవస్థను ఏర్పాటు చేయాలి. బ్యాంకు రుణాల నుంచి బీమా పథకాలను వేరు చేసి, బీమాను అన్ని పంట లకు విస్తరింపచేసేందుకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. సన్న, చిన్నకారు, పేద రైతుల బీమా ప్రీమియంను ప్రభు త్వాలే చెల్లించాలి. కౌలు రైతులతో సహా సాగుదారులందరికీ రుణ సౌకర్యాన్ని ఒక హక్కుగా కల్పించాలి. అలాగే రుణ మాఫీని ఒకే దఫా అమలు చేసి, కొత్త రుణాలు ఇవ్వాల్సిన అవసరం ఉంది. విత్తన విధానాన్ని, నియంత్రణ వ్యస్థను, సదుపాయాలను కల్పించేలా చట్టాలు తేవాలి. వ్యవసాయ విధానాన్ని ప్రకటించడం ద్వారా మేలు జరిగేందుకు రెండు ప్రభుత్వాలు పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. ప్రధానంగా కరవు మాన్యువల్‌లో సమగ్ర మార్పులు చేసే దిశగా ప్రభుత్వాలు సిద్ధం కావాలి. కరవు మండలాలను నిర్ధారించేందుకు ప్రక్రియను పునర్నిర్వహించి, వ్యవసాయేతర అవసరాలకు వ్యవసాయ భూములను మార్చకుండా ఆపాల్సి ఉంది. రెండు రాష్ట్రాల స్థాయిల్లో రైతు కమిషన్లు, మిషన్ రైతు మిత్రలను ఏర్పాటు చేయాలి. అప్పుడే రైతుల జీవితాల్లో వెలుగు నింపినట్లవుతుంది. ●


# విజయ 'విలాపం' !

కర్ణాటక

ఎవరి పనులతో వారు ఉరుకులు పరుగుల మీద తిరుగుతూ అది 'మరో ప్రపంచం' అనిపించే బెంగళూరు మహా నగరం గత బుధవారం (4,జూన్ ) ఒక్కసారిగా కన్నీటి ధారల్లో కుమిలిపోయింది. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు (ఆర్సీబి) పద్దెనిమిదేళ్ల కల ఫలించి ఐపిఎల్ టైటిల్ గెలుచుకు వచ్చిందనే సంతోషం, విజయోత్సాహం కొన్ని గంటలలోనే అందరిలో ఆవిరైపోయింది. విజయోత్సవం విషాదాంతమై క్రికెట్ అభిమానులకే గాక దేశ ప్రజలందరికి కూడా ఒక పీడకలగా మిగిలిపోయింది. మంగళవారం ఆర్సీబి జట్టు ఐపిఎల్ విజేతగా నిలిచిన తర్వాత ఆ రాత్రి చాలా పొద్దుపోయేవరకు అహ్మదాబాద్‌లో వేడుకల్లో మునిగితేలింది. అనంతరం బుధవారం ప్రత్యేక విమానంలో బెంగళూరు వచ్చింది. రాగానే నేరుగా విధానసౌధ (అసెంబ్లీ) వద్ద ప్రభుత్వ పెద్దలందరి సమక్షంలో అతి వైభవంగా సన్మాన కార్యక్రమం. గవర్నర్ తవర్ చంద్ గెహ్లాట్, సిఎం సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం శివకుమార్ సహాఅతిరథ, మహా రథులందరు కోహ్లీ బృందాన్ని'నభూతో నభవిష్యతి' అన్న చందంగా సన్మానించేందుకు సిద్ధమయ్యారు. అక్కడ పూర్తయిన తర్వాత చిన్న స్వామి స్టేడియంలో జట్టు అభినందన వేడుక జరపడానికి కర్ణాటక క్రికెట్ సమాఖ్య సన్నాహాలు చేసింది. ఇంతవరకు బాగానే ఉంది. కానీ సంరంభం మొదలైన కొద్ది సేపటికే క్రికెట్ అభిమానుల ప్రాణాలు గాలిలో కలిసే సరికి ఆ ప్రాంతంలో ఎటుచూసినా హాహాకారాలే వినిపించాయి. కొద్ది సేపటిలోనే అద్భుతమైన వేడుక అనంత విషాదంలోకి జారిపోయింది. దీనికి బాధ్యులెవరు? 11మంది ప్రాణాలు హరించడానికి కారణమైన అసలు దోషులెవరు? అన్నదే చిక్కుముడి వీడని ప్రశ్న. 'నీది తప్పంటే నీది తప్ప'ని ఆరోపణలు చేసుకోవడం మామూలే. ఘటన అత్యంత విషాదకరమైనది కనుక, ప్రభుత్వం నేరుగా పాల్గొన్న వేడుక అనంతరంజరిగిన ఘటనలు గనుక చాలా వేగంగానే అంతా కదిలారు.కొందరు పోలీసు ఉన్నతాధికారులను బాధ్యులను చేస్తూ సస్పెండ్ చేశారు. ఘటనపై న్యాయ విచారణకు ఆదేశించారు. బాధితులకు భారీగానే పరిహారాన్ని ప్రకటించారు. అన్నీ

**ఎ.వి.వి ప్రసాద్**

వెంట వెంటనే జరిగిపోయాయి కూడా. కానీతమ కన్నబిడ్డలను కోల్పోయి విషాద సాగరంలో మునిగిపోయిన ఆ కుటుంబాలకు అవి ఎంత ఊరటనివ్వగలుగుతాయి? విజయ గర్వంతో వచ్చిన తమ 'హీరో'లను చూడాలనే తపనతో వేలుకాదు.. లక్షల మంది అభిమానులు ఆరోజు చిన్నస్వామి స్టేడియం వద్దకు ఒక ప్రవాహంలా తరలి వచ్చారు. నిజానికి అది చాలా చిన్న స్టేడియం.



తొక్కిసలాట

కోహ్లీ జట్టు విజయ బావుటా ఎగుర వేస్తుంటే అభిమానులు ఎలా ఉరుకుతారో అంచనా వేయలేని విషయం కాదు.35 వేలసామర్థ్యం ఉన్న స్టేడియం వైపు నాలుగైదు లక్షల మంది క్రికెట్ అభిమానులు దూసుకొచ్చారు. వారిని నిలువరించడం పోలీసులకు ఎంతమాత్రం సాధ్యం కాలేదన్న విషయం కూడా ఒప్పుకోవలసిందే. పోలీసులే కాదు, ఆ ఉత్తుంగ తరంగానికి ఎవరూ అడ్డుకట్ట వేయలేరు. వేస్తే అదిమరిన్ని అవాంఛనీయ పరిస్థితులను సృష్టించవచ్చు. గేట్లు మూసివేస్తే వాటిని పగులగొట్టి లోపలికి దూకారు. విధానసౌధకు అతి సమీపంలో, ఒకటిన్నర కి.మీ దూరంలోనే చిన్నస్వామి స్టేడియం ఉంది. విధానసౌధ వద్ద తొలుత జరిగిన సన్మాన కార్యక్రమానికి వివిఐపిలు పెద్దసంఖ్యలో రావడంతో దానికి తగిన పటిష్టమైన బందోబస్తు బాగానే ఏర్పాటు చేశారు. అందువల్ల అక్కడికి చేరుకోలేకపోయినవారందరు కూడా స్టేడియం వైపుపరుగులు పెట్టారు. మర్నాడే ఈ వేడుకలు వద్దనీ, పైగా రెండూ ఒకేసారి వద్దనీ పోలీసు యంత్రాంగం గట్టిగానే చెప్పిందట.కానీ 'పెద్దలు' వినాలి కదా! ఒకరికొకరు పోటీలు పడి కోహ్లీ జట్టును సన్మానించారు. అక్కడ ఈ వేడుకలు జరుగుతూండగానే స్టేడియం వద్ద తొక్కిసలాట మొదలైందనే వార్తలు వినవచ్చాయి. 'తొక్కిసలాటలు మామూలే. మీరు కానివ్వండంటూ ఓ పెద్ద రామయ్య సన్మానాలు ఆపొద్దన్నారనే వార్తలు కూడా వినిపించాయి. కొద్ది సేపటిలోనే స్టేడియంవద్ద తొక్కిసలాట ఉధృతం కావడంతో వరుసగా 11మంది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. మరో 50 మంది పైగా తీవ్రంగా గాయపడ్డారు. వారిపరిస్థితికూడా ఆసుత్రుల్లో ఆందోళనకరంగానే ఉంది. కనీసం రెండు వేడుకలు ఒక విశాలమైన ప్రదేశంలో ఒకేసారి జరిపినా ఇంతటి విషాదం ఏర్పడకపోయి ఉండేదనిపిస్తుంది. పోలీసు కమిషనర్ దయానంద్, మరి కొందరు అధికారులను సస్పెండ్ చేయడం, కొందరు ఉన్నతాధికారులపై వేటు వేయడం కంటితుడుపు చర్య అనేచెప్పాలి. స్టేడియం వద్ద తొక్కిసలాట జరుగుతోందనే సమాచారం తెలిసినా విధానసౌధ వద్ద సన్మానాలు కొనసాగించడమే ఆశ్చర్యం కలిగించేవిషయం. ఆ ఆలోచన ఎవరిదైనా కావచ్చు.. కొన్నిప్రాణాలు గాలిలో కలిసిపోయాయి కదా! అతిపెద్దవిజయం సాధించి కోహ్లీ బృందం వస్తే వారికి అభిమానులు ఎలా బ్రహ్మరథం పడతారో అంచనా వేయలేక పోవడం, వేసినా నిర్లక్ష్యంతో వ్యవహరించడం అధికారులవైపు నుంచి కనిపించే వైఫల్యమే. పోలీసులు, ఇంటెలిజెన్స్ హెచ్చరికలను రాజకీయ నాయకులు ఖాతరు చేయకపోవడం మరింత పెద్దవైఫల్యం. ముఖ్యంగా ఆర్సీబీనిర్వాహకులు ఎంతో మెలకువతో వ్యవహరించవలసిన సందర్భంలో వారి వైఫల్యం కూడా స్పష్టంగానే కనిపిస్తోంది. పది లక్షల పరిహారం పోయిన ప్రాణాన్ని తేలేదు కదా! ఏం జరిగినా ఎంతో కొంత పరిహారం చెల్లిస్తే చాలనే ఉదాసీన వైఖరి ఇలా ముదిరిపోతే అది ఎన్ని దురదృష్టకర ఘటనలకైనా దారితీస్తుందనిపిస్తుంది. 30 రోజుల్లో న్యాయ విచారణ ఏం తేల్చినా, మరో తొక్కిసలాట ఘటన జరగకూడదనుకొంటే ప్రధానంగా రాజకీయ నాయకుల వైఖరిలో మార్పు రావాలి. వేడుక ముఖ్యమే. ప్రజల ప్రాణాలు అంతకంటే ముఖ్యం కదా! ●

# మైత్రీ బంధానికి బ్రేక్

అమెరికా

ఒకప్పుడు అత్యంత ఆప్తమిత్రుడని పొగిడారు. ఆయన్ను ప్రభుత్వ సంస్థల్లో సామర్థ్యం పెంచేందుకుని కొత్త విభాగం సృష్టించి ఆ విభాగానికి ఛీఫ్‌ను చేసారు. రానురాను మిత్రబంధానికి బీటలు వారాయి. ట్రంప్‌కు నచ్చని ఏవిషయం అయినాసరే అంతు చూసేంతవరకూ వదలరన్నది తెలిసిందే. అదే విధంగా ఆయన అనుంగుమిత్రుడు టెస్లా, స్పేస్ ఎక్స్, స్టార్‌లింక్ అధినేత ఎలాన్‌మస్క్ కూడా అదే విధమైన వైఖరితో ఉంటారు. రిపబ్లికన్స్ తెచ్చిన ట్యాక్స్ విధానంతో ఇద్దరిమధ్య మైత్రీబంధం బీటలు వారింది. ఇప్పుడు ఒకరిపై ఒకరు నిప్పులు చెరుగుతున్నారు. మస్క్ పేరుచెపితేనే ట్రంప్ అసహనంతో ఉన్నారు. అతని గురించి ఆలోచించడం మానేసానని, అతడి మెదడు పనిచేయడం మానేసిందంటూ వ్యంగ్యోక్తులు సైతం విసురుగుతున్నారు. ఈపరిణామాల నేపథ్యంలో మస్క్ ఏకంగా ట్రంప్‌కు వ్యతిరేకంగా కొత్తపార్టీనే ఏర్పాటు చేసేందుకు ఉద్యుక్తులవుతున్నారు. అదే 'ది అమెరికా పార్టీ'. కేవలం అమెరికన్ల వారి భావాలతో నిండిఉన్న పార్టీని ఏర్పాటు చేసేందుకు శ్రమిస్తున్నాడంటే అమెరికా అధ్యక్షుడికి ఆయనకు ఎంతమేర అగాథం పెరిగిందో తెలుస్తోంది. తిరుగులేని వ్యాపారసామ్రాజ్యంతో ప్రపంచంలోనే నంబర్‌వన్ బిలియనీర్‌గా ఎదిగిన మస్క్ తనకు ప్రత్యర్థులు లేకుండా చేసుకోవడంలో ట్రంప్‌కంటే అందవేసినచేయి. తన సోషల్ మీడియా హ్యాండిల్‌ను బ్లాక్‌చేసారన్న కక్షతో ఏకంగా 'ట్విట్టర్' సంస్థనే కొనుగోలుచేసి తన పంతం నెగ్గించుకున్న బిలియనీర్ మస్క్అలాంటి టెస్లా ఎలాన్ మస్క్‌పేరు ప్రపంచంలో తెలియని వారు లేరు. గత అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్‌నకు వెన్నుదన్నుగా నిలిచి ఆయన గెలుపునకు అవిరళ కృషిచేసారు. సుమారు 30 కోట్ల డాలర్లు ట్రంప్ విజయం కోసమే ఖర్చుచేసారంటే డెమొక్రాట్లపై ఆయనకున్న వ్యతిరేకత ఏపాటితో తెలుస్తుంది. తీరా అధ్యక్షుడయ్యాక కూడా మస్క్ నాకు మంచి మిత్రుడని పొగుడుతూ వచ్చిన ట్రంప్ ఒక్కసారిగా విభేదిస్తూ వచ్చారు. ప్రభుత్వ వ్యయయ నియంత్రణకోసం కొత్తగా అమలుకు తెస్తున్న రిపబ్లికన్ ట్యాక్స్ బిల్లు ఇద్దరి మైత్రికి బ్రేకులువేసింది. ఈబిల్లును మస్క్ తీవ్రంగావ్యతిరేకించారు. అప్పటివరకూ డోజ్‌లో వృథా

**గన్ని మోహన్**

విభాగాలన్నింటినీ మూసివేయాలన్న ప్రతిపాదనలు తెచ్చి దుబారాను తగ్గిస్తామని ప్రకటించిన మస్క్ ఈ టాక్స్‌బిల్లును తీవ్రంగా వ్యతిరేకించారు. అయినా కూడా వెనక్కి తగ్గలేదు. మస్క్ వ్యతిరేకతను ట్రంప్ లెక్కచేయలేదు. ఎలాన్ సంస్థలకు ప్రభుత్వరాయితీలు, కాంట్రాక్టులను కూడా రద్దుచేస్తామని ట్రంప్ తన సొంత సోషల్ మీడియా ట్రూత్‌లో ప్రకటించారు.మస్క్‌ను పరోక్షంగా ప్రస్తావిస్తూ ఆయన



ఎలాన్ మస్క్

మానుంచి చాలా సబ్సిడీలుపొందారు. పెద్దమొత్తంలో సొమ్ములు అందుకున్నారు. వీటిని పరిశీలించాలి. పారదర్శకంగానే జరిగిందా అన్నదితేలాలి. మస్క్ లేనంతమాత్రాన మాకేమీ నష్టం ఉండదు. ఎవరులేకపోయినా అమెరికాకుఎలాంటి నష్టం ఉండదు. ఒక్క నేను తప్ప ఎవ్వరుపోయినా ఎలాంటి నష్టం లేదంటూ ట్రంప్ మస్క్‌పై తనకున్న అక్కసు వెళ్లగక్కారు. దీనితో మస్క్ కోపం నషాళానికి అంటింది. స్పేస్‌ఎక్స్‌కు చెందిన డ్రాగన్‌స్పేస్‌క్రాఫ్ట్ సేవలు నిలిపివేస్తామని ప్రకటించారు. అక్కడితే ఆగలేదు తన సొంత సోషల్‌మీడియా 'ఎక్స్'లో ట్రంప్‌పై ఆరోపణలతో ధ్వజమెత్తారు. చిన్నపిల్లలపై లైంగిక దాడులకేసులో నిందితుడయిన జెఫ్రీ ఎప్‌స్టీన్ వద్ద ఉన్న ప్రముఖుల జాబితాలోట్రంప్ పేరు కూడా ఉందని ఆరోపించారు.అయితే జెఫ్రీ ఎప్‌స్టీన్ కేసు విచారణకు రాకుండానే జైలులో ఆత్మహత్య చేసుకున్నాడు. తన మద్దతు లేకుంటే అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్, రిపబ్లికన్‌పార్టీ రెండూ ఓడిపోయేవని మస్క్ ప్రకటించారు. ప్రతినిధుల సభలో డెమొక్రాట్లే పట్టు సాధించేవారని, సెనేట్‌లో రిపబ్లికన్లు 51-49 నిష్పత్తిలోనే ఉండేవారని ట్రంప్‌నకు గుర్తుచేసారు. మరో అడుగు ముందుకేసి అమెరికా అధ్యక్షుడిని అభిశంసించాలని కూడా పిలుపునిచ్చారు. ఇద్దరిమధ్య ఇంతటి తీవ్రస్థాయి అగాథాన్ని పెంచిన 'బ్యూటిఫుల్ బిల్' (వ్యయ నియంత్రణబిల్లు)అమలుచేసి తీరుతానని ట్రంప్ చెపుతుంటే మస్క్ మాత్రం తీవ్రంగావ్యతిరేకించారు. దీనివల్ల పన్నులభారం పెరుగుతుందని, ద్రవ్యోల్బణం కూడా పెరుగుతుందని, ఈ బిల్లుకు ఎవ్వరూ మద్దతు పలకవద్దని, మద్దతిస్తే అమెరికాను మరోసారి సంక్షోభంలోకి నెట్టివేసినట్లే అని తన ఎక్స్‌మీడియాలో పిలుపునిచ్చారు. అందువల్లనే డోజ్‌నుంచి వైదొలిగారు. ఇతర దేశాల్లో తన వ్యాపార సామ్రాజ్యం విస్తరించే వ్యూహాల్లో ఉన్నారు. రాయితీలు, కాంట్రాక్టులు రద్దుచేస్తామని ప్రకటించిన వెంటనే టెస్లా షేర్లు దారుణంగా పడిపోయాయి. సుమారు200 బిలియన్ డాలర్లవరకూ టెస్లాషేర్లు ఆవిరి అయ్యాయంటే ట్రంప్ మస్క్‌ల మధ్య అంతరాలు ఎంత పెరిగాయో తెలుస్తోంది. అందుకే చైనా, ఇతర యూరోప్ దేశాల్లో తనవ్యాపార విస్తరణపైఫోకస్ పెంచిన ఈ ఆప్తమిత్రుడు భవిష్యత్తులో కొత్తపార్టీ అంటూ పెడితే అటు డెమొక్రాట్లు,ఇటురిపబ్లికన్లు ఇద్దరికీ ఎంతో కొంత నష్టం తప్పదనే చెప్పాలి. తాను సోషల్ మీడియాలోచేసిన ప్రతిపాదనకే 80శాతం మంది అమెరికన్లు మద్దతు ఇచ్చారని, 80శాతం అమెరికన్లు కూడా తనకు మద్దతుపలికారంటూ సంచలన వ్యాఖ్యలుచేసారు.ఇద్దరిమధ్య భారీస్థాయిలో విభేదాలు రావడానికి డోజ్ వ్యవస్థ కీలకం కాగా తాజాగా తెచ్చిన వ్యయనియంత్రణ బిల్లుకూడా అనిచెప్పొచ్చు. మొత్తంగా చూస్తుంటే ట్రంప్ పదవీకాలం మొత్తం మస్క్ వేసే ఎత్తుగడలను ఎదుర్కొనేందుకు కొంత నిర్దిష్ట సమయం కేటాయించాల్సి ఉంటుంది. ఇప్పటికే ట్రంప్ విధి విధానాలపై ప్రపంచదేశాల నుంచి తీవ్రనిరసన వ్యక్తం అవుతున్న క్రమంలో ప్రధాన మిత్రుడు వేరు కుంపటికి సిద్ధపడితే రానున్న కాలంలో ట్రంప్‌కే కాదు రిపబ్లికన్లకుసైతం భారీ స్థాయిలో నష్టం కలుగుతుందని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఇప్పుడు ప్రత్యర్థిగా మారుతున్నమస్క్‌వేసే ప్రణాళికలపైనే ట్రంప్ ఎక్కువ ఫోకస్ పెంచుతున్నారనడంలో ఎలాంటి సందేహంలేదు. ●

# జీవ కోటికి సముద్ర జలమే జీవనాధారం

మానవుడు నివసించే భూగ్రహంపై 29 శాతం మాత్రమే భూమి ఉన్నది.71 శాతం సముద్రము నీరు వుంది. మిగిలినదంతా సముద్రపు నీటి ద్వారా ఆవరించబడి ఉంది. ఈ గ్రహంలో జీవులన్నీ ప్రత్యక్షంగా పరోక్షంగా సముద్రాలపై ఆధారపడి జీవిస్తున్నాయి. కడలిని కాపాడుకోవడం అందరి బాధ్యత. జీవరాశికి రక్షణ ఆహార పంటలు పారిశ్రామిక అభివృద్ధికి అవసరమవు జలవనరులను సమకూర్చే సముద్రాలు చెత్తాచెదారంతో నిండిపోతున్నాయి. విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగించి కడలిలో పడేస్తున్నారు. మనుషుల స్వార్థం పారిశ్రామిక వ్యర్థపదార్థాలు సముద్రంలో కలవడం వల్ల సముద్రం నీరు కాలుష్యమై సముద్రంలో ఉన్న జీవులు అంతరించిపోతున్నాయి. సాగర జలం బాగుంటేనే సకల జీవరాశులు బాగుంటాయన్న విషయాన్ని ప్రభుత్వాలు ప్రజలు విస్మరించడంపట్ల పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సముద్రాలకు ఉన్న ప్రాముఖ్యత గుర్తించి మానవ వనరుల వికాసంలో సముద్ర వనరుల పాత్ర గురించి ప్రజలకు అవగాహన చైతన్యం కలిగించడానికి ఐక్యరాజ్యసమితి ప్రతి సంవత్సరం జూన్ 8న ప్రపంచ సముద్ర దినోత్సవాన్ని నిర్వహిస్తుంది. ప్లాస్టిక్‌వ్యర్థాలు 'డ్రైనేజీ' చెత్త పారిశ్రామిక వ్యర్థ పదార్థాలు సముద్రాలలో విచ్చల విడిగా పడేస్తున్నారు. అనేక దేశాలు పారిశ్రామిక వ్యర్థాలను నౌకలలో తరలించి సముద్రాల్లో పడేస్తున్నారు. వేల కొద్ది టన్నుల చెత్త సముద్ర గర్భంలో కలిసిపోయి కాలుష్య కారకాలు పెరిగిపోతున్నాయి.సముద్రాలలో పడేసిన ప్లాస్టిక్ భూమిలో కరగక ఈప్లాస్టిక్ కాలుష్యకారకంగా తయారై సముద్రంలో ఉన్న చేపలు ఇతర జీవరాసులు అంతరిస్తున్నాయి. నీటి కాలుష్యం వల్ల జీవజాతులు అంతరించిపోవడం వల్ల జీవావరణం పర్యావరణం దెబ్బతింటుంది. సముద్రాలను రక్షించే చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వాలు ఉదాసీనతను నిర్లక్ష్యాన్ని వహిస్తున్నాయి. ప్రభుత్వాల చర్యలు తుతు మంత్రంగా వుండడం గమనార్హం. సముద్ర రక్షణ దినోత్సవం రోజు ప్రభుత్వాలు సముద్రాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పర్యావరణ ప్రేమికులు హెచ్చరిస్తున్నారు. ప్రపంచ సముద్ర దినోత్సవం పురస్కరించుకొని ఐక్యరాజ్యసమితి 45దేశాలకు చెందిన ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేస్తుంది. బ్రెజిల్‌లోని రియో డిజనిరో నగరంలో 1992 ఐక్యరాజ్యసమితి సముద్రాలపై అవగాహన పెంచడానికి సదస్సును నిర్వహించింది. 2008లో తొలిసారిగా ప్రపంచ సముద్ర దినోత్సవాన్ని నిర్వహించింది. 2025 ప్రపంచ సముద్ర దినోత్సవం థీమ్ 'మనసముద్రం మన బాధ్యత' మన అవకాశం. ఈఏడాది అంతర్జాతీయ సముద్ర దినోత్సవం థీమ్‌గా ఎంపిక చేశారు. ఇది 2025 సెప్టెంబర్ 25న జరిగే ప్రపంచ సముద్ర దినోత్సవ వేడుకలతో ముగుస్తుంది. ప్రభుత్వాలు పౌర సమాజం సముద్ర జలాల రక్షణను విస్మరిస్తునాయి.సముద్రపు నీరు కలుషితానికి గురిఅవుతుంది. చాలా దేశాల్లో వ్యర్థాలను సముద్రంలో కలుపుతున్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో సముద్రం కీలక పాత్ర పోషిస్తుంది. ప్రపంచ వాణిజ్యంలో 80 శాతం సముద్రం ద్వారా రవాణా జరుగుతుంది. పర్యావరణానికి అతి తక్కువ హాని కలిగించే రవాణా విధానం సముద్రాలపై జరిగే షిప్పింగ్ గుర్తింపు పొందడం గమనార్హం.ప్రపంచంలోనే రోజువారి రొట్టె తయారు చేయడానికి అవసరమైన ధాన్యాన్ని ఓడ ద్వారా మాత్రమే రవాణా చేయగలం. షిప్పింగ్ సముద్ర అంతరిక్షంలో పనిచేస్తున్న అతి పెద్ద రంగం సముద్ర పర్యావరణ పరిరక్షణకు షిప్పింగ్ ఉపయోగపడుతుంది. సముద్ర వనరుల నిర్వాహణలో షిప్పింగ్ కీలక పాత్ర వహిస్తుంది.లక్షలాదిమందికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. సముద్రాలు గొప్ప ఆహారవనరు. సముద్రం

**నేదునూరి కనకయ్య**

అనేక జాతులకు నిలియంగా వెలిసింది. వాతావరణాన్ని నియంత్రిస్తుంది. ఉష్ణోగ్రతలను భూతాపాన్ని నియంత్రించే శక్తి సముద్రాలకు ఉన్నాయి. బీచ్‌లో వంటి నీటి వనరుల చుట్టు మన అజాగ్రత్త వల్ల కాలుష్యం పెరిగిపోతుంది. దీంతో సముద్రంలోని అనేక వేలజీవరాశులు మరణిస్తున్నాయి. ప్రకృతి విపత్తులు జరిగే అవకాశంఉంది. ప్రజలకు ఈ



విషయాలపై అవగాహన కల్పిస్తారు. సముద్రాల సుస్థిర అభివృద్ధి ద్వారానే ఆర్థిక వ్యవస్థలో సుస్థిరాభివృద్ధి సాధనకు కృషి చేసే విధంగా సదస్సులు చర్చలు సమావేశాలు ర్యాలీలు నిర్వహిస్తారు.సముద్రం కనీసం 50శాతంఆక్సిజన్ ఉత్పత్తి చేస్తుందని ఐక్యరాజ్యసమితి డాటా తెలుపుతుంది. మహా సముద్రాలు 30శాతంకంటే ఎక్కువ కార్బన్డయాక్సైడ్‌ను గ్రహిస్తాయని,ఇవి గ్లోబల్ వార్మింగ్ ప్రభావం తగ్గిస్థాయిని రుజువు చేసింది. చెత్త 'మురుగు' 'చమురు' లీకేజీ అవకాశం ఉంది. ఈవిషయాలపట్ల ప్రతి పౌరుడు అవగాహన కలిగి ఉండాలి. ముందు జాగ్రత్తలు తీసుకునేట్లు చైతన్య పరచడం ప్రభుత్వాల బాధ్యత. సముద్రాలు ప్రపంచంలో కోట్లాది మందికి జీవనోపాధిని పౌష్ఠికాహారం అందిస్తూ జీవరాశుల మనుగడకు దోహద పడుతున్నాయి. ప్రపంచ పటంలో 3వంతులకు పైగా సముద్రాలు విస్తరించి ఉన్నాయి. అయినప్పటికీ కాలక్రమేణా అవి కాలుష్యంబారిన పడుతున్నాయి. మానవుడు సముద్ర జలాలను కలుషితం చేస్తూ సముద్ర జీవుల మనుగడకు ముప్పు ఏర్పడే విధంగా వ్యవహరిస్తున్నాడు.సామాజిక ఆర్థికవేత్తల ఆందోళన. ప్రపంచ వ్యాప్తంగా ప్లాస్టిక్ వినియోగం పెరిగిపోతుంది. ప్లాస్టిక్ సంచులు ఇతర వస్తువులు పర్యావరణానికి హాని చేస్తున్నాయని అందరికీ తెలిసినా వాటి వినియోగాన్ని నియంత్రించడానికి సమగ్రమైన చర్యలు ప్రభుత్వాలు తీసుకోకపోవడం పౌరుల్లో ప్లాస్టిక్ వల్ల వచ్చే ప్రమాదాల గురించి అవగాహన లేకపోవడం ప్లాస్టిక్ వినియోగంలో ప్రపంచ మానవాళితాను కూర్చున్న చెట్టు కొమ్మను తానే నరుకునట్టుగా వ్యవహరిస్తున్నారని సామాజిక ఆర్థికశాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మానవ శరీర నిర్మాణంలో ప్రోటీన్లు కీలకపాత్ర వహిస్తాయి. అలాంటి ప్రోటీన్లను అందజేసే సత్తా ఒక సముద్ర జీవులకే ఉంది. ఐక్యరాజ్యసమితి అంచనాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం సముద్రాలలో ఐదు ట్రిలియన్ మైక్రోప్లాస్టిక్ ఉన్నాయని వీటిని సముద్ర జీవులు( చేపల వంటివి) మింగడం వాటిని మనం ఆహారంగా తీసుకోవడంతో పలువురు క్యాన్సర్ల బారినపడుతున్నారని వైద్య ఆరోగ్యసర్వేలు తెలియజేస్తున్నాయి. 2025 సంవత్సరం నాటికి సముద్రాలలో ప్లాస్టిక్ చేపల నిష్పత్తి ఒకటి నిష్పత్తి 1:3గా ఉంటుందని అంచనాలు తెలుపుతున్నాయి. అనేక దేశాలు వ్యర్థ జలాలను సముద్రంలోకి విచక్షణ రహితంగా వదులుతున్నాయి. త్వరలో విశ్వవ్యాప్తంగా సముద్రంలో కలుస్తున్న డ్రైనేజీ వాటర్‌లో 70శాతం శుద్ధి చేయనందున సముద్ర జలాలు కలుషితమవుతున్నాయి. సముద్ర వాతావరణంలో మార్పులు వస్తున్నాయి. దీనివల్ల ప్రతి ఏటా 13 మిలియన్ డాలర్ల నష్టం జరుగుతుంది. అని యు 'ఎన్ఇపి' అంచనా వేసింది. ప్లాస్టిక్ వ్యర్థాలను సముద్ర జలాల్లో పారవేస్తున్న దేశాల్లో భారత్, చైనా వాళ్లు ముందు వరసలో ఉండటం శోచనీయం. మన దేశంలో సాలీన ప్లాస్టిక్ వియోగం 15 మిలియన్ టన్నులు. ఇది 2050నాటికి 20 మిలియన్ల టన్నులు అవుతంది. 2050 నాటికి సముద్ర జలాల్లోని ప్లాస్టిక్ వస్తువులను తొలగించకపోతే సముద్రాల్లో ఉండే చేపల బరువు కన్నా ప్లాస్టిక్ వ్యర్థాల బరువు ఎక్కువ ఉంటుందని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మన దేశంలో పశ్చిమబెంగాల్లో రోడ్లనిర్మాణంలో ప్లాస్టిక్ వ్యర్థాలను వినియోగిస్తున్నారు.వీటిపై మరిన్ని పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉంది.మనకన్నా అభివృద్ధిలోఆర్థికంగా వెనకబడిన దేశాలైన బాంగ్లాదేశ్ రువాండా కీన్యాయలో ప్లాస్టిక్ బ్యాగుల తయారీ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాయి. ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలి. ఇకనైనా సముద్ర జలాల్లోకి ప్లాస్టిక్ వ్యర్థాలను వదలడం ఆపకపోతే చేపల కన్నా ప్లాస్టిక్ వ్యర్థాలు ఎక్కువ ఉండేప్రమాదంఉంది.ప్లాస్టిక్ వినియోగం మీద నిషేధం విధించాలి. పర్యావరణహిత వస్తు వినియోగాన్ని ప్రోత్సహించాలి.పర్యావరణహితకరమైన వస్తువుల వినియోగాన్నిప్రోత్సహించాలి. ప్రభుత్వాలు ఐక్యరాజ్య సమితి తీర్మానాలను అమలుచెయ్యాలి. ప్రకృతిపర్యావరణ రక్షణకు సముద్రాల రక్షణకు సమగ్రమైన చట్టాలు రూపొందించి అమలు చెయ్యాలి. కడలిని రక్షించుకోవాలి. కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు కడలిని కాపాడుకుంటేనే మానవ మనుగడ సాధ్యమోతుందిఅన్న వాస్తవాన్ని గ్రహించిసముద్ర జలాలను కాలుష్యం కాకుండా తక్షణ కార్యాచరణ ప్రణాళికలను అమలుచెయ్యాలి. పౌరసమాజం 'మహిళా' యువజన, సామాజిక సేవాసంస్థలు,సముద్ర జలాల రక్షణ వినియోగం ప్రయోజనాల మీద ప్రజలకు అవగాహన కలిగించాలి. ●

# వలసదారులే లక్ష్యంగా ఇమ్మిగ్రేషన్ దాడులు

## కార్మికనేత సహా 45 మంది అరెస్టు



**లాస్‌ఏంజెల్స్, జూన్ 7:** అమెరికాలో వలసదారులే లక్ష్యంగా ఫెడరల్ ఏజెంట్లు చేపట్టిన దాడులు తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. లాస్ ఏంజెలెస్‌లోని పలు ప్రాంతాల్లో నిన్న రెండు హోం డిపో ప్రాంగణాలు సహా, ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెంట్లు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సోదాలకు వ్యతిరేకంగా వందలాది మంది ప్రజలు, వలసదారుల హక్కుల కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు చేపట్టారు. దీంతో అధికారులు, ప్రదర్శనకారుల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రముఖ కార్మిక సంఘ నాయకుడితో సహా 45 మందికి పైగా అరెస్టు అయ్యారు. వలసదారుల మానవతాహక్కుల కూటమి (సీహెచ్‌ఐఆర్‌ఎల్‌ఏ) ఆధ్వర్యంలో లాస్ ఏంజెలెస్ స్ట్రీట్‌లోని ఫెడరల్ భవనం సమీపంలో సుమారు 500 మంది ప్రదర్శనకారులు వలసదారులకు మద్దతుగా ప్లకార్డులు, జెండాలు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. సాయంత్రం 7 గంటల ప్రాంతంలో లాస్ ఏంజెలెస్ పోలీస్ డిపార్ట్‌మెంట్ ఈ నిరసనను చట్టవిరుద్ధమైన సమావేశంగా ప్రకటించి, వెంటనే ఖాళీ చేయాలని, లేకపోతే అరెస్టులు తప్పవని హెచ్చరించింది. రెండు హోం డిపోలు, ఒక ఫ్యాషన్ డిస్ట్రిక్ట్ సంస్థ, ఒక డోనట్ షాపుతో పాటు మొత్తం ఏడు వేర్వేరు ప్రాంతాల్లో ఎలాంటి వారెంట్లు లేకుండా కనీసం 45 మందిని అదుపులోకి తీసుకున్నారని సీహెచ్‌ఐఆర్‌ఎల్‌ఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఏంజెలికా సలాస్ ఆరోపించారు. మన రాజ్యాంగ హక్కులు, చట్టపరమైన ప్రక్రియ ఉల్లంఘనకు గురైతే, ఎవరి హక్కులైనా ఉల్లంఘించబడవచ్చని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. మీరు వలసదారు కానందున సురక్షితంగా ఉన్నారని అనుకుంటే, మన దేశంలో జరుగుతున్నది అపూర్వమైనదని నేను మీకు చెప్పాలనుకుంటున్నానని ఆమె హెచ్చరించారు. శాన్ డియాగోలోని ఓ రెస్టారెంట్‌లో జరిగిన ఇమిగ్రేషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఘటన తర్వాత ఈ నిరసనలు చెలరేగాయి. అలాగే, మిన్నియాపాలిస్‌లో ఫెడరల్ ఏజెంట్లు లాటినో కమ్యూనిటీలోకి ప్రవేశించినప్పుడు ఇలాగే నిరసనలు వెంటాడాయి. అయితే, తాము ఇమిగ్రేషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కోసం కాకుండా, క్రిమినల్ దర్యాప్తునకు సంబంధించిన విషయమై వచ్చామని అధికారులు అప్పుడు స్పష్టం చేశారు. లాస్ ఏంజెలెస్‌లోని నిరసనల సమయంలో, కొందరు ఆందోళనకారులు ఫెడరల్ భవనంపై గ్రాఫిటీ వేశారని, దీనికి ప్రతిగా పోలీసులు పొగ బాంబులు ప్రయోగించారని లాస్ ఏంజెలెస్ టైమ్స్ నివేదించింది. సర్వీస్ ఎంప్లాయిస్ ఇంటర్నేషనల్ యూనియన్ (ఎస్ఈఐయూ) కాలిఫోర్నియా ప్రెసిడెంట్ డేవిడ్ హ్యుయెర్టా అరెస్టుతో నిరసనలు మరింత తీవ్రరూపం దాల్చాయి. లాస్ ఏంజెలెస్ ఫెడరల్ భవనం వద్ద పెద్ద సంఖ్యలో ప్రజలు గుమిగూడి, ఇమ్మిగ్రేషన్ అధికారుల దాడులను ఖండిస్తూ, హ్యుయెర్టా విడుదలను డిమాండ్ చేశారు.

దాడులను రికార్డు చేస్తున్న సమయంలో హ్యుయెర్టా గాయపడ్డా రని, ఫెడరల్ ఏజెంట్ల విధులకు ఆటంకం కలిగించారనే ఆరోపణలతో ఆయనను అరెస్టు చేశారని కార్మిక సంఘం తెలిపింది. 58 ఏళ్ల హ్యుయెర్టాకు ఆసుపత్రిలో వైద్య చికిత్స అందించిన అనంతరం సెంట్రల్ ఎల్ఏలోని మెట్రోపాలిటన్ డిటెన్షన్ సెంటర్‌కు తరలించారు. నాకు జరిగింది నా గురించి కాదు, ఇది చాలా పెద్ద విషయమని ఆసుపత్రి నుంచి హ్యుయెర్టా ఒక ప్రకటన విడుదలచేసారు. కష్టపడి పనిచేసే ప్రజలు, మన కుటుంబ సభ్యులు, మన సమాజ సభ్యులను నేరస్థులుగా పరిగణిస్తున్నారు. ఈ అన్యాయాన్ని మనం అందరం కలిసికట్టుగా వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు.



# ముర్షిదాబాద్ అల్లర్లపై ఛార్జిషీట్

## 13 మంది కీలక నిందితులపై అభియోగాలు

## 60 ఎఫ్ఐఆర్‌లు, 300 మంది అరెస్టు

**కోల్‌కత్తా, జూన్7:** బెంగాల్‌లోని ముర్షిదాబాద్‌లో జరిగిన అల్లర్లకు సంబంధించి పోలీసులు 13 మందిపై ఛార్జిషీటు దాఖలుచేసారు. ముర్షిదాబాద్‌లోని జఫరాబాద్ హింసకు సంబంధించి ఒక తండ్రి కొడుకులు ఇద్దరూ మరణించారు. హారగోబిందోదాస్(74), చందన్‌దాస్(40)లు ఈ హింసలో చనిపోయారు. ధులియన్ సూతీ షంషేర్‌గంజ్ మతపరమైన హింసకు సంబంధించిన ఘర్షణల్లో వీరు చనిపోయారు. వక్ఫ్ సవరణ చట్టం 2025పై తీవ్ర నిరసనలు వ్యక్తం చేస్తూ ఈ ప్రదర్శనలు చేసారు. దీనితో ఆప్రాంతంలో కేంద్ర సాయుధ బలగాలను మోహరించి శాంతిభద్రతలను సమీక్షించారు. ఇందుకు సంబంధించి నేరం జరిగిన 55 రోజుల్లోనే తాము ఛార్జిషీటును దాఖలుచేసామని, ఈ నేరంలో 13 మంది వ్యక్తులప్రమేయం ఉందని తాము నిరూపించగలమని పోలీసులు తెలిపారు. ఈ హింస తర్వాత పోలీసులు సుమారు 300 మందికిపైగా అరెస్టులుచేసారు. అంతేకాకుండా 60కిపైగా ఎఫ్ఐఆర్‌లు కూడా నమోదు చేసారు. ముర్షిదాబాద్ జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో ఈకేసులు నమోదయ్యాయి. మృతుడు దాస్ నివసిస్తున్న బెట్‌బోనా గ్రామం ముష్కరులు టార్గెట్ చేసారు. దీనికితోడు దాస్ నివాసం టార్గెట్ అయింది. ప్రధాన ద్వారం బద్దలుకొట్టారు. చందన్‌దాస్, హారగోవిందోదాస్‌ను బయటికి ఈడ్చుకెళ్లి వారిపై గొడ్డలితో దాడులు చేసారు. వారు చని పోయేంత వరకూ వేచిచూసి అప్పుడు ముష్కరులు వెళ్లినట్లు తేలింది. ఆందోళనకారులు కొన్ని ఆస్తులను దగ్ధంచేస్తే మంటలు కొనసాగేందుకు వీలుగా ఆప్రాంతంలో నీటిసరఫరాలను కూడా బంద్ చేసినట్లు తేలింది.

స్థానిక తృణమూల్ కాంగ్రెస్ నాయకుడు మెహబూబ్ ఆలమ్, ధూలియన్ మున్సిపాలిటీ మాజీ ఛైర్మన్‌ల డైరెక్షన్‌లోనే ఈ దాడులుజరిగినట్లు నిజనిర్ధారణ కమిటీ తేల్చింది. గతనెల 21వ తేదీ ఈ టీమ్ హైకోర్టుకు నివేదికి వచ్చింది. రాష్ట్రపోలీసులు అచేతనంగా వ్యవహరించారని, యూనిఫామ్ సిబ్బంది తక్షణమే స్పందించకపోవడం వల్లనే ఇద్దరి హత్య జరిగిందన్నారు. మొత్తం 113 ఇళ్లు దారుణంగా దెబ్బతిన్నాయని, బెట్‌బోనా గ్రామంలో దుండగులు రెచ్చిపోయి విధ్వంసం సృష్టించినట్లు కమిటీ నివేదిక ఇచ్చింది.

# మహారాష్ట్రలో 'ప్రజాస్వామ్య రిగ్గింగ్'

## మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడిన బిజెపి

## కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపణలు

## తీవ్రంగా స్పందించిన బిజెపి



**న్యూఢిల్లీ, జూన్ 7:** మహారాష్ట్రలో బిజెపి నేతృత్వంలోని మహాయుతి కూటమిపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించేందుకు కమలం పార్టీ మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడిందని ఆరోపించారు. ప్రజాస్వామ్య రిగ్గింగ్‌కు ఆ ఎన్నికలు ఓ ఉదాహరణ అని వ్యాఖ్యానించారు. బీహార్‌లోనూ అదే పరిస్థితి పునరావృతం అవుతుందని విమర్శించారు. దీనిపై బిజెపి కౌంటర్ ఇచ్చింది. ఎన్నికల్లో అక్రమాలు ఎలా? అంటూ ఎక్స్ వేదికగా రాహుల్ గాంధీ సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. 'ప్రజాస్వామ్య రిగ్గింగ్‌కు 2024లో జరిగిన మహారాష్ట్ర ఎన్నికలు ఒక ఉదాహరణ. ఎన్నికల కమిషన్ నియామకం, నకిలీ ఓటర్ల నమోదు, పోలింగ్‌లో అవకతవకలు, ఆధారాలను దాయడం వంటి చరనయలకు పాల్పడ్డారు. బిజెపి ఎందుకు అలా ప్రవర్తించిందో అర్థం చేసుకోవడం పెద్ద కష్టం కాదు. రిగ్గింగ్ అనేది మ్యాచ్ ఫిక్సింగ్‌లాంటిది. మోసం చేసే పార్టీ ఆటలో గెలవొచ్చు. కానీ అలాంటి గెలుపు వ్యవస్థలను దెబ్బతీస్తుంది. ఎన్నికల ఫలితాలపై ప్రజల విశ్వాసాన్ని నాశనం చేస్తుంది. ప్రజలంతా ఆధారాలను గమనించి సమాధానాల కోసం డిమాండ్ చేయాలి. ఎందుకంటే మహారాష్ట్ర తర్వాత బీహార్ ఎన్నికలు ఉన్నాయి. ఆ తర్వాత బిజెపికి ఓటమి భయం ఎక్కడుంటుందో అక్కడ ఇవే పునరావృతం అవుతాయి. మ్యాచ్‌ఫిక్సింగ్ ఎన్నికలు ప్రజాస్వామ్యానికి విషం లాంటివి' అంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. ఇవే అంశాలను ఆయన ఓ జాతీయ మీడియా కాలమ్‌లో ప్రస్తావించారు. ఈ ఆరోపణలపై బిజెపి తీవ్రంగా స్పందించింది. ఇసి చాలాసార్లు వివరంగా చెప్పినా రాహుల్‌గాంధీ మళ్లీ దేశంలోని వ్యవస్థలను బూచిగా చూపే పనిలో ఉన్నారని మండిపడింది. మహారాష్ట్ర శాసనసభకు 288 సీట్లు ఉన్నాయి. గత ఏడాది జరిగిన ఎన్నికల్లో బిజెపి, శివసేన, ఎన్‌సిపి కూటమి 235 సీట్లు గెలుచుకుంది. ఒక్క కమలం పార్టీకే 132 స్థానాలు దక్కాయి. మరోవైపు ఈ ఏడాది చివర్లో బీహార్ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే.

# ఛాతెన్‌లో చిక్కుకుపోయిన 76మందిని ఆర్మీ ఎయిర్‌లిఫ్టింగ్



**గ్యాంగ్‌టక్, జూన్ 7:** సిక్కింలో సంభవించిన భారీ వరదలకుగాను ఛాతెన్ ప్రాంతంలో చిక్కుకుపోయిన సైనికుల్లో 76 మందిని హెలికాప్టర్ల సాయంతో రక్షించారు. కొండచరియలు విరిగి పడటం భారీ వర్షాల కారణంగా రహదారులన్ని మూసుకుపోయాయి. రాకపోకలకు తావులేని తరుణంలో ఆర్మీ సిబ్బందిని రక్షించేందుకు రంగంలోని వైమానికదళ హెలికాప్టర్లు వచ్చాయి. ఈప్రాంతంలో ఇతరత్రా చిక్కుకుపోయిన యకుకులను కూడా తరలించామని ఆర్మీ సిబ్బంది చెప్పారు. ఎంఐ 17 హెలికాప్టర్లద్వారా మొత్తం ఈ తరలింపు కార్యక్రమం పూర్తిచేసామని ఛాతెన్‌నుంచి పాక్యాంగ్‌గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుకు వీరందరినీ తరలించినట్లు అధికారులు తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలకు గురయిన ఈ ప్రాంతంలో మొత్తం సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నామని, ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది సహాయక చర్యల్లో ఉన్నట్లు రాష్ట్రప్రభుత్వం తెలిపింది. ఉత్తర సిక్కింగ్ ప్రాంతం భారీ వర్షాలకు తీవ్రంగా దెబ్బతిన్నది. లాచెన్, లాచుంగ్, ఛుంగ్ థాంగ్ పట్టణాల్లో సుమారు 1600 మందికిపైగా యాత్రీకులు చిక్కుకుపోయారు. వారందరినీ రాష్ట్రప్రభుత్వం హెలికాప్టర్ల సాయంతో రక్షించింది. కాగా ఈ ప్రళయంలో ముగ్గురు ఆర్మీ సిబ్బంది చనిపోయారు. మరో నలుగురు గాయపడ్డారు. వీరుకాకుండా ఆరుగురు సైనికులు ఆచూకీ గల్లంతయింది. వీరి ఆచూకీకోసం ఇతర బృందాలు విస్తృత గాలింపు చర్యలు చేపట్టాయి.

# అసోంలో విద్రోహ చర్యలకు పాల్పడుతున్న మరో ఇద్దరు అరెస్టు

**గువాహతి, జూన్ 7:** జాతివ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న అభియోగాలపై మతవిద్వేషాలను రెచగొడుతున్నారని మరో ఇద్దరిని అస్సాం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీనితో ఒక్క అసోంలోనే పహల్గాంవ్ ఉగ్రదాడి తర్వాత దేశవ్యతిరేక వ్యాఖ్యలుచేసి అరెస్టు అయిన వారి సంఖ్య 90కి పెరిగింది. అసోం సీఎం హిమంత బిశ్వశర్మ మాట్లాడుతూ దేశవిద్రోహక చర్యలను సహించేదిలేదని, మతవిద్వేషాలకు పాల్పడేవారిని ఉపేక్షించబోమని స్పష్టం చేసారు. శ్రీరాముడిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినందుకు గాను ఒక వ్యక్తిని గోల్‌పారా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరో వ్యక్తిని మతవిద్వేషాలు రెచ్చగొట్టారని కామరూప్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. భారత్ వ్యతిరేక నిరసనలపై అస్సాం పోలీసులు ఉక్కుపాదం మోపారు. పాకిస్తాన్ అనుకూల చర్యలను సహించేదిలేదని ఇప్పటికే సీఎం హెచ్చరించారు.

## రాహుల్ కోసం ప్రత్యేక మరుగుదొడ్డి

# ఇలా నిర్మించి.. అలా తీసేశారు!




**పాట్నా, జూన్ 7:** లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ మోంటెన్ మ్యాన్‌గా పేరుగాంచిన దశరథ్ మాంఝీ కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లిన సందర్భంలో జరిగిన సంఘటన ఇపుడు వైరల్ అవుతోంది. దీనిపై సర్వత్రా విమర్శలు కూడా వెల్లువెత్తాయి. రాహుల్ గాంధీ, అధికారుల కోసం కేవలం రెండు గంటల్లో మాంఝీ ఇంటి బయట ఓ వీఐపీ మరుగుదొడ్డిని నిర్మించారు. ఆయన వెళ్లిపోగానే దాన్ని కూలగొట్టారు. రాహుల్ గాంధీ పర్యటనకు ముందు రాష్ట్ర ప్రభుత్వం చకచకా ఏర్పాట్లు చేసింది. ఇందులో భాగంగా దశరథ్ మాంఝీ మట్టి ఇంటి వెలుపల ఓ అత్యవసర వీఐపీ మరుగుదొడ్డిని నిర్మించారు. కేవలం రెండు గంటల్లోనే ఇది సిద్ధమైంది. అయితే, రాహుల్ గాంధీ ఆ గ్రామం నుంచి తిరిగి వెళ్లిన వెంటనే అధికారులు ఆ మరుగుదొడ్డిని తొలగించారు. చారిత్రక నేపథ్యం ఉన్న మాంఝీ కుటుంబానికి శాశ్వత మరుగుదొడ్డి సౌకర్యం కల్పించడంలో విఫలమైన ప్రభుత్వం, నేతల పర్యటనల కోసం తాత్కాలిక హంగులు చేయడంపై పలువురు ప్రశ్నలు లేవనెత్తారు. దశరథ్ మాంఝీ మనవరాలు అన్షు కుమారి తమ కుటుంబం ఎదుర్కొంటున్న దుస్థితిని వివరించారు. 2015లో ప్రభుత్వం నిర్మించిన మరుగుదొడ్డిని రోడ్డు నిర్మాణం కోసం కూల్చివేశారని, అప్పటి నుంచి గత పదేళ్లుగా తమకు మరుగుదొడ్డి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ పర్యటన సందర్భంగా మాంఝీ కుమారుడు భగీరథ్ మాంఝీ రెండు ప్రధాన డిమాండ్లను ఆయన ముందుంచారు. ప్రస్తుతం తాము నివసిస్తున్న మట్టి ఇంటి స్థానంలో పక్కా ఇల్లు నిర్మించాలని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బోధ్ గయ స్థానం నుంచి పోటీ చేసేందుకు అన్షు కుమారికి కాంగ్రెస్ పార్టీ టికెట్ కేటాయించాలని వారు కోరారు. కాంగ్రెస్ కుటుంబ సభ్యులు చెప్పిన సమస్యలను రాహుల్ గాంధీ సావధానంగా విన్నారు. వారి విజ్ఞప్తులను పార్టీ పరిశీలిస్తుందని హామీ ఇచ్చారు. బీహార్‌లో దళిత వర్గాలతో సంబంధాలను బలోపేతం చేసుకునేందుకు కాంగ్రెస్ పార్టీ పక్కా ప్రణాళికతోనే ఈ పర్యటన చేపట్టిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. తన గ్రామానికి అభివృద్ధి ఫలాలు అందించేందుకు కొండను తొలిచి రహదారి నిర్మించిన దశరథ్ మాంఝీ స్ఫూర్తిని, ఆయన ప్రతీకను రాజకీయంగా వాడుకునే ప్రయత్నంగా దీనిని చూస్తున్నారు.

# ట్రంప్‌తో వివాదం.. మస్క్‌కు రష్యా బంపర్ ఆఫర్!



**మాస్కో, జూన్ 7:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌ల మధ్య బంధం బీటలు వారిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మస్క్‌కు రష్యా బంపర్ ఆఫర్ ప్రకటించింది. తమ దేశంలో పొలిటికల్ అసైలమ్‌లో ఉండేందుకు మస్క్‌కు అవకాశం కల్పిస్తామని పేర్కొంది. రష్యాకు చెందిన స్టేట్ డూమా ఫెడరేషన్ కమిటీ ఛైర్మన్ దిమిత్రి నోవికోవ్ ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'మస్క్ పూర్తిగా భిన్నమైన ఆట ఆడతారని నేను అనుకుంటున్నా. ఆయనకు రాజకీయ శరణార్థిగా ఉండాల్సిన అవసరం లేదు. ఒకవేళ అలా చేయాలనుకుంటే రష్యా సహకరిస్తుంది' అని పేర్కొన్నారు. ఎడ్వర్డ్ స్నోడెన్ లాగానే మస్క్‌కు రష్యాలో రాజకీయ శరణార్థిగా అవకాశం కల్పిస్తారా అని అడిగిన ప్రశ్నకు ఆయన ఈ విధంగా సమాధానమిచ్చారు. అమెరికాకు చెందిన స్నోడెన్‌ను రాజకీయ శరణార్థిగా పరిగణిస్తూ రష్యా ఆశ్రయం కల్పించింది. ఈ సందర్భంగా తర్వాత ఎన్నికల్లో డెమోక్రట్లు రావాలని మస్క్ కోరుకోవడం లేదని తాను అనుకుంటున్నానని దిమిత్రి తెలిపారు. కాగా.. ట్రంప్, మస్క్‌ల మధ్య నెలకొన్న వివాదంపై జోక్యంచేసుకునేందుకు క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ నిరాకరించారు. ఇది యుఎస్ సమస్య అని, తమకు ఇందులో జోక్యం చేసుకొనే ఉద్దేశం లేదని వ్యాఖ్యానించారు. అధ్యక్షుడే స్వయంగా ఈ సమస్యను పరిష్కరించుకుంటారని తాము భావిస్తున్నట్లు తెలిపారు.

మే నెలలో తీసుకొచ్చిన రిపబ్లికన్ ట్యాక్స్ బిల్లును మస్క్ వ్యతిరేకించడంతో ట్రంప్‌తో దూరం పెరిగింది. ఒకరిపై ఒకరు తీవ్రస్థాయిలో ఆరోపణలు చేసుకున్నారు. ఈ క్రమంలో మస్క్ కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు గురించి ప్రస్తావించారు. 80 శాతం అమెరికన్లకు ప్రాతినిధ్యం వహించేలా కొత్త పార్టీ స్థాపించడానికి ఇది తగిన సమయమంటూ ఎక్స్‌లో తన ఫాలోవర్లను ప్రశ్నించారు. ఇక, ట్రంప్‌నకు అంత్యంత సన్నిహితుడు, గతంలో శ్వేతసౌధం సలహాదారుడిగా పనిచేసిన స్టీవ్ బెనాన్ మస్క్‌ను ఓ అక్రమ వలసదారుగా పేర్కొన్నారు. వెంటనే ఆయనను దేశంనుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. స్పేస్ఎక్స్ సంస్థను సీజ్ చేయాలని అమెరికా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.




## చార్‌ధామ్ యాత్రకువెళ్లే హెలికాప్టర్ ఎమర్జెన్సీ ల్యాండింగ్

# పైలట్‌కు స్వల్పగాయాలు, యాత్రికులు సురక్షితం

**రుద్రప్రయాగ్, జూన్ 7:** కేదార్‌నాథ్‌కు వెళుతున్న హెలికాప్టర్ సాంకేతిక లోపం కారణంగా అత్యవసర ల్యాండింగ్ జరిగింది. రుద్రప్రయాగ్ జిల్లాలోని హైవేపైనే లాండ్ అయింది ఉత్తరాఖండ్‌లోని సిర్సి హెలిపాడ్‌నుంచి టేకాఫ్ తీసుకున్న హెలికాప్టర్ కేదార్‌నాథ్‌కువెళ్లాల్సి ఉండగా సాంకేతిక సమస్య తలెత్తడంలో వెంటనే ఎమర్జెన్సీ లాండింగ్‌చేసారు. దీనితో రోడ్డుపైనే ఉన్న ఖాళీ స్టేషనరీ లారీకి హెలికాప్టర్ వెనుక భాగం తగిలి కొంతమేర దెబ్బతిన్నది. అందులో ప్రయాణిస్తున్న ఆరుగురితోపాటు పైలట్‌కూడా సేఫ్‌గానే ఉన్నారు. ఇటీవలికాలంలో చార్‌ధామ్ రూట్‌లో హెలికాప్టర్ ట్రిప్‌లలో జరుగుతున్న ప్రమాదాల్లో తాజాగా జరిగింది. ఎడబ్ల్యు119 కెస్ట్రెల్ ఏవియేషన్‌సంస్థ 12.52 గంటలకు రుద్రప్రయాగ్‌జిల్లాలోని బదాసు ప్రాంతంలో ఉన్న హెలిపాడ్‌నుంచి ప్రారంభం అయింది. పైకి లేచిన వెంటనే సాంకేతిక సమస్యను గుర్తించిన పైలట్ వెంటనే అత్యవసర లాండింగ్‌చేయడంతో హైవేపై ఆగి ఉన్న స్టేషనరీ కార్‌కు తగిలి కొంత భాగం దెబ్బతిన్నది. ఐదుగురుప్రయాణీకులు సురక్షితమే కానీ పైలట్‌కు మాత్రం స్వల్పగాయాలయ్యాయి. పైలట్‌కు ఎంతో అనుభవం ఉందని డిజిసిఎ ప్రకటించింది. అందువల్లనే సురక్షితంగా హైవేపైనే ల్యాండ్ కాగలిగిందని వెల్లడించింది. ప్రాథమిక సమాచారం ప్రకారం హెలిపాడ్‌నుంచి టేకాఫ్ కాగానే పైలట్‌కు నియంత్రణ స్టక్ అయినట్లు అనుమానించారు. దీనితో వెంటనే బలంగా ల్యాండింగ్ చేసేందుకు నిర్ణయించి హెలిపాడ్‌కు సమీపంలోనే ఉన్న రోడ్డుపై ల్యాండింగ్‌చేసారని డిజిసిఎ వివరణ ఇచ్చింది. పైలట్‌కు స్వల్పగాయాలయ్యాయి. అలాగే వెన్నునొప్పి కూడా ఉండటంతో వెంటనే ఆసుపత్రికి తరలించినట్లు డిజిసిఎ చెప్పింది. ఎయిర్‌సేఫ్టీ డైరెక్టరేట్ టీమ్ ప్రమాదం అధ్యయనం కోసం సంఘటన ప్రాంతానికి వెళ్లింది. గతంలో కూడా కేస్ట్రెల్ ఏవియేషన్ హెలి కాప్టర్ ప్రమాదం జరిగి ఉత్తరాఖండ్ సివిల్‌ఏవియేషన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఫైనాన్స్ కంట్రోలర్ అమిత్ సైని మృతికి కారణం అయింది. ఆ సంఘటనతో సంస్థ కార్యకలాపాలను డిజిసిఎ సస్పెండ్ చేసింది. బాధితుల్లో టిడిపి అనంతపూర్ ఎంపి జి లక్ష్మీనారాయణ సోదరి ఎం వేదవతి కూడా ఉన్నారు.

## ట్రంప్-జిన్‌పింగ్ ఫోన్‌కాల్ వేళ..

# లండన్‌లో యుఎస్-చైనా వాణిజ్య చర్చలు



**వాషింగ్టన్, జూన్ 7:** ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన అమెరికా-చైనా తమ వాణిజ్య వివాదాలను తగ్గించే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో చైనా ప్రతినిధులు, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సలహాదారుల మధ్య సోమవారం లండన్‌లో వాణిజ్య చర్చలు జరగనున్నాయి. తమ దేశం తరఫున ట్రెజరీ మంత్రి స్కాట్ బెసెంట్, వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్, వాణిజ్య ప్రతినిధి జేమీసన్ గ్రీర్ పాల్గొంటారని ట్రంప్ వెల్లడించారు. అలాగే ఈ సమావేశం బాగా జరగాలని ఆయన ఆకాంక్షించారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ట్రంప్ ఫోన్ కాల్‌లో మాట్లాడిన తర్వాత ఈ చర్చల ప్రకటన రావడం గమనార్హం.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గత నెలలో చైనాపై సుంకాలను 145 శాతానికి పెంచిన సంగతి తెలిసిందే. దీనిని ప్రతీకారంగా చైనా కూడా అమెరికా దిగుమతులపై 125 శాతం సుంకాలు విధించింది. ఇలా అధిక టారిఫ్‌లు విధించుకోవడం అంటే ఈ దేశాలు ఒకదానికొకటి ఉత్పత్తులను బహిష్కరించుకోవడం కిందే లెక్క. ఆ పరిణామాలతో అమెరికా జిడిపిలో క్షీణత కనిపించింది. చైనా విషయానికొస్తే అమెరికాకు గత నెలలో ఎగుమతులు భారీగా తగ్గడంతో, ఆ దేశ తయారీ పరిశ్రమపై ప్రభావం పడింది. చైనా ఫ్యాక్టరీల కార్యకలాపాలు 16 నెలల క్షీణతకు చేరాయి. దాంతో ఇరు దేశాలూ వాణిజ్య యుద్ధంలో సంధికి వచ్చాయి.

వాణిజ్య వివాదాలను పరిష్కరించుకోవడానికి, మరిన్ని చర్చలు జరిపే నిమిత్తం టారిఫ్ యుద్ధానికి 90 రోజుల విరామం ఇస్తున్నట్లు ప్రకటించాయి. జెనీవాలో ఇరువర్గాల మధ్య జరిగిన చర్చల ఫలితంగా ఈ ప్రకటనలు వెలువడిన సంగతి తెలిసిందే. 'చైనాతో మంచి భేటీ జరిగింది. చాలా విషయాలు చర్చకు వచ్చాయి. కొన్నింటిపై ఇరుదేశాల మధ్య అంగీకారం కుదిరింది. రెండు దేశాలకు ప్రయోజనకర నిర్ణయాలు తీసుకోవాలనే మేం కోరుకుంటున్నాం. మంచి పురోగతి లభించింది' అని ఆయన రాసుకొచ్చారు. ఈ నేపథ్యంలో లండన్‌లో మరోసారి చర్చలు జరగనున్నాయి. ఈ విషయాన్ని ట్రంప్ ట్రూత్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు.

# చార్టర్డ్ విమానం జాప్యంతో రోగికి ప్రాణదానం

## మహారాష్ట్ర డిప్యూటీ సిఎం ఏక్‌నాథ్‌షిండే మానవతా ధృక్పథం



**జలగాంవ్,జూన్ 7:** మహారాష్ట్ర డిప్యూటి ముఖ్యమంత్రి ఏక్‌నాథ్‌షిండే ప్రయాణించాల్సిన ఛార్టర్ విమానం ఆలశ్యంగా బయలుదేరింది. తన పని వేళలు ముగిసాయని, తొమ్మిది గంటల షిఫ్ట్‌కు సంబంధించి 8.45 గంటలు పూర్తయినందున ఉన్నతాధికారుల అనుమతులు అవసరం ఉంటుందని పైలట్ స్పష్టం చేయడంతో విమానం బయలుదేరడంలో జాప్యం జరిగింది. చివరకు అన్ని అనుమతులు క్లియరెన్సులు రావడంతో రాత్రి 9.45 గంటలకు జలగాంవ్ ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరింది. అయితే పైలట్ ఆలశ్యం చేయడంవల్ల ఒక కిడ్నీరోగికి జీవన దానం చేసినట్లయింది. షిండే కార్యాలయానికి ఒక అత్యవసర సందేశం రావడం, కిడ్నీ రోగిని అత్యవసరంగా ముంబయికి తరలించాల్సి ఉందని, శీతల్‌బొరాడే అనే మహిళ కిడ్నీ వైఫల్యంతో చికిత్సకోసం ఆమె వెళ్లాల్సిన విమానం మిస్ అయిందని ఆమె ముంబయి వెళ్లేందుకు ఏర్పాట్లు చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి అందింది. సమాచారం అందుకున్న వెంటనే షిండే స్పందించి తనతో వస్తున్న ఇద్దరు పార్టీ కార్యకర్తల సీట్లను వారికిచ్చారు. దీనితో రోగి శీతల్ బొరాడేతోపాటు ఆమెభర్తను తన విమానంలోనే ముంబయికి తీసుకువచ్చారు. అంతేకాకుండా ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా ఆసుపత్రికి తరలించేందుకు వీలుగా అత్యవసర అంబులెన్స్‌ను ఎయిర్‌పోర్టులో సిద్ధంచేయడంతో శీతల్ వెనువెంటనే ఆసుపత్రికి చేరవడం వల్ల ఆమెకు ప్రాణదానం చేసినట్లయింది. రాష్ట్ర జలవనరుల మంత్రి గిరిష్ మహాజన్‌నుంచి ఈ సందేశం షిండే కార్యాలయానికి వచ్చింది. ఆ సమాచారం వెంటనే పాస్‌ఆన్ చేయడంతో రోగికి షిండే ప్రాణదానం చేసారని, ఆజంట డిప్యూటిసిఎంను దేవుడిగా అభివర్ణించారు. నిజానికి విమానం బయలుదేరడంలో జరిగిన జాప్యం ఒక రోగి జీవితాన్ని కాపాడిందని, షిండే ప్రదర్శించిన మానవతా ధృక్పథం నేటితరం నేతలకు ఆదర్శనీయమని నీటిసరఫరా, పారిశుధ్యనిర్వహణశాఖమంత్రి గులాబ్‌రావ్‌పాటిల్ అన్నారు.

# సంబంధం లేకపోయినా..నైతిక బాధ్యతతో వైదొలగుతున్నాం

**బెంగళూరు, జూన్ 7:** కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎ. శంకర్, కోశాధికారి ఇఎస్ జైరామ్‌లు తమ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఆర్సీబీ ఐపిఎల్ విక్టరీ పేరేడ్‌లో జరిగిన తొక్కిసలాటలో 11 మంది చనిపోయి 50 మందికిపైగా గాయాలపాలయిన సంఘ టనకు నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామాలు చేస్తున్నట్లు ప్రకటించారు. వీరిద్దరు ఈ మేరకు ఒక సంయుక్త ప్రకటన విడుదలచేసారు. కెఎస్‌సిఎ అధ్యక్షుడికి తాము లిఖితపూర్వక రాజీనామాలను రెండురోజుల ముందే అందచేసినట్లు తెలిపారు. గడచిన రెండు రోజులుగా అనుకోని సంఘటనలు జరిగాయని, అనూహ్యంగా జరిగిన సంఘటనలు కెఎస్‌సిఎ ప్రతిష్టను దెబ్బతీసినట్లు భావిస్తున్నామన్నారు. అందువల్లనే నైతిక బాధ్యతగా తమ పదవులకు రాజీనామాలుచేయాల్సివచ్చిందని ప్రకటించారు. కర్ణాటకక్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు రఘురామ్‌భట్ ,కార్యదర్శి శంకర్, కోశాధికారి జయరామ్‌లు హైకోర్టులో పిటిషన్ దాఖలుచేస్తూ గేట్ మేనేజ్‌మెంట్, జనబాహుళ్యాన్ని నియంత్రించే బాధ్యత కెఎస్‌సిఎది కాదని, ఆర్సీబీ ఐపిఎల్ వేడుకల నిర్వహణకు విధాన్‌సౌధ వద్దనిర్వహణకు అనుమతులు కోరామని చెప్పారు. విధానసౌధ వద్ద సన్మాన కార్యక్రమం ఎలాంటి సంఘటనలు లేకుండా ముగిసిందని చిన్నస్వామి స్టేడియం బయట మాత్రం భారీ ఎత్తున ఫ్యాన్స్ రావడంవల్లనే తొక్కిసలాట జరిగిందని అన్నారు. ఆర్సీబీ సోషల్‌మీడియా ఆహ్వానంతోనే లక్షలాదిగా అభిమానులు తరలివచ్చినట్లు కెఎస్‌సిఎ వెల్లడించింది. అలాగే ముందుగా అనుకున్నట్లు విక్టరీ పేరేడ్‌ను రద్దుచేసామని, అయితే స్టేడియంలోపల కార్యక్రమం మాత్రం సజావుగానే ముగిసిందని, తొక్కిసలాట స్టేడియం బయట మాత్రమే జరిగిందని వారు హైకోర్టుకు ఇచ్చిన పిటిషన్‌లో వెల్లడించారు.

## కెఎస్‌సిఎ కార్యదర్శి, కోశాధికారి రాజీనామా



# రాజీవ్ స్వగృహ హౌసింగ్ బోర్డు ఫ్లాట్లు, స్థలాలు విక్రయం

హౌసింగ్ బోర్డు కమిషనర్ వి.పి.గౌతం

హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త: రాజీవ్ స్వగృహ, హౌసింగ్‌బోర్డు ఫ్లాట్లు, స్థలాలు విక్రయం చేయాలని నిర్ణయించినట్లు హౌసింగ్ బోర్డు కమిషనర్ వి.పి.గౌతం తెలిపారు. ఇప్పటికే ఈ ప్రతిపాదనకు మంత్రివర్గ ఉపసంఘం ఆమోదం తెలిపిందన్నారు. ఈ నెల 20న ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. రాజీవ్ స్వగృహ ఆధ్వర్యంలో పలు జిల్లాల్లోని 11 ప్రాంతాల్లో ఇప్పటికే పూర్తి అయిన, పాక్షికంగా పూర్తి అయిన అపార్ట్‌మెంట్లు ఫ్లాట్లతోపాటు, ఓపెన్ ప్లాట్లు, హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలోని నాలుగు ప్రాంతాల్లోని ఓపెన్‌ప్లాట్లు, ఖాళీ స్థలాలను బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నారు. ఎటువంటి వివాదాలులేని భూములు, అందుబాటులో ఉండే ధరలతో నిర్మించిన అపార్ట్‌మెంట్లు ఫ్లాట్లను కొనుగోలు చేసుకునేందుకు ఆసక్తి ఉన్నవారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గృహ నిర్మాణ సంస్థ కమిషనర్ వి.పి.గౌతం విజ్ఞప్తి చేశారు. ఈ విక్రయాలతో వచ్చే ఆదాయంతో, ఓఆర్ఆర్ పరిసరాల్లోనూ, ఇతర జిల్లాల్లోనూ సాధారణ ప్రజలకు అందుబాటులో ఉండేలా హౌసింగ్ పథకాలను చేపట్టాలని నిర్ణయం చినట్లు తెలిపారు. వీటిని బహిరంగవేలం ద్వారా విక్రయించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రాజీవ్ స్వగృహకు సంబంధించినంత వరకు గాజుల రామారం, పోచారం, ఖమ్మం పోలేపల్లి ప్రాంతాల్లో అసంపూర్తిగా ఉన్న టవర్లలో (ఒక్కో దానిలో సుమారు 100 నుంచి 150 వరకు ఫ్లాట్లు ఉన్న టవర్‌ను యూనిట్‌గా) ఏక మొత్తంగా విక్రయించనున్నారు. బిల్డర్లు, ఒక గ్రూప్‌గా ఏర్పడి కొనుగోలు చేయాలనుకున్న వారితోపాటు, హౌసింగ్ కార్యక్రమాలు నిర్వహించే సంస్థలు, బహుళ అంతస్తుల భవనాల అవసరం ఉన్న సంస్థలు, వంటి వారు తీసుకు నేందుకు వీలు కల్పిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నారు. వేలం వేయనున్న వాటి వివరాలు రాజీవ్ స్వగృహకు చెందిన వాటి వివరాలు రంగారెడ్డి జిల్లా తొర్రూ రులో 514, కుర్మల్ గూడలో 20, చందానగర్‌లోని 3 ఓపెన్ ఫ్లాట్లు, బండ్ల గూడలో 159 పూర్తియిన ఫ్లాట్లు, మేడ్చల్ మల్కాజ్‌గిరి గాజుల రామారం లోని 5 టవర్లలోని పూర్తికాని కట్టడాలు, పోచారంలోని పూర్తి అయిన 601 ఫ్లాట్లు, అసంపూర్తిగా ఉన్న 6 టవర్లలోని వివిధ రకాల ఫ్లాట్లు, బహదూర్ పల్లిలోని 69 ఓపెన్‌ప్లాట్లు ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాలోని పోతుల మడుగులో 111, అమిస్తాపూర్‌లోని 45 ఓపెన్ ప్లాట్లను విక్రయించడానికి నోటిఫికేషన్ విడుదలచేయనున్నారు. ఖమ్మం జిల్లాలో పోలేపల్లిలో అసం పూర్తిగా ఉన్న 8 టవర్లతోపాటు, 3.38 ఎకరాల ఖాళీ స్థలాన్ని కూడా బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నారు. హౌసింగ్ బోర్డు స్థలాలు కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీ (కెపిహెచ్‌బి) 4వ ఫేజ్‌లో ఖాళీగా ఉన్న 7ఎకరాల 33 గుంటల విస్తీర్ణంలో ఖాళీ భూములను, అదే కాలనీలో ఉన్న రెండు ఓపెన్ ప్లాట్లను(4,598 చదరపు గజాల విస్తీర్ణం, 2,420 చదరపు గజాల స్థలం) ఈ ఆక్షన్ ద్వారా విక్రయించనున్నారు. అలాగే నాంపల్లిలోని 1,148 చదరపు అడుగుల విస్తీర్ణంలోని ఖాళీ స్థలాన్ని, సంజీవరెడ్డినగర్‌లో అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీహాల్‌కు చెందిన 2,605 చదరపు గజాలను బహిరంగ వేలం ద్వారా విక్రయించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సంజీవరెడ్డినగర్‌లోని కమ్యూనిటీహాల్ (సెల్లార్, స్టిల్ట్, జి+1) 22,285 చదరపు అడుగుల విస్తీర్ణంలో, 37,070 చదరపు అడుగుల పార్కింగ్ స్థలంతో పూర్తయ్యే స్థితిలో ఉన్నది. ఈ భూములను ఫంక్షన్ హాల్ నిర్వహణ కోసమే వేలం

## మొబైల్ ఛార్జింగ్ పెట్టి మాట్లాడుతుండగా షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు

యువకుడు సజీవదహనం



సాయి (ఫైల్)

హైదరాబాద్ (కొంపల్లి), జూన్ 7, ప్రభాతవార్త: సెల్‌ఫోన్ ఛార్జింగ్ పెట్టి మాట్లాడుతుండగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి యువకుడు సజీవదహనమయ్యాడు. ఈ సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం జరిగింది. జగద్గిరిగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. జగద్గిరిగుట్ట రింగు బస్తీలో నివసించే సాయి(27) తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్నాడు. శనివారం ఉదయం తల్లిదండ్రులు గుడికివెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చి చూసే సరికి గది అంతా పొగలతో నిండిపోయి ఉంది. వారి కుమారుడు సాయి శరీరం పూర్తిగా కాలిపోయి శవమై కనిపించాడు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకొని సాయి అక్కడికక్కడే చనిపోయాడు. జరుగుతోందని కేకలువేసి సాయి తల్లిదండ్రులు పిలవడంతో వారు వచ్చి చూడగా అప్పటికే సాయి చనిపోయాడు. పోలీసులకు సమాచారం అందించడంతో వారు హుటాహుటిన ఘటన స్థలానికివచ్చి గది అంతా కలియతిరిగి సాయి మృతదేహాన్ని పరిశీలించారు. సెల్‌ఫోన్ ఛార్జింగ్‌పెట్టి మాట్లాడుతున్న సమయంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ అయి మొబైల్‌ఫోన్ పేలి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని జగద్గిరిగుట్ట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఎస్సీ గురుకుల జూనియర్ కాలేజీల్లో చేరడానికి 15 వరకు అవకాశం

హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త: రాష్ట్రంలో ఎస్సీ గురుకుల సొసైటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న జూనియర్ కాలేజీల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరేందుకు గడువును పెంచారు. సీటు పొందిన విద్యార్థులు ఈ నెల 15 వరకు కాలేజీల్లో చేరడానికి అవకాశం కల్పించినట్లు గురుకుల సొసైటీ కార్యదర్శి డాక్టర్ విఎస్ అలుగు వర్షిని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వ ర్యంలో రాష్ట్రవ్యాప్తంగా వున్న 239 విద్యా సంస్థల్లో 2025–26 విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో విద్యార్థులు చేరేందుకు గడు వును ఈ నెల 15 వరకు పొడిగించినట్లు అలుగు వర్షిణి తెలిపారు. మొదటి మెరిట్ లిస్ట్‌లో ఉన్న విద్యార్థులకు శనివారం చివరితేదీగా ఉండగా.. ఇప్పుడు ఆ గడువును ఈ నెల 15 వరకు గడువు పెంచినట్లు తెలిపారు. గడువు తేదీలోగా వారికి కేటాయించిన కాలేజీల్లో చేరాలని గురుకుల సొసైటీ కార్యదర్శి అలుగు వర్షిణి సూచించారు.

## మేయర్ గద్వాల విజయలక్ష్మికి బెదిరింపు కాల్

పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు

హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త: జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మికి గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్లు చేసి వేధింపులకు పాల్పడుతూ బెదిరిస్తున్నారని శనివారం ఆమె బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనతో పాటు తండ్రి కే.కేశవరావును అంతుచూస్తామని అర్ధరాత్రి వేళల్లో కొన్ని రోజులుగా కాల్స్ వస్తున్నాయని పేర్కొన్నారు. అసభ్యకరంగా సంభాషిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. అయితే బోరబండలో జరిగిన ఘటన మేరకు ఆగంతకులు కాల్స్ చేస్తున్నారని భావిస్తున్నట్లు ఆమె పోలీసులకు వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సెల్ సిగ్నల్స్ ఆధారంగా ఫోన్ నెంబర్‌ను పరిశీలిస్తున్నామని పోలీసులు వెల్లడించారు.



## కొరియర్ కంపెనీల పేరిట సైబర్ నేరగాళ్ల కొత్తతరహా మోసాలు

అన్నివర్గాలు అప్రమత్తంగా ఉండాలి: టిజిసిఎస్‌బి

హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త: దేశ వ్యాప్తంగా సైబర్ నేరగాళ్లు కొరియర్ కంపెనీల పేర్లు వాడుతూ అమాయకులను మోసం చేస్తున్న ఘటనలు పెరిగాయని, ఈ తరహా నేరాల పట్ల అన్ని వర్గాల వారు అప్రమత్తంగా వుండాలని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) కోరింది. ఈ మేరకు టిజిఎస్‌బి డిజి శిఖా గోయల్ శనివారం నాడు ఒక ప్రకటన విడుదల చేశారు. సైబర్ నేరగాళ్లు ఒక పథకం ప్రకారం కొందరిని టార్గెట్ చేసి తమను తాము కొరియర్ క ంపెనీల ప్రతినిధులుగా చెప్పుకుంటారని, మీ ఇంటికి దగ్గరలోనే వున్నామని, లొకేషన్ షేర్ చేయమని కోరతారని ఆమె తెలిపారు. అనంతరం ఒక మాలిషస్ లిం క్పై క్లిక్ చేయమని లేదా 21 ఫోన్ నంబర్ వంటి ప్రత్యేక కోడ్ డయల్ చేయాలని కోరతారని, వీటిని ఎవరైనా నమ్మితే వారి సెల్‌ఫోన్‌లో కాల్ ఫార్వర్డింగ్ యాక్టివేట్ చేస్తారని, దీని తరువాత నేరగాళ్లు బాధితులకు వచ్చే కాల్స్‌ను హైజాక్ చేసి వెరిఫికేషన్ కోడ్లు అందుకుంటారని టిజిసిఎస్‌బి డిజి తెలిపారు. దీంతో పా టు వాట్సాప్ ఇతర కమ్యూనికేషన్స్ సేవలపైనా అదుపు సాధిస్తారని, దీని వల్ల ఫోన్లు బాధితులు తమకు తెలియకుండానే సెల్‌ఫోన్లలోని సమాచారాన్ని నేరగా ళ్లకు చేరినా గమనించే పరిస్థితి వుండదని ఆమె తెలిపారు. ఇదే సమయంలో బాధితులకు తెలియకుండా వారి పేరు చెప్పి ఇతరుల నుంచి డబ్బులు వసూలు చే స్తారని ఆమె తెలిపారు. వాట్సాప్ లేదా ఎస్ఎంఎస్ ద్వారా ఫేక్ డెలివరీ మెసేజ్‌లను ఎవరూ నమ్మవద్దని, కొరియర్ కంపెనీల పేరిట వచ్చే ఫోన్ కాల్స్‌ను గుడ్డి గా నమ్మవద్దని, ఒకవేళ పదిమార్లు సరిచూసుకున్న తరువాతే మాట్లాడాలని ఆమె సూచించారు. ఎవరైనా మోసపోతే వెంటనే 1930 లేదా టిజిసిఎస్‌బికి ఫిర్యాదు చేయాలని ఆమె కోరారు. మోసగాళ్ల కాల్స్‌ను సేవ్ చేసుకోవాలని ఆమె తెలిపారు.

## బిసిలు ఎదగడం సహించలేకే అగ్రవర్ణాల దాడులు

కాలుష్యరహిత పరిశ్రమ ఇథనాల్: ఆర్.కృష్ణయ్య

హైదరాబాద్ (ప్రభాత్), జూన్ 7, ప్రభాతవార్త: బిసిలు, పేద కులాలు ఆర్థికంగా, పారిశ్రామికవేత్తలుగా ఎదుగుతుంటే చూసి ఓర్వలేక అగ్రవర్ణ కులాలు అడ్డుపడుతున్నాయని, కుట్రలు చేస్తున్నాయని రాజ్యసభసభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆరోపించారు. గద్వాల్ జిల్లా రాజోలి మండలం ధనవాడ సమీపంలో ఉన్న బయోఫ్యూల్ ఇథనాల్ పరిశ్రమపై కొంతమంది నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, ఈ పరిశ్రమ వల్ల ప్రమాదం వస్తుందని రైతులను, ప్రజలను ఉసిగొల్పి ఆరోపణలు చేయిస్తున్నారని ఆయన విమర్శించారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు నీల వెంకటేష్, భూపేష్‌సాగర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ రాజకీయ ప్రయోజనాల కోసం నాయకులు ప్రజలను, రైతులను రెచ్చగొట్టే పరిశ్రమపై దాడులు చేయించి తమ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ పరిశ్రమతో ఎలాంటి సమస్యలు లేవని కాలుష్యం లేదని, కేంద్ర ప్రభుత్వం కాలుష్య రహిత బయోఫ్యూల్ పరిశ్రమలకు సబ్సిడీలు ఇచ్చి ప్రోత్సహిస్తున్నదని ఆర్.కృష్ణయ్య వివరించారు. సమావేశంలో బిసి నేతలు సి.రాజేందర్, అనంతయ్య, చంద్రశేఖర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం ప్రాజెక్టు తప్పు ఇంజినీర్లదే



శనివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న పార్టీ ఎంపి విశ్వేశ్వర్‌రెడ్డి

ఎంపి ఈటల కెసిఆర్‌ను ప్రొటెక్ట్ చేశారనేది వందశాతం తప్పు

డిజైనింగ్ చర్చలతో ఈటల, హరీశ్‌లు పాల్గొనలేదు

చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలోపాలకు తప్పు ఇంజినీర్లదేనని చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కెసిఆర్ హయాంలో ఇంజనీర్లు కెసిఆర్ తాన అంటే తందాన అన్నారని అన్నారు. ఎంపి ఈటల రాజేందర్ మాజీ సిఎం కెసిఆర్‌ను ప్రొటెక్ట్ చేశారనే వాదన వంద శాతం తప్పని కుండ బద్దలు కొట్టారు. డిజైనింగ్ చర్చలో ఈటల, హరీశ్‌రావు పాల్గొనలేదని అన్నారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించ తలపెట్టిన ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు ఒక అసాధ్యమైందని, దాంతో చేవెళ్ల ప్రాంతానికి చుక్క నీరు కూడా రావని అన్నారు. కాంగ్రెస్ నాయకులు కేవలం మాయమాటలు చెప్పారని అన్నారు. దానిని కెసిఆర్ రద్దు చేశారని భావిస్తే ఆయన అంబేద్కర్ పేరు తొలగించి కాళేశ్వరం పేరు పెట్టారని చెప్పారు. ఈ రెండింటిలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన డిజైన్ బాగుందని, కెసిఆర్ డిజైన్ బాగా లేదని అన్నారు. కాళేశ్వరం డిజైనింగ్ చర్చలో హరీష్ రావు, ఈటల లేరని అన్నారు. ఆ టోటల్ ఎపిసోడ్‌లో ఈటలది చిన్న పాత్ర మాత్రమేనని చెప్పారు. ఇంత పెద్ద అవినీతి జరిగినా ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదో చెప్పాలన్నారు. ఈటల విచారణలో ఏం చెప్పారో తనకు తెలియదని, అయితే ఇందులో ఆయన పాత్ర జీరో అని అన్నారు. ఈటల రాజేందర్ కెసిఆర్‌ను ప్రొటెక్టుచేశారనడం వంద శాతం తప్పని అన్నారు. తాను ఈటలకు సపోర్ట్ చేసేందుకు మీడియా ముందుకు రాలేదని, నిజాలు చెప్పేందుకు వచ్చానని అన్నారు. గులాబీ జెండా అందరిది అన్న ఈటలను తన్ని వెళ్లగొట్టారని, అలాంటి కెసిఆర్‌ను ఈటల ఎందుకు ప్రొటెక్ట్ చేస్తారని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వస్తే ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టును పూర్తిచేసి, నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తామని కాంగ్రెస్ నేతలు ఎన్నికల సమయంలో గొప్పలు చెప్పారని అన్నారు. అయితే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా చేవెళ్లకు ఒక్క చుక్క నీరు కూడా రాలేదని ఆయన ఆరోపించారు. మాయమాటలు చెప్పి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు.

## బిజెపిలో బిఆర్ఎస్ విలీనానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి!

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త: బిజెపిలో బిఆర్ఎస్ విలీనానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. రెండు పార్టీల బంధ బలోపేతానికి ఈటల వ్యాఖ్యలే నిదర్శనమన్నారు. సిఎల్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈటల, హరీశ్ సమావేశం దేనికి సంకేతమని ప్రశ్నించారు. బిఆర్ఎస్‌కు కాళేశ్వరం ఏటిఎంగా మారిందని బిజెపి నేతలు గతంలో చెప్పారని, ప్రధాని మోదీ, అమిత్ షా వ్యాఖ్యలను ఈటల రాజేందర్ వ్యతిరేకిస్తున్నారా అని ప్రశ్నించారు. కాళేశ్వరంలో జరిగిన అవినీతిపై గతంలో చేసిన వ్యాఖ్యలపై బిజెపి ఇప్పుడు ఎందుకు యూటర్న్‌తీసుకుంది? అని ప్రశ్నించారు ఎమ్మెల్సీ కవిత చెప్పినట్లు కాపాయాల్లో బిఆర్ఎస్ విలీనం జరుగుతుందా? ఈ రెండు పార్టీలు కలిసి కాంగ్రెస్‌ను దొంగ దెబ్బ తీసే కుట్ర చేశాయని ఎన్నో సార్లు చెప్పామన్నారు. మాజీ సిఎం కెసిఆర్‌ను కాపాడేందుకు బిజెపి ప్రయత్నిస్తుందని అన్నారు. ఈటల, హరీశ్ రావు రహస్య భేటీ నిజమే అన్నారు. వీరిద్దరి సమావేశం దేనికి సంకేతమో ఆలోచించాలి. కాళేశ్వరం నిర్మాణం అంతా కెసిఆర్ ఇష్టానుసారమే జరిగిందని ఈటల గతంలో అన్నారు. కెసిఆర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు మంత్రివర్గం నిర్ణయం ప్రకారమే నిర్మించారని ఎందుకు అంటున్నారు. కాళేశ్వరం అంచనాను రూ.30 వేల కోట్ల నుంచి రూ.లక్ష కోట్లకు ఎందుకు పెంచారు? ఇందులో అవినీతి నుంచి కెసిఆర్ కుటుంబాన్ని బయటపడేసే ప్రయత్నం బిజెపి చేస్తుందని అన్నారు.



విశ్వంభర అనువాద పుస్తకాలను ఆవిష్కరిస్తున్న జస్టిస్ జి.రాధారాణి, నిరంజన్‌రెడ్డి, గంగ, చెన్నయ్య, మోహన్ తదితరులు

## సహజ కవివరేణ్యుడు డా. సి.నారాయణరెడ్డి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.రాధారాణి

వైభవంగా సాహిత్యం, జ్ఞాపకాలు, అనువాదాలతో సినారె సాహిత్యోత్సవం

హైదరాబాద్ (నాంపల్లి), జూన్ 7, ప్రభాతవార్త: జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, డా. సింగిరెడ్డి నారాయణరెడ్డి (సినారె) బీఏ వరకు ఉర్దూలో చదువుకుని తెలుగులో ప్రపంచ ప్రఖ్యాత వహించే స్థానానికి చేరుకోవడానికి ప్రధాన కారణం ఆయనలోని సహజ కవిత్వ లక్షణమేనని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.రాధారాణి అన్నారు. శ్రీమతి సుశీల నారాయణరెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో హైదరాబాద్ కోఠిలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం దర్బార్‌హాల్లో శనివారం ఉదయం నుండి రాత్రి వరకు రోజంతా వైభవంగా సాహిత్యం, జ్ఞాపకాలు, అనువాదాలతో సాగిన సినారె సాహిత్యోత్సవం ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సినారె అగ్రగణ్య కవిగా కావ్యాలు రచిస్తూనే, చలనచిత్ర కళాకారులను అలరించేలా సినీగీతాలు రచించారని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సరస్వతీపుత్రుడు ఎవరైనా సినారెను మెచ్చిన సినారె, కానీ డా. సినారె ప్రతీ అక్షరాన్ని మన్ననలు, ప్రశంసలు పొందారని విశదీకరించారు. ఈ సందర్భంగా జస్టిస్ జి.రాధారాణి నిరంజన్‌రెడ్డి, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు డా. సూర్యధనుంజయ్, ట్రస్టు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సి.గంగ, డా. జుర్రు చెన్నయ్య, ఎన్‌టిటి దక్షిణ ప్రాంతీయ అధికారి డా. పత్తిపాక మోహన్ తదితరులతో కలిసి విశ్వంభర పంజాబీ, మలయాళం అనువాదాలు, ప్రపంచపదులు తమిళ అనువాద పుస్తకాలను ఆవిష్కరించి అనువాదకులను ఘనంగా సత్కరించారు. ట్రస్టు ప్రధాన కార్యదర్శి చెన్నయ్య మాట్లాడుతూ సినారె సాహిత్యోత్సవాన్ని మొదటిసారిగా హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించామని, జన్మదినం ప్రతీ సంవత్సరం జూన్‌లో సినారె జన్మస్థలం హన్మాజీపేటలో నిర్వహిస్తామని తెలిపారు. సమావేశాన్ని ఉదయం నుండి మధ్యాహ్నం వరకు ఆచార్య సి.మృణాళిని అధ్యక్షతన డా. సినారె సాహిత్య సమాలోచనలో డా. నందిని సిధారెడ్డి, డా. రెంటాల జయదేవ, ఆచార్య టి.గౌరీశంకర్, ఆచార్య శిఖామణి; ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన డా. సినారె లఘుచిత్ర ప్రదర్శన–నిర్మాణం... తెలుగు విశ్వవిద్యాలయం జ్ఞాపకాలపై ప్రముఖ వక్తలు ఆచార్య పొర్యాయి సుమతీ నరేంద్ర, డా. చింతపల్లి వసుంధరారెడ్డి, డి.ఎ.మిత్ర, కొట్ల వెంకటేశ్వరరెడ్డి, విజయసారథి విద్యాధరు తదితరులు ప్రసంగించగా; సాయంత్రం డా. నలిమెల భాస్కర్ అధ్యక్షతన సినారె అనువాదకుల కవితా పఠనంలో హిందీ, తమిళ, పంజాబీ, మలయాళ, కన్నడ అనువాదాలను ఆయా భాషల అనువాదకులు పఠించారు.

## గోవాలో టి.నాబ్ భారీ ఆపరేషన్.. నాలుగు డ్రగ్స్ ముఠాల అరెస్టు

హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త: తెలంగాణ యాంటి నార్కోటిక్ బ్యూరో (టి.నాబ్) గోవాలో భారీ ఆపరేషన్ నిర్వహించింది. ఈ సందర్భంగా తెలంగాణ లో డ్రగ్స్ అమ్మకాలు సాగిస్తున్న నాలుగు ముఠాలను పట్టుకుంది. పలు రకాల డ్రగ్స్‌తో పాటు కల్తీ కల్లు తయారీకి వాడే ఆల్ఫ్రాజోలంను ఈ ముఠాలు విక్రయి స్తున్నట్లు తేలింది. ఈ సందర్భంగా 12 మంది స్మగ్లర్లతో పాటు సుమారు కోటిన్నర రూపాయల విలువచేసే పలు రకాల డ్రగ్స్‌ను, ఆల్ప్రాజోలంను జప్తు చేసినట్లు సమాచారం. వీరితో లింకులున్న హైదరాబాద్ వాసులపై ఆరా తీస్తున్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఒకటి రెండు రోజుల్లో టి.నాబ్ వెల్లడించే వీలు ఉంది.

## మావోయిస్టుల మరణాలపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలి


బీజాపూర్ పోలీస్ కస్టడీలో ఉన్న నాయకుల్ని కోర్టులో హాజరుపర్చాలి: వామపక్ష పార్టీల డిమాండ్

హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త: చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ పోలీస్ కస్టడీలోని మావోయిస్టు నాయకుల్ని కోర్టులో హాజరు పర్చాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. మావోయిస్టుల మరణాలపై సుప్రీం కోర్టు న్యాయమూర్తితో విచారణ చేపట్టాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని వామపక్ష పార్టీల నేతలు శనివారం సిపిఐ రాష్ట్ర కార్యాలయమైన మఖ్దూం భవన్‌లో సమావేశమయ్యాయి. సమావేశానికి సిపిఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ అధ్యక్షత వహించారు. సమావేశంలో సిపిఎం నుండి అబ్బాస్, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నుండి వేములపల్లి వెంకట్రామయ్య, కె గోవర్ధన్, యుసిసిఐ(యు) నుండి వనం సుధాకర్, ఎస్‌యుసిఐ(సి) నుండి తేజ, ఆర్ఎస్‌పి నుండి జానకి రాములు పాల్గొన్నారు. చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో కొనసాగుతున్న మావోయిస్టు అగ్రనాయకుల హత్యలు అత్యంత అమానుషంగా కొనసాగుతున్నాయని వామపక్ష పార్టీల నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. బీజాపూర్ పోలీస్ కస్టడీలోని మావోయిస్టు నాయకుల్ని ఒక్కొక్కరిని కాల్చిచంపి.. ఎన్‌కౌంటర్‌గా ప్రకటిస్తున్నారని మండిపడ్డారు. 2004 నాటి శాంతి చర్చల ప్రతినిధి సుధాకర్‌తోపాటు, సురేష్‌తోపాటు ఐదుగురి మరణం అనేక ప్రశ్నల్ని లేవనెత్తుతుందని అన్నారు. అంతేకాకుండా 10, 20 మంది నాయకులు ఇంకా వాళ్ళ కస్టడీలో ఉన్నట్లు.. వారందరినీ కూడా ఇదే రీతిలో కాల్చిచంపి ఎన్‌కౌంటర్ మరణాలుగా ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నాయని. ఈ నేపథ్యంలో బీజాపూర్ పోలీస్ కస్టడీలో ఉన్న వారందర్ని వెంటనే కోర్టుకు అప్పగించాలని వామపక్ష పార్టీల నేతలు డిమాండ్ చేశారు. సుధాకర్, సురేష్ హత్యలపై సుప్రీం కోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్‌ను తక్షణం నిలిపి వేసి, మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలను ప్రారంభించాలని వామపక్ష పార్టీల నేతలు డిమాండ్ చేశారు.

# శాంతిభద్రతల పరిరక్షణలో తెలంగాణది ప్రథమ స్థానం

పోలీస్ కంప్లైట్ అథారిటీ మెంబర్ వర్రె వెంకటేశ్వర్లుయాదవ్

హైదరాబాద్ (చిక్కడపల్లి), జూన్ 7, ప్రభాతవార్త: శాంతిభద్రతల పరిరక్షణ, టెక్నికల్ విషయంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం నెంబర్ వన్ స్థానంలో ఉందని తెలంగాణ పోలీస్ కంప్లైట్ అథారిటీ మెంబర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు యాదవ్ అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో యాదవ్ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో వర్రె వెంకటేశ్వర్లు యాదవ్ తెలంగాణ పోలీస్ కంప్లైట్ అథారిటీ సభ్యులుగా నియమితులైనందున సన్మానసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల వారు ఇక్కడ జరిగే శాంతిభద్రతలను పరిశీలించి అక్కడ అమలు చేస్తున్నారని అన్నారు. శాంతిభద్రతలను కాపాడటంలో తన వంతు పాత్రను పోషిస్తానన్నారు. యాదవ్ విద్యావంతుల వేదిక అధ్యక్షుడు చెలకాని వెంకట్ యాదవ్ మాట్లాడుతూ విద్య, ఉద్యోగ, ఆర్థిక రాజకీయ రంగాల్లో జనాభా దమాషా ప్రకారం తమ హక్కులను సాధించు కోవాలన్నారు. యాదవ్‌లకు జనాభా దమాషా ప్రకారం తగిన అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమం లో పాలమూరు యూనివర్సిటీ విసి జీవన్ శ్రీనివాస్ యాదవ్, అఖిల భారత మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్ర నాథ్ యాదవ్, యాదవ మహాసభజాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్. లక్ష్మణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



పోలీస్ కంప్లైట్ అథారిటీ మెంబర్ వర్రె వెంకటేశ్వర్లును సత్కరిస్తున్న యాదవ్ విద్యావంతుల వేదిక అధ్యక్షుడు చెలకాని వెంకట్‌యాదవ్, చిత్రంలో పాలమూరు వర్సిటీ విసి జీవన్ శ్రీనివాస్‌యాదవ్

## సిఎంకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ లేఖ

### గౌలిదొడ్డి, అలుగునూరు కాలేజీల్లో ఇంటర్ ఫస్టియర్‌కు 95 శాతం మార్కుల నిబంధనను తొలగించాలి

హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త: ఎస్సీ గురుకుల సొసైటీ అధ్వర్యంలో కొనసాగుతున్న గౌలిదొడ్డి, అలుగునూరు జూనియర్ కాలేజీల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో 95శాతం మార్కుల నిబంధనను తొలగించాలని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. గతంలో ఉన్న మాదిరిగానే ద్వితీయ సంవత్సరాన్ని కొనసాగించాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జాన్‌వెస్లీ శనివారం లేఖ రాశారు. ఎస్సీ గురుకులాల్లోనే ప్రతిష్టాత్మకమైనవిగా కొనసాగుతున్న గౌలిదొడ్డి, అలుగునూరు గురుకుల కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు 2024 ఫిబ్రవరి 4, ఫిబ్రవరి 25న జరిగిన గురుకుల సీఓఈ ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారు. దాన్ని పరిగణలోకి తీసుకోకుండా ఐపీఈ 2025 మార్చిలో జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షల్లో 95 శాతం మార్కులు వస్తేనే ఈ కళాశాలల్లో ద్వితీయ సంవత్సరంలో కొనసాగిస్తామని, లేకుంటే వేరే చోటకు తరలిస్తామని చెప్పడం సరైంది కాదని లేఖలో పేర్కొన్నారు. విద్యార్థులు కళాశాలల్లో చేరే సమయంలో ఈ నిబంధన లేదని.. ప్రస్తుతం కళాశాలకు వస్తున్న ద్వితీయ సంవత్సరం విద్యార్థులను భోజనాలు పెట్టకుండా తిరిగి పంపుతున్నారని.. ఇప్పటికే కొంతమంది బైపీసీ విద్యార్థులను ఏ సౌకర్యాలు లేని చోటకు తరలించారని జాన్‌వెస్లీ సిఎంకి రాసిన లేఖలో పేర్కొన్నారు. గురుకుల సొసైటీ సెక్రటరీ తీసుకున్న ఈ నిర్ణయంతో ప్రభుత్వ ప్రోత్సాహంతో చదువుతున్న దళిత, మైనారిటీ, వెనకబడిన విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతారని వెస్లీ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులంతా 10వ తరగతిలో 10జీపీఏ సాధించినవారేనని.. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం మార్కుల వల్ల పెద్ద ఉపయోగం లేకపోవడంతో డాక్టర్, ఇంజనీర్లు కావాలనే లక్ష్యంతో నీట్, ఐఐటీ సాధించడంపైనే దృష్టి పెడతారని అన్నారు. యాజమాన్యంతో పాటు, అధ్యాపకులు కూడా ఇంటర్ మార్కులపై దృష్టి సారించకుండా నీట్, ఐఐటీ లక్ష్యంతోనే బోధిస్తారని కాబట్టి సిఇఓ పరీక్ష ద్వారా రెండు విడతలుగా (ప్రిలిమినరీ, మెయిన్స్ ఎగ్జామ్స్)లో ఉత్తీర్ణులై అడ్మిషన్లు పొందిన ఈ విద్యార్థులకు ఇంటర్ మొదటి సంవత్సరం మార్కులతో ముడిపెట్టి ద్వితీయ సంవత్సరం చదువనీయకుండా చేయడం పై పునరాలోచించాలని కోరారు. ఈ నిర్ణయంతో విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చలు జరపడంతోపాటు, గతంలో ఉన్న మాదిరిగానే ఆయా కాలేజీల్లో విద్యాభ్యాసాన్ని కొనసాగించాలని ముఖ్యమంత్రికి రాసిన లేఖలో జాన్‌వెస్లీ విజ్ఞప్తి చేశారు.

## అక్కడక్కడా చెదురుమదురు వర్షాలు

హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త: పశ్చిమ గాలుల ద్రోణి, ఉపరితల ఆవర్తన ప్రభావంతో తెలంగాణలో అక్కడక్కడా చెదురుమదురు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. 83 తూర్పు రేఖాంశం, 20 ఉత్తర అక్షాంశం వద్ద సగటు సముద్ర మట్టానికి 5.8 కి.మీ ఎత్తులో ఉన్న ద్రోణి కారణంగా వాతావరణంలో మార్పులు ఏర్పడుతున్నాయని తెలిపింది. దక్షిణ మధ్య మహారాష్ట్ర నుంచి కోస్తా ఆంధ్రప్రదేశ్ వరకు సగటు సముద్ర మట్టానికి 1.5 కి.మీ ఎత్తులో ద్రోణి కొనసాగుతోంది. దక్షిణ ఛత్తీస్‌గఢ్ నుంచి ఈశాన్య బంగ్లాదేశ్ వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ ఎత్తులో బలహీనపడిన ద్రోణి ఉంది. మరోవైపు వీస్తున్న పశ్చిమ, వాయువ్య దిశల గాలుల కారణంగా రాష్ట్రంలో వర్షాలకు అనుకూల పరిస్థితులు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలోని కొన్ని జిల్లాలలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.. గంటకు 30 నుండి 40 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే ఛాన్స్ ఉందన్నారు. తేలికపాటి వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

# తిరుమల లడ్డూ పేరుతో ఆన్‌లైన్ వ్యాపారం

**నాలుగు సంస్థలకు టిటిడి నోటీసులు.. 2009లోనే టిటిడి లడ్డూ పేటెంట్**



**తిరుమల, జూన్ 7ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం తరువాత అంతే పవిత్రత ఉన్న లడ్డూప్రసాదాన్ని దేశంలో మరెవరూ తయారుచేయకుండా 2009 సంవత్సరం లోనే టిటిడి పేటెంట్(హక్కు)ను పొందింది. అయితే ఇటీవల కొందరు ప్రైవేట్ వ్యాపారులు, స్వీట్లు తయారీ సంస్థలు ఆన్‌లైన్ వ్యాపారం పేరుతో ఈ కామర్స్ లో తిరుమల లడ్డూపేరుతో అనధికారికంగా వినియోగించుకుంటున్న అంశాన్ని టిటిడిగుర్తించింది. వారిపై కఠిన చర్యలకు సిద్ధమైంది. ఫుష్‌మైకార్ట్ ఈ కామర్స్ సంస్థ సహా మరో నాలుగుసంస్థలు (ట్రాన్సాక్ట్‌ఫుడ్స్, ఇండియా స్వీట్స్ హౌస్ వంటిసంస్థలకు టిటిడి నోటీసులు పంపింది. ఆన్‌లైన్‌లో లడ్డూఫోటోలను తొలగించకపోతే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని టిటిడి పేర్కొంది. తిరుమల లడ్డూబ్రాండ్‌కు సంబంధించిన ఆన్‌లైన్ వాడుకపై కఠిన చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించింది. అయితే కొన్నిగంటల్లోనే పుష్‌మైకార్ట్ వెంటనే స్పందించి లడ్డూప్రసాదం పేరును తొలగించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తిరుమల శ్రీవారి భక్తులు అత్యంత పవిత్రంగా లడ్డూప్రసాదాన్ని భావిస్తారు. జియోగ్రాఫికల్ ఇండికేషన్ (జిఐ) హక్కులను ఉల్లంఘిస్తూ స్వామి లడ్డుపేరుతో తమ ఉత్పత్తులను విక్రయిస్తున్న ,ప్రచారం చేసినా నేరంగా పరిగణించింది. ఈ లడ్డూప్రసాదాలపై టిటిడి అధికారులు అప్రమత్తమయ్యారు. టిటిడి ఇఒ శ్యామలరావు ఆదేశాలతో టిటిడి న్యాయవిభాగం అధికారులు ఢిల్లీకి చెందిన సహదేవ లా ఛాంబర్స్‌ద్వారా నోటీసులు జారీ చేయడంతో వెలుగుచూసింది.



విద్యుత్ దీపాల అలంకరణలో వెలిగిపోతున్న రైల్వేస్టేషన్

# విద్యుత్ దీపాలంకరణలో కాచిగూడ రైల్వేస్టేషన్

**గుంతకల్లు రైల్వే, జూన్ 7, ప్రభాతవార్త:** దక్షిణాది నుంచి ఉత్తరాదికి వెళ్లే ప్రధాన రైలు మార్గంలో భాగ్యనగరానికి సింహద్వారం అయిన హైదరాబాద్ రైల్వే డివిజన్‌లోని కాచిగూడ రైల్వేస్టేషన్ ముఖద్వారం రంగురంగుల విద్యుత్ దీపాలంకరణలతో చూపరులను విశేషంగా ఆకర్షిస్తూ కొత్త శోభను సంతరించుకుంది. దక్షిణమధ్యరైల్వేలో ప్రయాణికులకు, వినియోగదారులకు కాచిగూడ రైల్వేస్టేషన్ సేవలందిస్తున్నది. హైదరాబాద్ జంటనగరాల్లోని ప్రధాన టెర్మినల్స్‌లో ఒకటైన కాచిగూడ రైల్వే స్టేషన్‌లో 5ప్లాట్ ఫారమ్‌లతో ప్రయాణికుల సౌకర్యార్థం ఆధునిక సౌకర్యాలు కలిగి ప్రతిరోజు సగటున 103రైళ్లు, దాదాపుగా 45వేల మంది ప్రయాణికులకు సేవలను అందిస్తోంది. శతాధిక సంవత్సరాలకు పైగా లక్షలాది మంది రైలు ప్రయాణికులకు, వినియోగదారులకు మెరుగైన సేవలు అందిసూ ౖ ఔత్సాహికులైన పర్యాటకులను విశేషంగా ఆకర్షించే విధంగా కాచిగూడ రైల్వే స్టేషన్ ముఖద్వారం రంగురంగుల విద్యుత్ దీపాలంకరణ ప్రాజెక్టును తాజాగా రూ.2.23కోట్ల వ్యయంతో చేపట్టి ప్రకాశవంతం చేయాలనే ప్రతిపాదనను పర్యాటక మంత్రిత్వ శాఖ ఆమోదించగా సదరుపనిని దక్షిణ మద్య రైల్వే హైదరాబాద్ డివిజన్ విద్యుత్ నిర్వహణ విభాగం ఈ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా తీసుకుని పూర్తి చేసింది. అతి సుందరమైన కాచిగూడ రైల్వేస్టేషన్ నిర్మాణ సౌందర్యాన్ని మరింతగా ఇండో-సార్సెనిక్/ ఇండోగోతిక్ నిర్మాణ శైలిని, దాని గొప్ప వారసత్వాన్ని సరైన ప్రకాశంతో హైలెట్ చేయడం ప్రధాన లక్ష్యంతో ఈ అలంకరణలో వివిధ రంగుల నేపధ్యాలను ఉపయోగించి దీపాలను అలంకరించడం వలన స్థానిక/ జాతీయ/ అంతర్జాతీ యంగా జరిగే కార్యక్రమాల్లో మరింత ఉత్సాహం కలిగించేలా, ఔత్సాహిక ప్రయాణికులకు,ప్రజలకు, పర్యాటకులకు రాత్రి వేళల్లో దృశ్యమానమైన వాతవరణాన్ని కలిగిస్తుంది. ఈ ప్రాజెక్టును 9న జరిగే కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి.

# 20న అన్నదాతా సుఖీభవ - పిఎం కిసాన్!

**విజయవాడ జూన్ 7ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో అన్నదాతా సుఖీభవ -పీఎం కిసాన్ పథకంఅమలుకు రంగం సిద్ధమైంది. ఈ పథకానికి సంబంధించి 45.71 లక్షల రైతు కుటుంబాల అర్హులుగా గుర్తించారు. వీరికి ఏడాదికి రూ.20 వేల చొప్పున మూడు విడతల్లో లబ్ది చేకూరనుంది.పీఎం కిసాన్ కింద ఈ నెల 20న ఒక్కో రైతు కుటుంబానికి రూ.2 వేల చొప్పున విడుదల చేసే అవకాశం ఉందని రాష్ట్రానికి సమాచారం అందింది. అదేరోజు రాష్ట్రప్రభుత్వం కూడా రూ.5 వేల చొప్పున జమ చేయనుంది. అంటే తొలి విడతలో రైతులకు రూ.7వేలు అందుతాయి. నిధుల విడుదల తేదీలో కేంద్రం మార్పు చేస్తే రాష్ట్రం కూడా అందుకు అనుగుణంగానే ఇస్తుంది. రెండోవిడతగా అక్టోబరులో రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు కేంద్రం రూ.2 వేలు మూడో విడతగా వచ్చే ఏడాది జనవరిలో రాష్ట్రం రూ.4 వేలు, కేంద్రం రూ.2 వేలు కలిపి రూ.6 వేలు పంపిణీచేస్తాయి. కమతాల వారీగా చూస్తే రాష్ట్రంలో 93 లక్షల మంది రైతులు ఉన్నారు. వీరిలో ప్రజాప్రతినిధులు ఆదాయ పన్ను చెల్లించేవారు, వ్యవసాయేతర అవసరాలకు భూములను వినియోగించేవారు తదితర విభాగాల వారిని మినహాయించారు. మొత్తం 79 లక్షల మంది రైతులు అన్నదాతా సుఖీభవ పరిధిలోకి వస్తారని రైతు సేవాకేంద్రాల పరిశీలనలో తేలింది. కుటుంబ యూనిట్‌గా ఈపథకాన్ని అమలు చేయనున్నారు. ఆరెంచల వడపోత తరువాత 45.71 లక్షల కుటుంబాలను అన్నదాతా సుఖీభవకు అర్హులుగా తేల్చారు. ఈకేవైసీ పూర్తిచేసిన రైతుల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ కానున్నాయి. అటవీ భూముల పట్టాలు పొందిన రైతులకు కూడా సాయం అందజేస్తారు. కౌలు రైతులకు కూడా అన్నదాత సుఖీభవ వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. వీరికి కౌలు రైతు గుర్తింపు కార్డులు ఇవ్వలేదు. పంటకాలం మొదలయ్యాక వారిని గుర్తించి జాబితాలు తయారు చేస్తారు. తరువాత వారికి అన్నదాతా సుఖీభవ కింద రాష్ట్ర ప్రభుత్వమే రూ.20 వేలు చొప్పున ఇవ్వనుంది.

# టీచర్లు లేరు.. పిల్లలెలా చేరుతారు?

**పాఠశాల నుంచి వర్సిటీ వరకు ఖాళీగా అధ్యాపక పోస్టులు**

**వేల సంఖ్యలో ఖాళీలున్నా భర్తీ అంతంతమాత్రం**

**వర్సిటీల్లోనూ సగానికిపైగా పోస్టులు ఖాళీయే**

**హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యా సంస్థల్లో పాఠాలు బోధించాల్సిన అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పాఠశాల స్థాయి నుంచి యూనివర్సిటీ స్థాయి వరకు టీచర్, లెక్చరర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల వరకు ఖాళీలు ఉన్నాయి. పాఠాలు బోధించాల్సిన అధ్యా పక పోస్టులు ఖాళీగా ఉండటంతో.. బోధించే వారు లేకపోవడంతో ప్రభుత్వ విద్యా సంస్థలకు విద్యార్థులు రావడం మానేస్తూ.. ప్రైవేటు విద్యా సంస్థల వైపు వెళుతున్నారు. బోధించే అధ్యాపకులు లేకపోవడంతో గత కొన్ని సంవత్సరాలుగా పాఠశాల స్థాయి నుంచి యూనివర్సిటీల వరకు ప్రభుత్వ విద్యా సంస్థల్లో చేరుతున్న విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గుతూ వస్తోంది. గత రెండేళ్లుగా ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీలను కొత్తగా మంజూరు చేయగా.. వాటిలో బోధన, బోధనేతర సిబ్బందిని మంజూరు చేయలేదు. వాటితోపాటు కొత్తగా ఏర్పాటు చేసిన రెండు ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీలకు సైతం టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను మంజూరు చేయలేదు. జూనియర్, డిగ్రీ కాలేజీలతోపాటు ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీల్లో పోస్టులను మంజూరు చేయాలని కోరుతూ విద్యా శాఖ అధికారులు ప్రభుత్వానికి లేఖ రాశారు. ఇప్పటి వరకు వాటిలో పోస్టులను మంజూరు చేస్తున్నట్టు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ కాలేదు. ఇప్పటికే రాష్ట్రం లోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీలు ఈ నెల 2 నుంచి ప్రారంభమైన విషయం తెలిసిందే.

**పాఠశాలల్లో 15వేల టీచర్ పోస్టులు ఖాళీ..**

రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో సుమారు 15వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నా యి. వాటిలో సుమారు 4 వేల వరకు పదోన్నతుల ద్వారా భర్తీచేసే పోస్టులు ఉండగా.. మిగిలిన 11వేల వరకు డైరక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా చేపట్టాల్సిన టీచర్ పోస్టులున్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలు సుమారు 30వేల వరకు ఉన్నాయి.

వాటిలో 1.20 లక్షల ఉపాధ్యాయ పోస్టులు మంజూరు కాగా వాటిలో ప్రస్తుతం 1.08 లక్షల మంది పనిచేస్తున్నారు. అదికూడా గత ఏడాది సుమారు 10వేల టీచర్ పోస్టులను డిఎస్‌సి ద్వారా భర్తీ చేయడం మూలంగా. అయినప్పటికీ ఇంకా సుమారు 11వేలకి పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గత పదేళ్ల కాలంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేరుతున్న విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గుతూ వస్తోంది. 2014లో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 34 లక్షలు ఉండగా.. అదికాస్త 2024-25 విద్యా సంవత్సరానికి 23 లక్షలకి పడిపోయింది.

**ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో..**

రాష్ట్రంలో 430 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు కొనసాగుతున్నాయి. వాటిలో 6,008 అధ్యాపక పోస్టులు మంజూర య్యాయి. ప్రస్తుతం వాటిలో 5,234 మందే రెగ్యులర్ జూనియర్ లెక్చరర్లు కొనసాగుతున్నారు. వీకిలొ సుమారు 3500 మంది వరకు 2023లో కాంట్రాక్ట్ లెక్చరర్ల నుంచి రెగ్యులర్ అయిన వారు ఉన్నారు.

కాగా 1092 మంది జూనియర్ లెక్చరర్లను ఈ ఏడాది ఏప్రిల్‌లో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నియమించారు. దీంతో ప్రస్తుతం సుమారు 5234 మంది రెగ్యులర్ జూనియర్ లెక్చరర్లు కొనసాగుతున్నారు. వారు కాకుండా మరో 774 జేఎల్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటి స్థానంలో కొందరు కాంట్రాక్ట్ విధానంలో, మరికొందరిని గెస్ట్ లెక్చరర్లుగా కొనసాగిస్తున్నారు. 2014 నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చేరుతున్న విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. 2014లో సుమారు 1.20 లక్షల మంది చేరితే అదికాస్త 2024-25 నాటికి 80 వేలకి పడిపోయింది.

**ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో..**

రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో 60 శాతం వరకు లెక్చరర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రంలో 149 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు కొనసాగుతున్నాయి. వాటిలో ప్రభుత్వం 4115 మంది డిగ్రీ లెక్చరర్ల పోస్టులను మంజూరు చేసింది. ప్రస్తుతం సుమారు 1531 మంది రెగ్యులర్ లెక్చరర్లు కొనసాగుతున్నారు. వారిలో కూడా సుమారు 450 మంది 2023లో కాంట్రాక్ట్ లెక్చరర్ల నుంచి రెగ్యులరైజ్ అయిన వారు ఉన్నారు. వారు కాకుండా 2584 డిఎల్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఖాళీల స్థానంలో 1940 మంది గెస్ట్ లెక్చరర్లు కొనసా గుతుండగా.. మరో 459 మంది కాంట్రాక్ట్ లెక్టరర్లు కొనసాగుతున్నారు. రాష్ట్రంలో కొత్తగా ప్రారంభించిన 17 డిగ్రీ కాలేజీలకు పోస్టులను కూడా ప్రభుత్వం మంజూరు చేయలేదు. కొత్త డిగ్రీ కాలేజీలకు పోస్టులను మంజూరు చేయాలని కోరుతూ విద్యా శాఖ అధికారులు ప్రభుత్వానికి లేఖ రాశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లోనూ విద్యార్థుల సంఖ్య 2014 నుంచి తగ్గుతూ వస్తున్నారు. 2014లో రాష్ట్రంలోని డిగ్రీ కాలేజీల్లో సుమారు 80వేల మంది చేరితే అదికాస్త ప్రస్తుతం 50వేలకు చేరింది.

**యూనివర్సిటీల్లో..**

ఇక రాష్ట్రంలో కొనసాగుతున్న విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ మరీ గందరగోళంగా మారింది. వర్సిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యా పక పోస్టులను భర్తీ చేయడానికి ప్రభుత్వం అనుమతిస్తూ 2017లోనే ఉత్తర్వు లిచ్చినప్పటికీ.. వివిధ కారణాలతో ఇప్పటివరకు అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియా మకం జరగలేదు. కొత్తగా ఏర్పాటు చేసిన వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం కాకుండా మిగిలిన 11 యూనివర్సిటీల్లో 2,125 ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కాకతీయ యూనివర్సిటీతోపాటు మహాత్మాగాంధీ, శాతవాహన, పాలమూరు, సురవరం ప్రతాపరెడ్డి తెలుగువిశ్వవిద్యాలయం, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూని వర్సిటీల్లో అయితే ఒక్క రెగ్యులర్ ప్రొఫెసర్ కూడా లేరు.

ప్రస్తుతం రాష్ట్రంలో 219 ప్రొఫెసర్ పోస్టులతోపాటు, 792 అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు.. అలాగే 1,114 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కాకతీయ యూనివర్సిటీలో 2018లో జారీచేసిన జిఒఎంఎస్ నంబర్ 22 ప్రకారం 122 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉండగా.. ప్రస్తుతం అవికాస్త 183కి చేరాయి. జేఎన్‌టియూలో ప్రస్తుతం 146 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉండగా.. గతంలో 2018లో జారీచేసిన జిఒనంబర్ 8 నాటికి 102 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గతంలో ప్రభుత్వం జారీచేసిన జిఒఎంఎస్ నంబర్ 34 ప్రకారం రాష్ట్రంలోని 11 వర్సిటీల్లో 102 ప్రొఫెసర్ పోస్టులు, 234 అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు, 725 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్టు ప్రకటించింది. మొత్తం 1,061 పోస్టుల భర్తీకి అనుమతిస్తూ గత ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం రాష్ట్రంలోని 11 యూని వర్సిటీల్లో 219 ప్రొఫెసర్ పోస్టులు, 792 అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు, 1,114 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

# ఫ్రెంచ్‌ఓపెన్ విజేతగా కోకోగాఫ్!

**పారిస్, జూన్ 7:** అమెరికా సంచనలం కొకో గాఫ్ తొలిసారి ఫ్రెంచ్ ఓపెన్ ఛాంపియన్‌గా అవతరించింది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్‌లో అరీనా సబలెంకపై అద్భుత విజయంతో టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఉత్కంఠ పోరులో పట్టువదలకుండా చెలరేగిన గాఫ్ ప్రత్యర్థికి చెక్ పెట్టింది. తొలి సెట్ కోల్పోయినప్పటికీ తన మార్క్ ఆటతో విరుచుకుపడ్డ గాఫ్ చివరి రెండు సెట్లు గెలుపొంది తన కలను సాకారం చేసుకుంది. యూఎస్ ఓపెన్ విజేతగా చరిత్ర సృష్టించిన గాఫ్ ఈసారి మట్టి కోర్టులో విక్టరీ నమోదుచేసింది. తొలి రౌండ్ నుంచి అదరగొట్టిన ఈ టీనేజర్ ఫైనల్లోనూ అదే జోరు చూపించింది. కానీ, టైటిల్ పోరులో అరీనా సబలెంక నుంచి ఆమెకు గట్టి పోటీ ఎదురైంది.

పైగా తొలి సెట్‌ను 67తో కోల్పోయిందీ యువ టెన్నిస్‌క్రీడాకారిణి. అయినా సరే తను పట్టువిడవలేదు. అసమాన పోరాటపటిమను కనబరిచిన గాఫ్ బెలారస్ భామకు ముచ్చెమటలు పట్టించింది. రెండో సెట్‌ను 62తో అలవోకగా గెలుచుకున్న ఈ యువకెరటం.. మూడో సెట్‌లోనూ సబలెంకపై పైచేయి సాధించింది. బ్రేక్ పాయింట్లు సాధిస్తూ.. పదునైన షాట్లతో ఆమెను నిలువరించిన గాఫ్ 64తో గెలుపొంది తన ఫ్రెంచ్ ట్రోఫీ కలను నిజం చేసుకుంది. ఆఖరి పాయింట్ సాధించిన తర్వాత భావోద్వేగానికి లోనైన తను కోర్టులోనే కూలబడింది. ఆ తర్వాత సబలెంకతో షేక్ హ్యాండ్ అయ్యాక ప్రేక్షకుల గ్యాలరీలోని తన తల్లిదండ్రులతో గెలుపు సంబరాలు చేసుకుంది. సెరెనా విలియమ్స్, వీనస్ విలియమ్స్ తర్వాత అమెరికా టెన్నిస్‌లో సంచలనంగా మారిన గాఫ్ 2023లో యూఎస్ ఓపెన్ విజేతగా చరిత్ర సృష్టించింది.



తన ఆటతో అదరగొడుతున్న ఈ టీనేజర్ ఇప్పటివరకూ 7 డబ్ల్యూటీఏ టూర్ సింగిల్స్ ట్రోఫీలు కొల్లగొట్టింది.

# తగ్గిన సర్కార్ ఆదాయం

**రెవెన్యూ రాబడుల్లో రూ.580 కోట్లు కోత**

**హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త:** తెలంగాణ చరిత్రలో తొలిసారిగా ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నెలకు సంబంధించి రెవెన్యూ రాబడిలో కోత పడింది. ప్రతియేటా పన్ను ఆదాయం పెరగాల్సి ఉండగా, సర్కారు అసంబద్ధ నిర్ణయాలతో క్షీణిస్తున్నది. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్‌లో రెవెన్యూ రాబడిలో రూ.579.75 కోట్లు, సొంత పన్నుల ఆదాయంలో కూడా రూ.547.49 కోట్ల క్షీణత రికార్డయింది. ఈ విషయాన్ని నెలవారీ నివేదికలో ఆర్థిక శాఖ వెల్లడించింది.

2025-26 వార్షిక బడ్జెట్‌లో అన్ని రకాల ఆదాయ మార్గాల్లో రూ.2,29,720.62 కోట్ల రెవెన్యూ రాబడులు వస్తాయని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసింది. ఇందులో భాగంగా మొదటి ఏప్రిల్ నెలో రూ.11,239.13 కోట్లు మాత్రమే వచ్చింది. అంటే అంచనాలో 4.89 లక్ష్యాన్ని చేరుకున్నది. అదే గత ఏడాది ఏప్రిల్‌లో రెవెన్యూ రాబడి 11,818.88 కోట్ల రూపాయలు సమకూరాయి. 2025-26 బడ్జెట్‌లో ట్యాక్స్ రెవెన్యూ రూ.1,75,319.35 కోట్లు వస్తుందని అంచనా వేసింది. ఇందులో ఏప్రిల్ నెలకు గాను రూ. 10,916.68 కోట్లు (6.23 శాతం) మాత్రమే వచ్చింది.

గత ఏడాది ఇదే నెల రూ. 11,464.17 కోట్లు ఆదాయం వచ్చింది. గత సంవత్సరంతో పోల్చితే ఈ ఏడాది ఏప్రిల్‌లో ట్యాక్స్ రెవెన్యూ రూ.547.49 కోట్లు తగ్గింది.

# 10న రూ.3 వేల కోట్ల రుణం

**హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త:** రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) నుంచి 3,000 కోట్ల రూపాయల మేర రణం తీసుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ రుణ మొత్తాన్ని ఈ నెల 10న నిర్వహించే బహిరంగ వేలంలో తీసుకునేందుకు సెక్యూరిటీ బాండ్లను వేలానికి పెట్టింది. 30 ఏండ్ల కాలానికి 1,000 కోట్ల రూపాయలు, 31 ఏండ్ల కాలానికి మరో 1,000 కోట్ల రూపాయలు, 32 ఏండ్ల కాలానికి ఇంకో రూ.1,000 కోట్ల రూపాయలు తీసుకుంటామని రిజర్వ్ బ్యాంక్‌కు ఇండెంట్ పెట్టింది. ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో అంటే ఏప్రిల్ నుండి జూన్ వరకూ 14 వేల కోట్ల రూపాయల రుణం కోసం ఆర్బీఐకి రాష్ట్ర సర్కారు ప్రతిపాదనలు పంపించింది. ఏప్రిల్‌లో 4,400 కోట్ల రూపాయలు, మేలో 4,500 కోట్ల రూపాయలు, జూన్‌లో 1,500 కోట్ల రూపాయలు కలిపి మొత్తం రూ.10,400 కోట్లు సేకరించనుంది. కాగా 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.64,539 కోట్ల రూపాయల చొప్పున మార్కెట్ రుణాలను సేకరించనున్నట్లు వార్షిక బడ్జెట్‌లో తెలంగాణ ప్రభుత్వం పేర్కొంది.

# భూమిలో పెస్టిసైడ్స్‌ను తొలగించే కొత్త టెక్నాలజీ

**తెలంగాణ శాస్త్రవేత్తల విజయం**

**హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త:** ప్రస్తుతం వ్యవసాయంలో రసాయన మందుల వాడకం ఎక్కువయిపోయింది. దీంతో మళ్లీ పాతకాలంలో మాదిరిగా ఆర్గానిక్ పద్ధతిలో పండించే పంటలను డిమాండ్ పెరిగింది. ఇందుకోసం భూమిలోని పెస్టిసైడ్స్‌ను తొలగించే పద్ధతిని తెలంగాణ శాస్త్రవేత్తలు కనిపెట్టారు.

హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం మైక్రోబయాలజీ విభాగానికి చెందిన శాస్త్రవేత్తలు వ్యవసాయంలో రసాయన ఎరువుల ఎఫెక్ట్‌ను తొలగించే పరిష్కారాన్ని కనుగొన్నారు. పంటల కోసం ఉపయోగించే రసాయన ఎరువులను మట్టిలోంచి తొలగించే సరికొత్త ప్రయోగాన్ని సక్సెస్‌ఫుల్‌గా జరిపారు.

కేవలం మూడు వారాల్లో 90 శాతం వరకు భూమిలోని పెస్టిసైడ్స్ తొలగించే మైక్రోబియల్ ప్రక్రియను అభివృద్ధి చేశారు. ఈ పరిశోధనను ప్రొఫెసర్ బుర్గుల సందీప్త నేతృత్వంలో మూడు సంవత్సరాలపాటు నిర్వహించారు. ఈ అధ్యయనంలో శాస్త్రవేత్తలు అధికంగా పురుగుమందులు వినియోగించే వ్యవసాయ భూముల నుండి 12 రకాల సూక్ష్మజీవులను గుర్తించారు. వీటిలో ఐదు రకాలను ఎంపిక చేసి వాటివల్ల విషపూరిత రసాయనాల తొలగింపు సామర్థ్యాన్ని పరిశీలించారు. ప్రయోగాల కోసం రెడ్, బ్లాక్ మట్టిలో నాలుగు నుంచి ఐదు రెట్లు అధికంగా కలిగిన పెస్టిసైడ్ స్థాయిని ఉపయోగించారు.

ఈ సూక్ష్మజీవులను సహజ వెలుతురు, గాలి పరిస్థితుల్లో ప్రయోగించగా, కేవలం మూడు వారాల్లో మట్టిలోని పెస్టిసైడ్ మిగులు 75 నుండి 90 శాతం వరకూ తగ్గినట్లు ఫలితాలు చూపించారు. ప్రత్యేకంగా 37 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత వద్ద ఈ సూక్ష్మజీవులు ప్రతి 40 నిముషాలకు రెట్టింపు సంఖ్యలో విస్తరిస్తుండటం ఈ విజయం వెనక ప్రధాన కారణమని శాస్రవేత్తలు తెలిపారు.




# అగ్నిప్రమాదానికి 'కైట్ ఐ' టెక్నాలజీ

**నిమిషాల్లో సమీప ఫైర్‌స్టేషన్లకు సమాచారం**

**ఆస్తి, ప్రాణనష్టాలకు ఇది కీలకం**

**భారీ భవంతులపై ముందస్తు చర్యలు కీలకమంటున్న జనాలు**

**హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త:** అగ్నిప్రమాదాలకు ముందస్తు చర్యలు చాలా ముఖ్యం. నిబంధనలకు అనుగుణంగా భవంతులు నిర్మిస్తే ఎలాంటి ప్రమాదాలు జరగవని ఇంజఇనీరింగ్ నిపుణులు చెబుతున్నారు. ఏళ్లనాటి నుంచి అగ్గిపై సంబంధిత శాఖల నడుమ సమన్వయం కొరవడడంతో పాటు అలసత్వం, నిర్లక్ష్యమే సర్వం కోల్పోవాల్సి వస్తుంది. అగ్నిప్రమాదాలు జరిగితే ఆస్తి, ప్రాణనష్టాలను నివారించేందుకు అగ్నిమాపక శాఖ ఉపయోగించే జీపీఎస్‌తో కూడిన 'కైట్ ఐ టెక్నాలజీ వ్యవస్థ చాలా కీలకంగా పనిచేస్తుంది. ఘటనలు జరిగిన వెంటనే సెంట్రల్ కమాండ్ సెంటర్‌కు సమాచారం అందించి నేరుగా క్షేత్రస్థాయిలో ఫైర్‌స్టేషన్‌కు నిమిషాల్లో చేరవేస్తుంది. గత నెలలో జరిగిన గుల్జార్‌హౌజ్ ప్రమాద ఘటనలో ఆ టెక్నాలజీయే కీలకంగా పని చేసింది. కేవలం పదిహేను నిమిషాల్లోనే ఒక ఫైరింజన్ సిబ్బందితో కలిసి ప్రమాదం జరిగిన చోటకుచేరి సహాయక చర్యలు చేపట్టింది

**మంటల అదుపునకు 'కైట్ ఐ' కీలకమే..**

అగ్నిప్రమాదాలు జరిగిన వెంటనే ప్రాణనష్టం జరగకుండా మంటలను అదుపుచేయడమే తొలి ప్రయత్నం. ఇందుకు క్షణాల్లో సమాచారం అందించే జీపీఎస్‌తో కూడిన 'కైట్ ఐ' ఆధునిక పరిజ్ఞాన సాంకేతికత ఫైర్‌డిపార్ట్‌మెంట్ ఉపయోగిస్తుంది. ఇది హైదరాబాద్‌లోని అన్ని ఫైర్‌స్టేషన్ల వాహనాలకు జీపీఎస్‌ను ఏర్పాటు చేశారు. ప్రమాదం జరిగిందని ఫోన్‌కాల్ రాగానే సెకన్లలోనే సెంట్రల్ కమాండ్ సెంటర్‌కు సమాచారం చేరవేస్తుంది అక్కడ నుంచి సమీపంలో ఉన్న ఫైర్‌ఇంజిన్‌లకు అలర్ట్ మెసేజ్ అందిస్తుంది. మ్యాప్ ద్వారా సదరు ఫైర్ ఇంజిన్ స్పాట్‌కు వెళ్లే అవకాశం ఉంటుంది. అంతేకాదు రద్దీలేని ప్రాంతం వీలైనంత తక్కువ సమయంలో చేరుకునే మార్గాలను సైతం చూపిస్తుంది. నీటి వసతిని అదే చెబుతుంది. దీంతో సులువుగా అగ్నిమాపక సిబ్బంది వచ్చేందుకు వీలు ఉంటుంది.కాకపోతే ఇరుకిరుకు ప్రదేశాలు, కనీసం వెళ్లలేని విధంగానే హైదరాబాద్‌లోని ఆయా ప్రాంతాలు చాలా వరకే ఉన్నాయి. దీంతోనే ప్రాణనష్టాలు జరుగుతున్నాయని అధికారులు చెబుతున్నారు. పాతబస్తీలోని గుల్జార్‌హౌస్ ఘటన ఇందుకు కారణం. దూరం నుంచే ప్రెషర్‌తో నీటిని స్ప్రే చేయడమే జరుగుతుందని అగ్నిమాపక శాఖ అధికారులు పేర్కొంటున్నారు. దీంతో కొంత వరకు మాత్రమే అరికట్ట గలుగుతున్నా...వ్యాపిస్తూ మంటలు మరింతగా ఎగిసిపడడంతో ప్రమాదాలు తీవ్రంగా మారుతున్నాయని చెబుతున్నారు.

**ఇరుకిరుకు భవంతులే ప్రధాన సమస్య..**

చిన్నపాటి దారుకూడా లేకుండా ఇరుకిరుకు ప్రాంతాల్లో భారీ భవంతులు నిర్మిస్తున్నారు. కనీసం వాహనం ప్రమాద ప్రాంతానికి కూడా వెళ్లలేని పరిస్థితి కొన్ని దశాబ్దాలుగా ఉంది. కొన్ని ప్రాంతాల్లోనే సమస్య జఠిలంగా ఉంటుంది. ప్రస్తుతం కూడా అలాగే నిర్మాణభవంతులు ఏర్పాటు చేస్తున్నారు. కనీసం భద్రత పరికరాలు కూడా లేకుండా కార్యకలాపాలు సాగిస్తున్నారు.

ఆయా శాఖలు అక్రమాలను ప్రోత్సా హించడంతోనే అగ్నిమాపకశాఖ నివారణ చర్యలు భారంగా మారాయని అధికారులు బహిరంగంగానే చెబుతున్నారు. సమన్వయంతో ముందుకెళ్లితే ప్రమాదా లను పూర్తిస్థాయిలో నివారించవచ్చని పేర్కొంటున్నారు. ప్రభుత్వ నిబంధనలను అనుగుణంగా ప్లాట్ల విస్తీర్ణానికి తగిన సెట్‌బ్యాక్, ఫ్రీపార్కింగ్, భవన, భవనానికి ఆరు మీటర్ల గ్యాప్‌లు ఉండడంతో నివారణ సులువవుతుందని అభిప్రాయపడుతున్నారు.

# ఐసియులోని రోగిపై ఆస్పత్రి సిబ్బంది లైంగికదాడి

**జైపూర్, జూన్ 7:** రాజస్థాన్‌లో అమానుష ఘటన వెలుగు చూసింది. ఈఎస్ఐసీ మెడికల్ కాలేజీలోని ఐసీయూ వార్డులో చికిత్స పొందుతున్న 32 ఏళ్ల మహిళపై నర్సింగ్ సిబ్బంది ఒకరుఅత్యాచారానికి పాల్పడ్డాడు. ఈనెల 4వతేదీన రాత్రి జరిగిన ఈ ఘటన తాజాగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ వివరాల ప్రకారం.. 32 ఏళ్ల మహిళ ఐసీయూ వార్డులో చికిత్స పొందుతోంది. ఆమె కుటుంబ సభ్యులు వార్డు బయట వేచి ఉన్నారు. ఆ సమయంలో అక్కడి నర్సింగ్ స్టాఫ్ ఒకరు మహిళపై అఘాయిత్యానికి పాల్ప డ్డాడు. ఆమె పడుకున్న మంచం చుట్టూ కర్టెన్స్ వేసి.. ఆమెకు మత్తు మందు ఇచ్చాడు. అనంతరం ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలు స్పృహలోకి వచ్చాక ఈ దారుణాన్ని కుటుంబ సభ్యులకు వివరించింది. దీంతో వారు ఆసుపత్రి సిబ్బందిని ప్రశ్నించగా ఆ ఆరోపణలు వారు ఖండించారు. దీంతో బాధిత కుటుంబం పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు అల్వార్ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ మహవీర్ సింగ్ తెలిపారు.



# 'కుబేర' నాగార్జున డబ్బింగ్ పూర్తి

సూపర్ స్టార్ ధనుష్, కింగ్ నాగార్జున, రష్మిక మందన్న, హైలీ యాంటిసిపేటెడ్ పాన్‌ఇండియా మూవీ శేఖర్ కమ్ముల కుబేర. అద్భుతమైన తారాగణంతో కుబేర ఇండియన్ సినిమాలో గేమ్‌ఛేంజర్‌గా నిలవబోతోంది. కుబేర మూవీ జూన్ 20న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. తాజాగా కింగ్ నాగార్జున కుబేరకు తన డబ్బింగ్ పూర్తి చేశారు. ఈ సందర్భంగా డబ్బింగ్ స్టూడియోలో నాగార్జున, శేఖర్ కమ్ముల, నిర్మాత పుష్కర్ రామోహన్ కలసి మాట్లాడుతున్న ఫోటోలని మేకర్స్ షేర్ చేశారు. ఇప్పటికే విడుదలైన కుబేర ప్రమోషనల్ కంటెంట్‌కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. పోయిరా మామ, ట్రాన్స్ ఆఫ్ కుబేర చార్ట్ బస్టర్ రెస్పాన్స్ తో మ్యూజిక్ చార్ట్స్ లో టాప్ ట్రెండింగ్‌లో వున్నాయి. ప్రమోషనల్ కంటెంట్‌తో కుబేర మీద ఉన్న హైప్ నెక్స్ట్ లెవెల్‌కి చేరుకుంది. క్యారెక్టర్ బేస్డ్ నరేటివ్స్ తో అదరగొట్టే శేఖర్ కమ్ముల ఈ చిత్రాన్ని నెవర్ బిఫోర్‌గా తీర్చిదిద్దారు, ఇది ఈ సంవత్సరంలో అత్యంత ఆసక్తిగా ఎదురు చూస్తున్న చిత్రాలలో ఒకటిగా నిలిచింది. శేఖర్ కమ్ముల అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్ మోహన్ రావు ఈ చిత్రాన్ని హై బడ్జెట్ హై ప్రొడక్షన్ వాల్యూస్‌తో నిర్మిస్తున్నారు. కుబేర తెలుగు, తమిళం, తెలుగు, హిందీ, కన్నడ, మలయాళ భాషలలో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది.



# 'బిగ్‌బాస్' ఫేమ్ శుభశ్రీ నిశ్చితార్థం

ప్రముఖ నిర్మాత అజయ్ మైసూర్, నటి, బిగ్ బాస్ 7 ఫేమ్ శుభశ్రీ నిశ్చితార్థ వేడుక హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖల నటులు సాయికుమార్, యువ హీరో సోహైల్, బిగ్ బాస్ షో కంటెస్టెంట్స్‌తో పాటు పలువురు సెలబ్రిటీలు పాల్గొని ఈ నూతన జంటకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంగేజ్ మెంట్, మెహందీ, సంగీత్, రిసెప్షన్ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఈ నిశ్చితార్థ వేడుకలో అజయ్ మైసూర్, శుభశ్రీ కలిసి చేసిన మెజెస్టీ ఇన్ లవ్ సాంగ్‌ను లాంచ్ చేశారు. సాయి కుమార్ వాయిస్‌తో ఈ పాట ప్రారంభం కావడం ఆకర్షణగా నిలిచింది. మెజెస్టీ ఇన్ లవ్ సాంగ్‌ను సిద్ధార్థ్ వాట్కిన్స్ స్వరపర్చి సింగర్ సాహితీ చాగంటితో కలిసి



పాడారు. ఈ పాట రూపకల్పన సమయంలోనే వీరి మనసులు కలిసి ప్రేమించుకున్నారు. వైవాహిక జీవితంలోకి అడుగు పెట్టాలని నిశ్చయించుకు న్నారు. జూలైలో అజయ్ మైసూర్, శుభశ్రీ వివాహం ఆస్ట్రేలియాలో జరగ నుంది. ఎంగేజ్‌మెంట్ కార్యక్రమంలో సాయి కుమార్ మాట్లాడుతూ, అజయ్ మైసూర్ నాకు మంచి మిత్రులు. మా ఇంటికి వచ్చి వారి ఎంగేజ్ మెంట్ కోసం ఆహ్వానించారు. ఈజంట చిరకాలం సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నా అని శుభాకాంక్షలు అందజేశారు. హీరో సోహైల్, బిగ్ బాస్ కంటెస్టెంట్స్ ఫ్రెండ్స్, ఇతర సెలబ్రిటీలు ఈ ఎంగేజ్ మెంట్ వేడుకల్లో సందడి చేశారు. మెజెస్టీ ఇన్ లవ్ సాంగ్‌కు పనిచేసిన టీమ్ కూడా ఈ వేడుకల్లో పాల్గొని పాట పాడి వీక్షకులను అలరించారు.ప్రొడ్యూసర్ అజయ్ మైసూర్ అజయ్ మైసూర్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై అమ్మరాజ్యంలో కడప బిడ్డలు, టెన్త్ క్లాస్‌డైరీస్ వంటి చిత్రాలతో పాటు పలుషార్ట్‌ఫిలింస్, 50కిపైగా మ్యూజిక్ అల్బమ్స్ లో నటించారు.

# 'మై లవ్' వీడియో సాంగ్ గ్రాండ్ లాంచ్

ప్రతిష్టాత్మక మెగా సూపర్ గుడ్ ఫిలిమ్స్ సమర్పణలో కిషోర్ తేజా, సాత్విక లీడ్ రోల్స్‌లో నటించిన మై లవ్ ఆల్బమ్ సాంగ్ గ్రాండ్‌గా లాంచ్ అయ్యింది. ఎస్‌కెటి ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో వాకాడ అప్పా రావు నిర్మించిన ఈ ఆల్బమ్ ప్రేక్షకుల మనసులను హత్తుకునే భావోద్వేగంతో కూడిన సంగీతం, రిఫ్రెషింగ్ విజువల్స్‌తో అదిరిపోయింది. ఈ సాంగ్‌కి సురేష్ బనిశెట్టి సాహిత్యం అందించగా, క్రాంతి ఆచార్య మనసుని కదిలించే సంగీతాన్ని అందించారు. కపిల్ కపిలన్ అద్భుతంగా ఆలపించిన ఈ పాట మ్యూజికల్ లవర్స్‌ని మెస్మరైజ్ చేసింది. కిషోర్ తేజా, సాత్విక కెమిస్ట్రీ లవ్లీగా వుంది. రామ్ రెడ్డి పన్నాలా కాన్సెప్ట్, డైరెక్షన్ హార్ట్ టచ్చింగ్‌గా వుంది. జయపాల్ రెడ్డి నిమ్మల సినిమాటోగ్రఫీ విజువల్స్ ట్రీట్ ని అందించాయి. ఈ సాంగ్ ఇన్‌స్టంట్‌గా వైరల్ అయ్యింది. సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో హీరో కిషోర్ తేజ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. మా డైరెక్టర్ రామ్ రెడ్డి ఈ పాట కోసం సినిమా స్థాయిలో కష్టపడ్డారు. చాలా అద్భుతంగా చేశారు. మా డీవోపీ జయపాల్ రెడ్డి చాలా హార్డ్ వర్క్ చేసి అద్భుతమైన విజువల్స్ ఇచ్చారు. మేమంతా ఒక టీంగా ఈ సాంగ్‌ని చేయడం జరిగింది. అందుకే ఇంత అద్భుతంగా వచ్చింది. ఈ పాట తెలుగు తమిళ్ హిందీ మూడు భాషల్లో విడుదల చేయడం చాలా ఆనందంగా ఉంది. క్రాంతి చాలా అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. పాట చూసి ఎలా ఉందోఆడియన్స్ డిసైడ్ చేయాలి. మా టీంకి మీడియా సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను. మా నిర్మాత వాకాడ అప్పారావు చాలా సపోర్ట్ చేశారు. వారి



సపోర్ట్‌తోనే సాంగ్ ఇంత అద్భుతంగా వచ్చింది. చాలా మంచి సాంగ్ ఇది. ఆడియన్స్ అందరూ చూసి లైక్ షేర్ సబ్స్క్రైబ్ చేయాలని కోరుకుంటున్నాను అన్నారు. యాక్టర్ రమణ మాట్లాడుతూ, అందరికి నమస్కారం. కిషోర్‌ని వెండితెరపై మీద హీరోగా చూడాలనిపిస్తుంది. ఆయన అవకాశం ఇస్తే ఆయన హీరోగా నేను విలన్‌గా చేస్తాను. ఇది సాంగ్ లాగా లేదు. ఒక సినిమా లాగా ఉంది. కథంతా ఈ సాంగ్‌లో చూపించారు. మ్యూజిక్ కెమెరా ఎడిటింగ్ అన్ని అద్భుతంగా ఉన్నాయి. పాటని హిట్ చేసి టీమ్ అందర్నీ ఎంకరేజ్ చేయాలని కోరుకుంటున్నాను అన్నారు డైరెక్టర్ తరుణ్ భాస్కర్ మదర్ గీత మాట్లాడుతూ, అందరికి నమస్కారం. పాట చాలా మెలోడీస్‌గా ఉంది. అద్భుతమైన ఎమోషన్ ఉంది. సాత్విక కిషోర్ వండర్ఫుల్ పర్ఫార్మెన్స్ ఇచ్చారు. ఈ పాట వినండి. వింటూనే ఉంటారు అన్నారు. దివి మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. కాన్సెప్ట్ చాలా బ్యూటిఫుల్‌గా ఉంది. సాత్విక తేజ చాలా బ్యూటి ఫుల్‌గా ఉన్నారు. తప్పకుండా అందరూ సాంగ్ వినండి అన్నారు. సాత్విక మాట్లాడుతూ, అందరికి నమస్కారం. స్క్రీన్ మీద నన్ను నేను చూసుకోవడం ఫస్ట్ టైం. మా టీంకి థాంక్యూ అన్నారు.

# నేడు 'డకాయిట్' క్రూషియల్ షెడ్యూల్ షురూ

అడివి శేష్ హైలీ యాంటిసిపేటెడ్ పాన్ ఇండియన్ థ్రిల్లర్ డకాయిట్. మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇటీవలే విడుదలైన ఫైర్ గ్లింప్స్ ఇంటెన్స్ యాక్షన్, స్టైలిష్ విజువల్స్‌తో అదిరిపోయింది. నేషనల్ వైడ్‌గా సెన్సేషన్ క్రియేట్ చేసింది. విజువల్‌గా ఫైర్ గ్లింప్స్ కొత్త బెంచ్ మార్క్‌ను సెట్ చేసింది. ప్రస్తుతం ఈ సినిమా ప్రొడక్షన్, పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. తాజాగా అడివి శేష్ డకాయిట్ కోసం డబ్బింగ్ టెస్ట్ పూర్తి చేశారు. దీనికి సంబధించిన ఫోటోని షోషల్ మీడియాలో షేర్ చేశారు. అలాగే టీం జూన్ 8 నుంచి క్రూషియల్ షూటింగ్ షెడ్యూల్‌ని ప్రారభించనున్నారు. ఈ షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలని చిత్రీకరించనున్నారు. ఈ చిత్రానికి షానియల్ డియో దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని సుప్రియా యార్లగడ్డ నిర్మాతగా, అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సునీల్ నారంగ్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రం ఈ క్రిస్మస్, డిసెంబర్ 25న గ్రాండ్ థియేట్రికల్ విడుదల కానుంది. ఈ హాలిడే బాక్సాఫీస్‌ను షేక్ చేస్తోందని చెప్పడం ఎలాంటి సందేహం లేదు. శేష్‌కు ఇది తొలి హాలిడే రిలీజ్ కావడం విశేషం.





మెహ్రీన్ నయా లుక్

# 'ఘాటి' కోసం అనుష్క సెంటిమెంట్ బ్రేక్ చేస్తుందా..

టాలీవుడ్ స్టార్ బ్యూటీ అనుష్క శెట్టి నటిస్తున్న లేటెస్ట్ మూవీ ఘాటి ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి బజ్ క్రియేట్ చేసింది. ఈ సినిమాను దర్శకుడు క్రిష్ జాగర్లమూడి డైరెక్ట్ చేస్తుండటంతో ఈ సినిమాపై అంచనాలు పెరిగాయి. ఇక ఈ సినిమా నుంచి రిలీజ్ అయిన ప్రమోషనల్ కంటెంట్ ఈ అంచనాలను రెట్టింపు చేశాయి. అయితే, ఇప్పుడు ఈ సినిమా రిలీజ్ డేట్‌ను కూడా మేకర్స్ కన్ఫర్మ్ చేశారు. జూలై 11న ఘాటి చిత్రాన్ని గ్రాండ్ రిలీజ్ చేసేందుకు చిత్ర యూనిట్ రెడీ అవుతోంది. అయితే, ఈ సినిమా ప్రమోషన్స్‌ను నెక్స్ట్ లెవెల్‌లో చేసి సినిమాపై మరింత బజ్ తీసుకొచ్చేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. మరి ఈ సినిమా కోసం అనుష్క తన సెంటిమెంట్ బ్రేక్ చేస్తుందా అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. తన గత చిత్రాలకు అనుష్క ప్రమోషన్స్‌లో పాల్గొనలేదు. ఆమె ఒకట్రెండు ఇంటర్వ్యూలకు మాత్రమే పరిమితం అయ్యేది. మరి ఇప్పుడు ఘాటి చిత్రం ఆమెతో పాటు దర్శకుడు క్రిష్‌కు కూడా చాలా కీలకం. మరిఇలాంటిసినిమాను జనంలోకి తీసుకెళ్లేందుకు ఈ జేజమ్మ బయటకు వచ్చి ప్రమోషన్స్‌లో పాల్గొంటుందా లేదా అనేది చూడాలి.



# 'శంబాల' టీజర్ లాంచ్

యంగ్ అండ్ వెర్సటైల్ హీరో ఆది సాయి కుమార్ నటిస్తున్న సూపర్ నేచురల్ థ్రిల్లర్ శంబాల: ఎ మిస్టికల్ వరల్డ్. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్ పై రాజశేఖర్ అన్నభీమోజు, మహీధర్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రానికి యుగంధర్ ముని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో అర్చన అయ్యర్, స్వాసిక, రవివర్మ, మధునందన్, శివకార్తీక్ వంటి వారు నటిస్తున్నారు. ఇప్పటి వరకు ఈ శంబాల నుంచి వచ్చిన పోస్టర్‌లు, పాత్రల్ని రివీల్ చేస్తున్న తీరు అందరిలోనూ ఆసక్తిని పెంచేసిన సంగతి తెలిసిందే. రీసెంట్‌గానే శంబాల మేకింగ్ వీడియోని కూడా రిలీజ్ చేసి అంచనాలు పెంచేశారు. ఇక తాజాగా ఈ చిత్రం నుంచి టీజర్‌ను రిలీజ్ చేశారు. ఈ విశ్వంలో అంతు పట్టని రహస్యాలెన్నో ఉన్నాయి.. సైన్స్‌కి సమాధానం దొరకనప్పుడు మూఢ నమ్మకం అంటుంది.. అదే సమాధానం దొరికితే అదే తన గొప్పదనం అంటుంది. పంచ భూతాలని శాసిస్తోందంటే ఇది సాధారణమైనది కాదు.. దీని ప్రభావం వల్ల మనం ఎలాంటి పరిస్థితుల్ని ఎదుర్కోవాల్సి వస్తుందో ఊహించలేం.. ఇప్పుడు ఈ రక్కసి క్రీడను ఆపాలంట్తే.. అంటూ వచ్చిన వాయిస్ ఓవర్.. చూపించిన డైలాగ్స్‌తో సినిమా రేంజ్ ఏంటో అందరికీ అర్థం అవుతోంది.ఇందులో ప్రవీణ్ కే బంగారి అందించిన విజువల్స్, శ్రీచరణ్ పాకాల ఇచ్చిన బీజీఎం అన్నీ కూడా నెక్స్ట్ లెవెల్లో ఉన్నాయి. పాన్ ఇండియన్ మూవీకి సరిపడా సబ్జెక్ట్, కంటెంట్ ఉందని ఈ టీజర్ చెప్పకనే చెప్పేస్తోంది. ఇక ఇందులో అంతరిక్షం నుంచి ఏదో ఒక అతీంద్రయ శక్తి ఉన్న ఉల్క, రాయి లాంటిది ఓ గ్రామంలో పడటం.. దాని ప్రభావంతో ఊర్లోని జనాలు చనిపోవడం, వింతగా ప్రవర్తించడం జరుగుతుంటుంది. దాన్ని ఛేదించేందుకు హీరో రావడం.. ఓ ఊరితో పోరాటం చేయడం వంటి ఆసక్తికరమైన అంశాలతో శంబాలను తెరకెక్కిస్తున్నారని టీజర్ చూస్తే అర్థం అవుతోంది. ఇక ఈ టీజర్‌తో మూవీ మీద ఒక్కసారిగా అంచనాలు పెంచేశారు. ప్రస్తుతం ఈమూవీకి సంబంధించిన షూటింగ్ శరవేగంగా జరుగుతున్న సంగతి తెలిసిందే. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన రిలీజ్ డేట్‌ను ప్రకటించనున్నారు.



# పాన్ ఇండియా చిత్రంలో బాలీవుడ్ క్వీన్ దీపికా

ఇండియన్ సినీ ఇండస్ట్రీలో సంతోషంలో మునిగిపోయే బ్లాక్ బస్టర్ ప్రకటన వచ్చేసింది. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, సెన్సేషనల్ డైరెక్టర్ అట్లీ, ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో దిగ్గజ సంస్థ కళానిధి మారన్‌కు చెందిన సన్ పిక్చర్స్ కాంబోలో పాన్ ఇండియా భారీ ఎంటర్‌టైనర్ రూపొందుతోన్న సంగతి తెలిసిందే. అనౌన్స్‌మెంట్ నుంచే సినిమాపై ఆకాశాన్నంటేలా అంచనాలు ఏర్పడ్డాయి. దీన్ని నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్లేలా బాలీవుడ్ గ్లామరస్ క్వీన్ దీపికా పదుకొనె కూడా ఈ టీమ్‌తో జాయిన్ కావటం విశేషం. పాన్ ఇండియా లెవల్లో బిగ్గెస్ట్ బడ్జెట్ విజువల్ వండర్ మూవీగా తెరకెక్కబోతున్న ఈ చిత్రం అద్భుతమైన తారాగణంతో ప్రభంజనం సృష్టించబోతోంది. ఈ భారీ కాంబోను తెలియజేసేలా విడుదల చేసిన ఫస్ట్ గ్లింప్స్ వీడియో అభిమానులను, ప్రేక్షకులను మెస్మరైజ్ చేస్తోంది. డైరెక్టర్ అట్లీతో దీపికా పదుకొనె మాట్లాడే సన్నివేశాలతో ప్రారంభమైన ఈ వీడియో ఆమె శక్తివంతమైన పాత్రలోకి మారుతున్న విధానాన్ని చూపించిన తీరు అందరిలో ఉత్కంఠతను రేపుతోంది. హెడ్‌గేర్‌ను ధరించి ఆమె ఫుల్ కాస్ట్యూమ్స్‌తో సెట్లోకి అడుగు పెడుతూ యుద్ధానికి సిద్ధమైంది. మరోసారి క్వీన్ విజయం సాధించనుందనేది దీంతో స్పష్టమవుతోంది. ఈ చిత్రం కోసం ఇండియన్ సినీ ఇండస్ట్రీని శాసించే నాలుగు శక్తులు ఒక చోటకు చేరుతున్నాయి. వారెవరో కాదు.. ఒకరేమో పుష్పచిత్రంతో నేషనల్ అవార్డ్ గెలుచుకున్న అల్లుఅర్జున్, జవాన్, తెరి, బిగిల్, మెర్సల్ వంటి బ్లాక్ బస్టర్ చిత్రాలను తెరకెక్కించిన సెనసేషనల్ డైరెక్టర్ అట్లీ, ఇండియన్ మీడియాలో ఎంతో శక్తివంతమైన సన్ నెట్ వర్క్‌తో పాటు ఇండి యన్ సినిమాల్లో పవర్ ఫుల్, వెర్స టైల్ స్టార్స్‌లో ఒకరైన దీపికా పదుకొనె కథా నాయికగా జాయిన్ కావటం అనేది సినిమా స్కేల్, ప్రతిష్ట మరో ఎత్తుకు చేరుకుంది.



# ప్రేక్షకులకు వినోదం పంచే 'జోరుగా హుషారుగా షికారు పోదము'

క్రేజీ యువ కథానాయకుడు సంతోష్ శోభన్, అందాల భామ, ఫల్గుణి ఖన్నా జంటగా జి.సుభాష్ చంద్ర దర్శకత్వంలో రూపొందిన చిత్రం జోరుగా హుషారుగా షికారు పోదమ. తొలికాపీతో సహా అన్ని కార్యక్రమాలనుపూర్తి చేసుకున్న ఈ చిత్రం విడుదలకు సిద్ధమైందని త్రిపుర క్రియేషన్స్ అధినేత చిత్రం, వరల్డ్ నెగటివ్ హక్కుదారుడు మురళీకృష్ణ వంకాయలపాటి తెలిపారు. ఇంకా మాట్లాడుతూ, ఇది మధురమైన రొమాంటిక్ కామెడీగా సాగుతుంది. ఇంకా చెప్పాలంటే... లైట్ హార్టెడ్ ట్రావెల్ మ్యూజికల్ లవ్ స్టోరీ. చూస్తున్నంతసేపు హాయిగా నవ్వుకుంటుంది. ఇండియా మొత్తం చుట్టి వచ్చినట్టుగా ఉంటుంది.. సంతోష్ శోభన్‌కు కెరీర్ పరంగా మరింత మంచి పేరు తెచ్చిపెడుతుంది. కనువిందు చేసే సినిమాటోగ్రఫీ, వీనులవిందైన సంగీతం చిత్రానికి ఓ ఆకర్షణగా నిలుస్తాయి. త్వరలోనే చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం అని చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: నాగవంశీ, సినిమాటోగ్రఫీ: సాయి సంతోష్.



# పేపర్ కప్పులతో కోట్ల ఆదాయం!



ఇంట్లో కూర్చుని ఫుడ్ ఆర్డర్లు పెట్టేవారి సంఖ్య రోజుకీ పెరుగుతోంది. మరో పక్క క్లౌడ్కిచెన్ల ఏర్పాటుతో ఆహారరంగంలో ఉపాధి పొందుతోన్న మహిళల శాతమూ ఎక్కువైంది. అయితే, ఇద్దరికీ ప్రధాన సమస్య ప్యాకింగే. ప్లాస్టిక్ వేడివేడి పదార్థాలు హానికరమని ఆహారం, పదార్థాలు ఒలికిపోవడం, కారడం వంటివాటితో ఇబ్బంది తయారీదారులకూ ఎదురవుతోంది. వీటన్నింటికీ సుస్థిర ప్రత్యామ్నాయాలు చూపిస్తోంది. బెంగళూరుకి చెందిన ధన్విత సత్యానంద్. అదేంటో తెలుసుకుందామా!

ధన్వితది కర్ణాటక. చదువు పూర్తయ్యాక ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో కొన్నాళ్లు పనిచేశారామె. కానీ, స్వయం శక్తితో ఎదగాలన్న కోరికతో వ్యాపార రంగంలోకి అడుగు పెట్టాలనుకున్నారు. ఆగ్రెన్జ్ పేరుతో హోటల్ రెస్టారెంట్ సప్లై ఇండస్ట్రీలో సంస్థను కలిగి ఉంది. పెట్టిన కొన్నాళ్లు బాగానే ఉంది. ఈలోగా కోవిడ్19 లాక్‌డౌన్‌తో వ్యాపారం ఆగిపోయింది. దాంతో కొంత నిరాశ పడ్డారు. కానీ, సమయంలో ఎదురైన అనుభవాలు, సమస్యలు పర్యావరణంపై అవగాహన పెంచుతాయి. దాంతో మరో ఆలోచన చేయాలనుకున్నారు. భర్త, అన్నల సాయంతో 'ఎకోజ్ బయోవేర్' పేరుతో ప్లాస్టిక్‌కి ప్రత్యామ్నాయంగా స్పిల్ ప్రూఫ్, హీట్ సేఫ్‌లతో పాటు 98 శాతం బయోడిగ్రేడబుల్ రెస్టారెంట్ ప్యాకేజింగ్ తయారీ మొదలు పెట్టారు.

**అత్యధిక స్థాయి వద్ద...** ఫుడ్ గ్రేడ్ పేపర్ బౌల్స్, కప్పులు, పెట్టెలు, పేపర్‌కప్పులు, పిజాబాక్స్‌లు, సలాడ్ బౌల్స్,సూప్ బౌల్స్, వంటివెన్నో తయారుచేశారు. మూతలు... ఇలా అన్నీ ఐటీసీ పేపర్‌తో చేసినవే వేడివేడి రసం, సాంబార్, గ్రేవీలన్నీ వీటిల్లో ప్యాకింగ్ చేయొచ్చు. ఇవి వేడిని తట్టుకోగలవు. అంతేకాదు, ఇవన్నీ వాటర్ ప్రూఫ్ కావడం వల్ల ఈ ప్యాకింగ్ చేయిచ్చు. అత్యధిక ఉష్ణోగ్రతల వద్ద ఫార్మింగ్ యంత్రాలను ఉపయోగించి వీటిని చేస్తారు. 50 నుంచి 1000 ఎంల్ వరకూ వివిధ పరిమాణాల్లో ఇవి లభిస్తాయి. ఇప్పటివరకూ ఎకోజ్ సుమారు 4.5 కోట్లకు పైగా యూనిట్లను ఉత్పత్తి చేసింది. వీరి ఖాతాదారుల్లో ఎంటిఆర్, లులుహైపర్ మార్కెట్లు, మాగ్నోలియా బేకరీ, మిలానో ఐస్‌క్రీమ్స్, రిట్జ్-కార్ల్‌టన్ వంటి ప్రముఖ బ్రాండ్లెన్నో ఉన్నాయి తాజాగా సస్టెయినబుల్ ప్యాకేజింగ్ డిమాండ్ అధికంగా ఉన్న యుకె మార్కెట్‌లోకీ ప్రవేశించింది. భారత్‌తో పాటు యుఎఇ, యూరప్, న్యూజిల్యాండ్, నార్త్ అమెరికాలోని ఫుడ్ బ్రాండ్‌లకు సరఫరా చేస్తుంది. పదికోట్లకు పైగానే ఆదాయం అందుకుంటోంది. □

# ఆమె 'వరల్డ్' ఫేమస్ డిజైనర్



ప్రపంచ నలుమూలల నుంచి వచ్చిన 108 మంది అమ్మాయిలు. తెలంగాణ సంప్రదాయాన్ని ప్రతిబింబిస్తూ మన వస్త్రధారణలో ఎంత చక్కగా మెరిసిపోయారో! ఇంతమందికి డిజైన్ చేయడం ఆషామాషీ కాదు. కానీ ఎవరి కనుసన్నల్లో ఇవన్నీ రూపొందించారని తెలుసా? అర్చనా కొచ్చర్. ఆ ప్రయాణాన్ని పంచుకున్నారిలా...

ఫ్యాషన్ అనగానే కొత్తగా చూస్తాం కానీ... ఇది భారతదేశంలో ఎప్పట్నుంచో ఆచరణలో ఉంది. ఒకప్పుడు అమ్మలే డిజైనర్లు. పిల్లలకోసం వాళ్లే ప్రత్యేకంగా దుస్తులు కుట్టేవారు. వాటిని వేసుకుని పిల్లలు ఎంత ముద్దుగా కనిపించేవారో! ఇప్పుడు అంతర్జాలం అందుబాటులోకి వచ్చాక సమాచారం సేకరించడం ఇంకా సులువు అందుకే ఎవరైనా ఫ్యాషన్ అనుకరించొచ్చు అని చెబుతా. ఈ రంగంలో నాది 30 ఏళ్ల అనుభవం. నేనూ ఎన్నో విషయాలు నేర్చుకుంటూనే ముందుకు సాగాను.

షారూక్ ఖాన్, కరీనా కపూర్, మలైకా అరోరా... ఇలా ఎంతోమంది బాలీవుడ్ నటీనటులకు దుస్తులు డిజైన్ చేశాను. అంతర్జాతీయ ఫ్యాషన్ వీక్‌ల్లో ప్రయోగా లెన్నో చేసి... ఫేమస్ అయ్యా. అంతమాత్రాన ఇది ఒక విభాగానికో, వర్గానికో పరిమితం కాదు. మన శరీరానికి నప్పే, అందాన్ని పెంచే దుస్తులను ఎంచుకోగలిగితే చాలు. దాని పెద్ద మొత్తం ఖర్చు చేయాల్సిన పని లేదు. వ్యక్తులు కష్టమనిపిస్తే మన శరీరతత్వాన్ని పోలిన సెలెబ్రిటీలను అనుకరిస్తేసరి. వాళ్లకి ఎలాగూ తమ ఆహారంపై పనిచేసే బృందాలు ఉంటాయి. మీరు వాళ్లని గమనించూ టైలర్ దగ్గర కుట్టించు కోండి. ఖర్చు ఎక్కువ అవదు. మనకి నప్పుతుందా అనేది ప్రధానంగా చూసుకోవడమే ప్రధానమిక్కడ.

**అటు ఆఫ్రికా.. ఇటు చైనా ....** నా ఇన్నేళ్లమే మిస్ వరల్డ్ పోటీలకు పనిచేసే అవకాశం ఇచ్చింది. ఇక్కడ పోటీదారులకు వేషధారణ లను దృష్టిలో పెట్టుకొని కలర్ ప్యాలెట్లకు ఎంపిక చేశాం. పోటీవాదుల శరీరాకృతి ఆధారంగా 2004 పైగా మునులను రూపొందించాం. అదీ నెల రోజుల్లోనే అయిన వాళ్లు ఏడడుగుల వరకు పొడవుంటే నేపాల్, చైనా వాళ్లు ఆదడుగు లుంటారు. ఇలా అనేక రకాల వైవిధ్యాలను దృష్టిలో పెట్టుకొని డిజైన్ చేశాం. ఇది 643 మంది ఆర్టిజన్స్ 34 మంది టైలర్లు, ఏడుగురు మాస్టర్లు 58 మంది సహాయకుల శ్రమ.

**ఇక్కత్.. నారాయణ పేట...** తెలంగాణ సంప్రదాయం ఉట్టిపడేలా తీర్చిదిద్దిన ఈ దుస్తుల కోసం.. పోచంపల్లి సహా ఎన్నో ప్రాంతాలు తిరిగాం, స్థానిక నేతన్నలు, చేతి వృత్తుల వారితో కలిసి డిజైన్లను రూపొందించాం.

2025 ట్రెండ్ రిపోర్టు... లిక్విడ్ గోల్డ్‌కి ప్రస్తుతం ఆదరణ ఎక్కువగా ఉంది. దాన్ని దృష్టిలో పెట్టుకుని అగ్గిపెట్టెలో పట్టే లిక్విడ్ గోల్డ్ ఫ్యాబ్రిక్‌ను వినియోగించుకుంటాం.

కానీ తెలంగాణలో ఎప్పట్నుంచో ఇలాంటి చీరలు ప్రసిద్ధి చెందడం విశేషం. దీనితోపాటు డబుల్ ఇక్కత్, గొల్లబామ నారాయణపేట చీరలు, బ్రొకేడ్‌లు బంగారంతో నేసిన మల్బరీ సిల్క్ చీరలతో తెలంగాణ చరిత్ర, సంప్రదాయం ప్రతిబింబించే డిజైన్లను రూపొం దించాం. క్లిష్టమైన ఆరీ వర్క్స్. జర్దోని ఎంబ్రాయిడరీలతోపాటు ముత్యాలు, భారతీయ ఆభరణాల గొప్పతనాన్ని పచ్చలు, కెంపులు, బంగారం వంటి ఆభరణాల బోన్లతో రాచరికాన్ని సూచించే రంగులను చేర్చాం. తద్వారా హైదరాబాద్ సంస్కృతిని మరింత ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేశాం. సాధారణంగా పెళ్లిళ్ళు, వేడుకలు వంటి ప్రత్యేక సందర్భాలలోనే బంగారాన్ని ఎక్కువగా వేసుకుంటాం. కానీ బంగారాన్ని దుస్తుల్లో డిజైన్ చేసి ధరించడం ఇక్కడి ప్రత్యేకత, వీటికి బాలీవుడ్ ఎంబ్రాయిడరీ లెహెంగా డిజైన్‌లో జత చేసి, లంగా ఓణీలుగా తీసుకొచ్చా. □

# చిన్నారుల స్నేహం ..



కొంతమంది పిల్లలు ఇంట్లో చలాకీగా ఉండి, స్కూల్లో, బయట ఎవ్వరి తోనూ కలవకుండా ముభావంగా ఉంటారు. మీ చిన్నారుల్లో కూడా ఇలాంటి లక్షణాలు కనిపిస్తున్నాయా? అయితే వారికి బయటి ప్రపంచాన్ని తప్పక పరిచయం చేయాల్సిందే. లేదంటే సామాజిక నైపుణ్యాలు కొరవడతాయి. కాబట్టి.. వీటిని అలవాటు చేయండి. తోటివారితో, తోబుట్టువులతో మాట కలిపేలా ప్రోత్సహించండి. అప్పుడే చిన్న బుర్రలకి బయటి ప్రపంచం పరిచయం అవుతుంది. ఇతరులతో ఎలా మెలగాలి, ఏం మాట్లాడాలన్నదీ వారికి తెలుస్తుంది. క్రీడల్లో వారిని భాగస్వాములను చేయాలి. అందుకోసం స్పోర్ట్స్ అకాడెమీలో వారిని చేర్పించండి. క్రీడలు మానసిక ఎదుగుదలకి దోహదపడతాయి. కొత్త స్నేహితులు పరిచయం అవుతుంటారు. దాంతో కొత్తవారితో మాట్లాడాలంటే బిడియం పోతుంది. తల్లితో తప్ప ఎవ్వరితోనూ పెద్దగా మాట్లాడని చిన్నారులు ఒకేసారి బయట ప్రపంచంలో కలవడం కాస్త కష్టం. ఆ ఇబ్బందిని మీతో పంచుకున్నప్పుడు మీరు దానికి సానుకూలంగా స్పందించాలి. లేదంటే ఆత్మన్యూనతకు లోనయ్యే అవకాశం ఉంది. వారు చెప్పే కారణాలకి మీ అనుభవాలను జోడించి స్నేహాన్ని ప్రయత్నించమని చెప్పాలి. చిన్నపిల్లలకు ఇప్పుడు మనం ఏం చెబితే అదే వారి మనసులో బలంగా నాటుకుపోతుంది. అందువల్ల స్నేహాల్లో ఎటువంటి తారతమ్యం ఉండకూడదని వివరించండి. అప్పుడే భిన్న సంస్కృతులు, సంప్రదాయాల పట్ల వారికి అవగాహన ఏర్పడుతుంది. □

# ఎప్పుడు కావాలన్నా కమ్మని కాఫీ

ముక్కుపుటాలని హాయిగా పలకరించే కాఫీ



పరిమళం ఒక్కసారి అలవాటైందా.. ఇక అంతే! వదల్లేం. మంచి కాఫీ కలపడం ఒక ఆర్ట్ అంటారు. ఆ కెమిస్ట్రీ కుదరడం అందరికీ సాధ్యం కాదు. కానీ ఎక్కడైనా ఏ సమయంలో అయినా ఒకేలా ఉండే కాఫీని అందించాలనుకున్నారు కొమిటీర్ సంస్థను స్థాపించిన మాథ్యూరాబర్ట్స్. ఇందుకోసం తొమ్మిదేళ్ల కష్టపడి ఫ్రీజింగ్ కాఫీని తయారుచేశారు. ఈ కాఫీని కలపడానికి ఎక్కువ సమయం పట్టదు. బరిస్తా కాఫీ రుచిని ఇంట్లోనే పక్కాగా అందించేందుకు ఆధునిక బ్రూయింగ్ టెక్నిక్ నైపుణ్యాలని పాటించి ఈ కాఫీని తయారుచేసింది కొమిటీర్ సంస్థ. ఈ ఆలోచన నచ్చడంతో ఇన్వెస్టర్లు కోట రూపాయలని పెట్టుబడిగా అందించారు. ప్రపంచవ్యాప్తంగా పేరుగాంచిన ఎనిమిది రకాల కాఫీ గింజలతో తయారుచేసిన ఈ ఫ్రిజింగ్ కాఫీ.. మనికి బిళ్లల రూపంలో దొరుకుతుంది. కాఫీ కావాలనుకున్నప్పుడు పాలల్లో కలిపితే సరి. అన్నట్టు ఈ ఏడాది ప్రపంచ ఉత్తమ ఆవిష్కరణల్లో దీన్ని ఒకటిగా టైమ్ పత్రిక పేర్కొంది. □

# రుచికరమైన చింతాకు రుచులు



మాంసం, చేపలు, రొయ్యలు.. ఇలా ఏవైనా సరే చింత చిగురురుచి ముందు దిగదుడుపే. అందుకే ఏ కూరతో అయినా సరే ఇది జట్టు కట్టేస్తుంది. చిరు పులుపుతో నోరూరిస్తుంది. మరి మీరేం వండాలని ఆలోచిస్తున్నారా? మీ కోసంమే ఇవి.

## పులిహోర ..



**కావలసినవి :** చింతచిగురు-కప్పు,పొడి అన్నం- రెండు కప్పులు, వేరు సెనగ పప్పు-మూడు పెద్ద చెంచాలు, సెనగపప్పు-రెండు పెద్ద చెంచాలు, ఆవాలు-అర టీ స్పూను, మినపప్పు-పెద్ద చెంచా, పసుపు-కొద్దిగా, కరివేపాకు-నాలుగు రెబ్బలు, ఎండు మిర్చి-మూడు, నూనె-తగినంత, ఉప్పు-రుచికి సరిపడా, ఇంగువ-చిటికెడు.

**తయారీ :** అన్నం (ఉడుకుతున్నప్పుడే ఒక చెంచా నూనె, చిటికెడు ఉప్పు కలిపి) పొడిగా వండి చల్లార్చాలి. అర టీ స్పూను నూనెలో చింత చిగురును పచ్చివాసన పోయేవరకు చిన్నమంటపై వేయించి పక్కనుంచాలి. అదే కడాయిలో నూనె వేసి ఎండుమిర్చి వేరుసెనగ గింజలు, సెనగపప్పు, మినపప్పు, ఆవాలు, కరివేపాకు పసుపు, ఇంగువ ఒక్కొకనకటిగా వేగనిచ్చిత తాలింపుని చిగురుతో పాటు అన్నంలో కలిపితే సరి.

## కొబ్బరి పచ్చడి..



**కావలసినవి :** చింతచిగురు- కప్పు, తాజా కొబ్బరి ముక్కలు-కప్పు, పసుపు-చిటికెడు, ఉప్పు-తగినంత, పచ్చిమిర్చి-అయిదు, ఎండుమిర్చి-ఏడు, ఆవాలు-అరచెంచా, మినప్పప్పు-చెంచా, మెంతులు-కొద్దిగా, ఇంగువ-చిటికెడు, నూనె- మూడు చెంచాలు. **తాలింపు కోసం:** ఆవాలు, జీలకర్ర, మినపప్పు- చెంచా చొప్పున, కరివేపాకు- రెండు రెమ్మలు, ఎండుమిర్చి- ఒకటి.

**తయారీ :** బాణలిలో నూనె పోసి కాగాక చింత చిగురు, కొబ్బరి ముక్కలు, ఉప్పు, పచ్చిమిర్చి తప్ప మిగిలినవన్నీ వేసుకుని ఎర్రగా వేయించుకోవాలి. అవి చల్లారాక మిక్సీలో వేసి ఓసారి తిప్పాలి. ఈ మిశ్రమానికి మిగిలిన పదార్థాలు కూడా చేర్చి మెత్తగా రుబ్బు కోవాలి. దీనికి చివరగా తాలింపు వేస్తే పచ్చడి తయారవుతుంది. అన్నంలోకి ఈ పచ్చడి చాలా బాగుంటుంది.

## చిన్న చేపలతో ..



**కావలసినవి :** చిన్న చేపలు-అరకిలో, చింత చిగురు-పావు కప్పు, ఉప్పు-రుచికి సరిపడా, ధనియాలపొడి-చెంచా, పసుపు కొద్దిగా, కారం-మూడు చెంచాలు, టొమాటో- చిన్నది, ఉల్లి పాయలు-మూడు, పచ్చి మర్చి-నాలుగు, కరివేపాకు-రెండు రెబ్బలు.

**తయారీ :** ముందుగా చేపల్ని శుభ్రంగా కడిగి ఓ గిన్నెలోకి తీసుకోవాలి. ఇప్పుడు చింతాకుని చేత్తో పొడిలా నలిపి అందులోకి వేసుకోవాలి. ఆపై సన్నగా కోసి పెట్టుకున్న ఉల్లిపాయ,పచ్చిమర్చి ముక్కల్ని, ధనియాల పొడి, కారం, ఉప్పు, పసుపు అన్నీ సంగం చొప్పున అందులో వేసి కలిపి మూత పెట్టి ఓ గంట పక్కనుంచాలి. ఈలోగా పొయ్యి వెలిగించి బాణలీలో ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమర్చి వేయించాలి. అవి రంగు మారాక మిగిలిన ఉప్పు, పసుపు, కారం, ధనియాలపొడి వేసి మూతపెట్టేయాలి. కాస్త నూనె పైకి తేలాక కలిపి పెట్టుకున్న చేపల్ని కూడా వేసి గరిటె పెట్టకుండా గిన్నె పైకి ఎతినత కదపాలి. ఇలా చిన్న మంటమీద కాసూపు మగ్గనిచ్చాక నీళ్లు పోసుకోవాలి. అవన్నీ ఆవిరై కూర దగ్గర పడ్డాక కొంచెం కొత్తిమీర చల్లుకకుంటే సరి.

## మటన్ ..



**కావలసినవి :** చింత చిగురు-కప్పు, మటన్-అర కేజీ, ఉల్లిపాయలు-నాలుగు, పచ్చిమర్చి-ఐదు, ఉప్పు, కారం-రుచికి తగినంత, అల్లం వెల్లుల్లి పేస్ట్-పెద్ద చెంచా, పసుపు-చిటికెడు, ధనియాల పొడి, గరం మసాలా-రెండు పెద్ద చెంచాల చొప్పున, నూనె-కొద్దిగా, జీలకర్ర-చెంచా, బిర్యానీ ఆకులు-మూడు.

**తయారీ :** మటన్‌ని కడిగి పక్కన పెట్టుకోవాలి. తర్వాత చింత చిగురును శుభ్రం చేసుకుని చేతులతో నలిపి పొడి చేసుకోవాలి. ఇప్పుడు, ఉల్లి,పచ్చిమిర్చిలను సన్నగా కోసి పెట్టుకోవాలి. కుక్కర్‌లో కొద్దిగా నూనెపోసి కాగాక.. జీలకర్ర, బిర్యానీ ఆకులు, ఉల్లి, పచ్చిమర్చి ముక్కలు వేసి రంగు మారే వరకూ మగనగనివ్వాలి. ఆపై వెల్లుల్లి పేస్తుని చేర్చి పచినచవాసన పోయే వరకూ ఉంచి, తర్వాత మటన్ వేసి మూత పెట్టాలి.ఇది మగ్గాక ఉప్పు, కారం, పసుపుతో పాటు రెండు నిమిషాలాగి ధనియాలపొడి, గరం మసాలా, కొత్తిమీర తరుగు కూడా చల్లి మూత పెట్టాలి. ఇందులో నీళ్లు పోసి నూనె పైకి తేలే వరకూ మంట మధ్యస్థంగా ఉంచి అడుగంటకుండా తిప్పాలి. అప్పుడు కొన్ని నీళ్లు పోసి మూతకు విజిల్ పెట్టి ఆరు కూతలు వచ్చే వరకూ ఉడికించాలి. చల్లారాక ముక్క ఉడికిందో లేదో చూసిచ ఇంత చిగురు కలిపి మరో ఆరేడు నిమిషాలు సిమ్‌లో ఉంచి ఉడకనివ్వాలి. ఈ కూరను వేడి వేడి అన్నంలోకి తింటే భలే రుచిగా ఉంటుంది.

## చికెన్ ఫ్రై ..



**కావలసినవి :** బోన్‌లెస్ చికెన్-అరకేజీ, చింతచిగురు-ఒకటింపావు కప్పు, కొబ్బరి తురుము-రెండు చెంచాలు, అల్లంవెల్లుల్లి ముద్ద-చెంచా, ఉల్లిపాయలు-రెండు, పచ్చిమర్చి-మూడు, పసుపు-పావుచెంచా, కారం-రెండు చెంచాలు, ధనియాలపొడి-చెంచా, గరంమసాలా-అరచెంచా, ఉప్పు-తగినంత, నూనె-అరకప్పు, దాల్చినచెక్క-రెండు ముక్కలు, అవంగాలు-మూడు.

**తయారీ :** చింత చిగురును శుభ్రంగా కడిగి పెట్టుకోవాలి. స్టౌమీద కడాయి పెట్టి నూనె పోయాలి. అదికాగాక దాల్చినచెక్క, లవంగాలు వేసి వేయించుకోవాలి. అందులోనే ఉల్లిపాయముక్కలు, పచ్చిమిర్చి తరుగు వేయాలి. అవి బాగా వేగాక అల్లం వెల్లుల్లి ముద్ద,చికెన్ ముక్కలు వేసి బాగా కలిపి మూత పెట్టేయాలి. అయిదు నిమిషాల య్యాక పసుపు, కారం, తగినంత ఉప్పు, ధనియాలపొడి, కొబ్బరి తురుము, గరంమసాలా వేసి బాగా కలిపి మూత పెట్టాలి. చికెన్ పూర్తిగా ఉడికాక చింతచిగురు వేసి బాగా కలపాలి. ఇప్పుడు స్టావ్ సిమ్‌లో పెట్టి మధ్య మధ్య కలుపుతూ ఉంటే కాసేపటికి కూర పొడిపొడిగా అవుతుంది. అప్పుడు దింపేయాలి. □

# దేవుడి సన్నిధిలో కాసేపు..

అంతర్వాణి

'ఎవని సన్నిధిని నేను నిలువబడియున్నానో, ఇశ్రాయేలు దేవుడైన ఆ యెహోవాజీవముతోడు నా మాటప్రకారము గాక, యీ సంవత్సరములలో మంచైనను, వర్షమైనను పడదని ప్రకటించెను. (1రాజులు 17:1). ఈ మాటలు అన్నది ఏలీయా అనే దేవుడి ప్రవక్త. ఎవరితో అన్నాడు అంటే ఇశ్రాయేలు రాజైన ఆహాబుతో అన్నాడు. ఎందుకని ఈ మాటలు ఏలీయా చెప్పాడు? ఆహాబు తన దేవుడైన యెహోవాను సేవించడం మానేసి, అన్యుల దేవతలను అనుసరించడం వల్ల దేవుడు దేశంలో వర్షం లేకుండా చేశాడు. ఇక్కడ ఏలీయా మాటల్ని గమనిస్తే..నేరుగా రాజువద్దకు వెళ్లి, ధైర్యంగా నేను దేవుడి సన్నిధిలో నిలబడి మాట్లాడుతున్నాను అని చెప్పాడు. ఏలీయా దేవుడి సన్నిధిలో జీవించడం నేర్చుకున్నాడు. దేవుడితో తన అనుబంధాన్ని మరణించేంతవరకు కొనసాగించాడు. దేవుడి సన్నిధిలో మనం జీవిస్తే మనకు వచ్చే లాభం ఏమిటో ఏలీయా ఎదుర్కొన్న పరిస్థితుల నుంచే తెలుసుకుందాం. మొదట ఆదేశంలో దేవుడు వర్షం రాకుండా చేశాడు. అంటే ఆ దేశంలో కరువు వచ్చింది. కరువుకాలంలో దేవుడు కాకుల ద్వారా ఏలీయాకు ఉదయం, రాత్రి రొట్టెను, మాంసాన్ని పంపాడు. ఒకవైపు ప్రజలు కరువుతో అల్లాడుతుంటే దేవుడి మాత్రం ఏలీయాను రొట్టె, మాంసంతో పోషించాడు. తర్వాత ఏలీయాను దేవుడు ఒక విధవరాలి ఇంటికి నడిపించాడు. ఏలీయా ద్వారా దేవుడు ఆ విధవరాలిని, ఆమె కుమారుడిని పోషించాడు. ఏలీయా ద్వారా దేవుడు ఒక విధవరాలికి, ఆమె కుమారుడికి ఆహారం లభించడం వల్ల జీవించారు.



ఏలీయా దేవుడి సన్నిధిలో జీవించడం వల్ల కరువులో పోషించబడ్డాడు, ఆయన ద్వారా మరో ఇద్దరికి ఆహారం దొరికింది. అవును మనం కూడా నిత్యం దేవుడి సన్నిధిలో జీవిస్తే తప్పనిసరిగా కరువులో దేవుడు మనల్ని మనతోపాటు మనపై ఆధారపడ్డవారిని కూడా పోషించి, సంరక్షిస్తాడు. మన చుట్టూ ఎన్నో విపత్కరపరిస్థితులను చూస్తున్నాం. భద్రత, క్షేమం అనేది ఎక్కడా లేదు. ఒకవైపు అనేక కంపెనీలు ఉద్యోగులను తీసివేస్తున్నారు. మరోవైపు ప్రకృతి విపత్తులు. ఇలా పలు సమస్యలతో మనం సతమతమవుతున్నాం. ఈ పరిస్థితుల్లో మనం ఏం చేయాలి? నిజదేవుడైన యేసుక్రీస్తును సేవించాలి.నిత్యం ఆయనతో మన అనుబంధాన్ని కొనసాగించాలి. ఆయన సన్నిధిలో మనం జీవించాలి. అప్పుడే మనం ఏ సమస్యలనైనా ఎదుర్కోగలం. దేవుడే మనల్ని సంరక్షిస్తాడు, కాపాడుతాడు. మనం దేవుడిపై ఆధారపడడం మన బాధ్యత, మన అవసరాలను తీర్చడం ప్రభువు బాధ్యత. కాబట్టి ఏలీయాలాగా మనం కూడా దేవుడి సన్నిధిలో జీవిద్దాం. ఆయన సన్నిధిలో జీవిస్తే, సమాధానంతో పాటు ప్రతి సమస్యకు పరిష్కారం లభిస్తుంది. మనకెన్నో పనులు, ఎన్నో ఒత్తిడిలు ఉన్నాయి. వాటన్నింటిని పక్కనపెట్టి, రోజుకు కొంతసేపు ప్రార్థనలో గడపడం ముఖ్యం. ఈ ప్రాముఖ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, ప్రార్థన ద్వారా దేవుడి సహవాసంలో ముందుకు సాగిపోదాం.

-పి.వాణిపుష్ప

# గ్లాస్ రిన్సర్



వంట చేసిన పాత్రలన్నింటి నీ సింకులో వేసి, డిష్‌వాషర్‌తో తోమి శుభ్రం చేస్తాం. గ్లాసులు, బాటిళ్ల విషయానికొస్తే వాటిని తోమాల్సిన అవసరం ఉండదు. కేవలం నీళ్లతో శుభ్రం చేస్తే చాలు. అందుకోసం ప్రత్యేకంగా తయారుచేసిన పరికరమే గ్లాస్ రిన్సర్ పరికరం. దీన్ని సింకు పక్కనే అమర్చుకోవచ్చు. గుండ్రంగా, వెడల్పుగా ఉండే ఈ పరికరంపై గ్లాసును ఉంచి ఒత్తితే చాలు. నీళ్లు వేగంగా వచ్చి గ్లాసు లోపలి భాగాల్ని శుభ్రం చేస్తాయి. ఇది కేవలం గ్లాసుల కోసమే కాదు.. బాటిళ్లు, సీసాల మూతలు శుభ్రం చేయడానికీ ఉపయోగపడుతుంది. □



# గుకేష్ సంచలన ఓటమి

## నార్వే చెస్ టోర్నీలో ఛాంపియన్‌గా కార్ల్‌సన్

**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక నార్వే చెస్ 2025 టోర్నమెంట్ అత్యంత నాటకీయ పరిణామాల మధ్య ముగిసింది. ప్రపంచ ఛాంపియన్, భారత యువ సంచలనం దొమ్మరాజు గుకేశ్ చివరి రౌండ్లో ఊహించని రీతిలో ఓటమి పాలుకావడంతో ప్రపంచ నంబర్ వన్ ఆటగాడు మాగ్నస్ కార్ల్‌సన్ మరోసారి టైటిల్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. మహిళల విభాగంలో ఉక్రెయిన్ గ్రాండ్‌మాస్టర్ అన్నా ముజిచుక్ విజేతగా నిలిచింది. మాగ్నస్ కార్ల్‌సన్ తన హోం టర్నీలో మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకున్నాడు. చివరి రౌండ్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఎరిగైసితో డ్రా చేసుకోవడం ద్వార 16 పాయింట్లతో టోర్నీలో అగ్రస్థానంలో నిలిచి విజేతగా నిలిచాడు. టోర్నీలో అద్భుతమై ప్రదర్శన కనబరిచిన గుకేశ్ చివరి రౌండ్‌లో అమెరికా గ్రాండ్ మాస్టర్ ఫాబియానో కరువానా చేతిలో ఓటమి పాలయ్యాడు. టైటిల్ ఆశలు సజీవంగా ఉంచుకోవాలంటే కనీసం డ్రా అయినా చేసుకోవాల్సి న మ్యాచ్‌లో సమయం ఒత్తిడితో గుకేశ్ తీవ్ర తప్పిదం చేసి ఓటమిని అంగీకరించాల్సి వచ్చింది. దీంతో గుకేశ్ 14.5 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు. ఈ టోర్నీలో అత్యంత ఆసక్తికరమైన మ్యాచ్‌లలో ఒకటి గుకేశ్, కార్ల్‌సన్ మధ్య జరిగింది. ఈ మ్యాచ్‌లో గుకేశ్ ప్రపంచ నంబర్ వన్ కార్ల్‌సన్‌ను క్లాసికల్ చెస్‌లో తొలిసారి ఓడించి సంచలనం సృష్టించాడు. ఫాబియా కరువానా గుకేశ్‌పై విజయం సాధించడం ద్వారా 15.5 పాయింట్లతో టోర్నీలో రెండో స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. మరో భారత గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఎరిగైసి టోర్నీలో ఐదో స్థానంలో నిలిచాడు. చివరి రౌండ్‌లో కార్ల్‌సన్‌తో డ్రా చేసుకున్నప్పటికీ.. ఆర్మాగెడాన్ గేమ్‌లో విజయం సాధించి టోర్నమెంట్‌ను మంచి నోట్‌తో ముగించాడు. ఇక మహిళల విభాగంలో ఉక్రెయిన్ గ్రాండ్‌మాస్టర్ అన్నా ముజిచుక్ 16.5 పాయింట్లతో విజేతగా నిలిచింది. భారత గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి మూడో స్థానంలో నిలిచింది.




# స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో.. లెడికి విజయం

**న్యూఢిల్లీ:** తొమ్మిది సార్లు ఒలింపిక్ ఛాంపియన్ కేటీ లెడెక్కీ యుఎస్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో మరో అద్భుతమైన విజయాన్ని సాధించింది. చికాగోలో శనివారం జరిగిన 400 మీటర్ల ఫ్రీస్టైల్‌ను 3:58.56 సెకన్లలో సాధించి తన 2025 ప్రపంచ ఛాంపియన్‌షిప్ ప్రోగ్రామ్‌కు మరో ఈవెంట్‌ను జోడించింది. సింగపూర్‌లో జరిగే ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు 800 మీటర్ల ఫ్రీలో విజయంతో ఇప్పటికే టికెట్ సంపాదించుకున్న లెడెకీ, 200 మీటర్ల మార్కులో ప్రపంచ రికార్డు వేగంతో దూసుకెళ్లింది. అంతేకాకుండా ఈ వారం 200 మీటర్ల ఫ్రీలో లెడెకీని ఒకటిరెండు ముగింపులో నడిపించిన క్లైర్ వైన్‌స్టెయిన్ కంటే 1.49 సెకన్ల ముందు చేరుకుంది. ఇక గత నెలలో ఆమె తన సొంత ప్రపంచ రికార్డు, ఇప్పటివరకు రెండవ అత్యుత్తమ 400 మీటర్ల ఫ్రీ ఈత మరియు 800 మీటర్ల ఫ్రీ ప్రపంచ రికార్డు తర్వాత చరిత్రలో రెండవ వేగవంతమైన 1,500 మీటర్ల ఫ్రీ ఈదింది. చివరి 20 మీటర్లలో కేట్ డగ్లస్ ప్రపంచ రికార్డును అధిగమించి 1:05.79 సమయంలో 100 మీటర్ల బ్రెస్ట్‌స్ట్రోక్‌ను గెలుచుకుంది, మూడుసార్లు ఒలింపిక్ బంగారు పతక విజేత కింగ్ 1:06.02 సమయంలో రెండవ స్థానంలో నిలిచింది. ప్రపంచ రికార్డు కలిగిన రీగన్ స్మిత్ మహిళల 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌ను గెలుచుకుంది, రెండవ ల్యాప్‌లో కాథరిన్ బెర్కాఫ్‌ను 57.69 సెకన్లలో అధిగమించింది. మూడు రన్నరప్ స్థానాల్లో నిలిచిన తర్వాత స్మిత్ ఈ వారంలో తన మొదటి విజయాన్ని సాధించింది, బెర్కాఫ్ 58.13 సెకన్లలో రెండవ స్థానంలో నిలిచింది.



# ఫ్రెంచ్ ఓపెన్‌లో.. ముగిసిన జకోవిచ్ పోరాటం

## ఫైనల్స్‌కు సిన్నర్

**న్యూఢిల్లీ:** ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ ఫేవరెట్లలో ఒకడైన నొవాక్ జకోవిచ్ పోరాటం సెమీ ఫైనల్లోనే ముగిసింది. శనివారం ఉత్కంఠగా సాగిన పోరులో మట్టి కోర్టులో మరో ట్రోఫీ గెలవాలనుకున్న అతడి కలను ఇటలీ కెరటం జన్నిక్ సిన్నర్ కల్లలు చేశాడు. కెరియర్లో అత్యధిక గ్రాండ్‌స్లామ్స్‌తో చరిత్ర సృష్టించిన జకోకు సిన్నర్ చెక్ పెట్టాడు. సెర్బియా వీరుడికి చుక్కలు చూపిస్తూ ఫైనల్‌కు దూసుకెళ్లాడీ వరల్డ్ నంబర్ 1. తద్వారా ఓపెన్ ఎరాలో ఈ మెగా టోర్నీ తుది పోరుకు అర్హత సాధించిన రెండో ఇటాలియన్‌గా సిన్నర్ రికార్డు నెలకొల్పాడు. మాజీ వరల్డ్ నంబర్ 1 జకోవిచ్ మరో గ్రాండ్‌స్లామ్ ఆశలపై సిన్నర్ నీళ్లు చల్లాడు. ఫ్రెంచ్ ఓపెన్‌లో టైటిల్ దిశగా సాగుతున్న అతడిని సెమీస్‌లో ఇంటికి పంపాడీ యంగ్‌స్టర్. నువ్వానేనా అన్నట్టు సాగిన పోరులో ఏమాత్రం ఒత్తిడికి లోనవ్వకుండా జకోపై పైచేయి సాధించాడీ ఇటలీ సెన్సేషన్. తొలి సెట్ కోల్పోయినప్పటికీ కంగారు పడకుండా.. తన మార్క్ ఆటతో విరుచుకుపడ్డాడు సిన్నర్. బలమైన ఏస్‌లు, పదునైన సర్వ్‌లతో చెలరేగి వరుసగా రెండు సెట్లను 7-5, 7-5 తో గెలుపొందిన అతడు మ్యాచ్ విజేతగా నిలిచాడు. జకో అత్యుత్తమైన ఆటగాడు. అతడిని ఓడించాలంటే సర్వ శక్తులు ఒడ్డాల్సిందే. అందుకే సెమీస్‌లో నేను నా బెస్ట్ గేమ్ ఆడాను. మానసికంగా బలంగా ఉండడంతో పాటు ప్రతి పాయింట్ గెలవాలనే ఉద్దేశంతో ఆడాను. అంతేకాదు జకోకు కౌంటర్ అటాక్ ఇవ్వడం చాలా ముఖ్యం. అది సాధ్యమవ్వాలంటే శ్రద్ధగా ఉండాలి. సో.. సెమీస్‌లో నేను అదే చేశాన్ను అని మ్యాచ్ అనంతరం సిన్నర్ తెలిపాడు. టైటిల్ పోరులో అతడు డిఫెండింగ్ ఛాంపియన్ కార్లోస్ అల్కరాజ్ ఢీకొట్టనున్నాడు.




# భారత్ టీం ఫైనల్

## టీమిండియా కెప్టెన్‌గా గిల్

## బంగ్లాదేశ్‌తో వన్డే సిరీస్‌కు కూర్పు

**న్యూఢిల్లీ:** ఈ ఏడాది ఆగస్టులో భారత్, బంగ్లాదేశ్ మధ్య 3 మ్యాచ్‌ల వన్డే సిరీస్ జరగనుంది. 2022 తర్వాత టీం ఇండియా తొలిసారి బంగ్లాదేశ్‌లో పర్యటిస్తుంది. ఈ పర్యటన భారత్ కూడా ప్రత్యేకమైనది. 2022 ప్రారంభంలో, వన్డే సిరీస్ ఆడటానికి బంగ్లాదేశ్ చేరుకున్న టీం ఇండియా ఘోర పరాజయాన్ని ఎదుర్కోవలసి వచ్చింది. అప్పటి కెప్టెన్ రోహిత్ శర్మ నాయకత్వంలో, భారతదేశం 1-2 తేడాతో సిరీస్‌ను కోల్పోవలసి వచ్చింది. దీనికి ప్రతీకారం తీర్చుకోవడానికి భారతదేశానికి సువర్ణావకాశం ఉంది. ఈ ఏడాది వన్డే సిరీస్ ఆగస్టు 17న ప్రారంభమవుతుండగా, రెండో వన్డే అదే నెల 20న మొదలై చివరి వన్డే 23న జరుగుతుంది. ఈ వన్డే సిరీస్ ముగిసిన తర్వాత టీ20 సిరీస్ జరగనుంది. ఇక ఈ పర్యటన కోసం, భారత జట్టు చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ యువ ఆటగాళ్లపై ఫోకస్ చేస్తున్నాడు. రోహిత్ శర్మ లేకపోవడంతో, ఈ పర్యటనలో భారత్‌కు కొత్త కెప్టెన్ కూడా రావొచ్చు. ఈ సిరీస్ కోసం టీం ఇండియా శుభ్‌మాన్ గిల్ కెప్టెన్సీలో మైదానంలోకి దిగవచ్చు. వాస్తవానికి, శుభ్‌మాన్ ఇటీవల టెస్ట్ జట్టుకు రెగ్యులర్ కెప్టెన్‌గా నియమితులయ్యారు. గిల్ 2025 ఛాంపియన్స్ ట్రోఫీని గెలుచుకున్న టీం ఇండియాకు వైస్ కెప్టెన్‌గా నియమితులయ్యారు. అదే సమయంలో, గత ఏడాది కాలంగా కెప్టెన్‌గా ఉన్న శ్రేయాస్ అయ్యర్‌కు బంగ్లాదేశ్ పర్యటనలో కూడా పెద్ద బాధ్యత లభించే అవకాశం ఉంది. దీని అర్థం బీసీసీఐ కూడా గిల్‌ను భారత తదుపరి వన్డే కెప్టెన్‌గా పరిశీలిస్తోంది. ఆ తర్వాత బంగ్లాదేశ్ పర్యటనలో తన కెప్టెన్సీ నైపుణ్యాలను ప్రదర్శించడానికి అతనికి అవకాశం ఇవ్వవచ్చు. దీంతో పాటు, బోర్డు శ్రేయాస్ అయ్యర్‌కు కీలక బాధ్యతను కూడా ఇవ్వవచ్చు. గత కొన్ని సంవత్సరాలుగా భారత జట్టులో మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మన్ శ్రేయాస్ అయ్యర్ పాత్ర చాలా ముఖ్యమైనది. శుభ్‌మాన్ గిల్ జట్టుకు నాయకత్వం వహించనున్న రోహిత్ శర్మ లేకపోవడంతో, వైస్ కెప్టెన్సీ బాధ్యతను శ్రేయాస్ అయ్యర్ భుజాలపై మోపవచ్చు. దేశవాళీ క్రికెట్‌లో అయ్యర్ ముంబైకి కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఐపీఎల్‌లో ఉన్నప్పుడు, ఐపీఎల్ 2025లో ఢిల్లీ క్యాపిటల్స్, కోల్‌కతా నైట్ రైడర్స్, పంజాబ్ కింగ్స్‌కు కెప్టెన్‌గా వ్యవహరించాడు. ప్రత్యేకత ఏమిటంటే అయ్యర్ 2024లో కేకేఆర్ తరపున టైటిల్ గెలుచుకున్నాడు. పంజాబ్, ఢిల్లీని ఫైనల్స్‌కు చేరేలా చేశాడు. 15 మంది సభ్యులతో కూడిన భారత జట్టులో శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్ (వైస్ కెప్టెన్), కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), హార్దిక్ పాండ్యా, రిషబ్ పంత్ (వికెట్ కీపర్), కుల్దీప్ యాదవ్, రవీంద్ర జడేజా, హర్షిత్ రాణా, ప్రసీద్ధ్ కృష్ణ, ముఖేష్ కుమార్, అక్షర్ పటేల్, దిగ్వేజ్ రతి, అర్షదీప్ సింగ్‌లను దాదాపు ఖరారు చేశారు.




# తైవాన్ అథ్లెటిక్స్ ఓపెన్‌లో తొలి రోజు భారత్ ఖాతాలో 4 స్వర్ణాలు

## పసిడితో మెరిసిన పూజ, అబూబకర్, జ్యోతి, షిర్సే

**న్యూఢిల్లీ:** తైవాన్ అథ్లెటిక్స్ ఓపెన్ 2025 తొలి రోజు భారత్ అథ్లెట్లు 4 స్వర్ణ పతకాలను సాధించారు. మహిళల 1500 మీటర్ల ఈవెంట్‌లో పూజా స్వర్ణం సాధించడం ద్వారా భారతదేశం తరపున ఖాతా తెరిచింది. శనివారం జరిగిన తైవాన్ ఓపెన్ తొలి రోజు శనివారం జరిగిన ఈ పోటీల్లో ఆమె 4:11.65 సమయంలో పోడియంపై అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. గత నెలలో, దక్షిణ కొరియాలోని గుమిలో జరిగిన ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో ఆమె ఇదే ఈవెంట్‌లో 4:10.83 సమయంతో రజతం గెలుచుకుంది. 22 ఏళ్ల ఆమె పోటీలో 800 మీటర్ల రేసులో కాంస్యం కూడా గెలుచుకుంది. అలాగే పురుషుల ట్రిపుల్ జంప్‌లో అబ్దుల్లా అబూబకర్ తన మూడవ ప్రయత్నంలో 16.21 మీటర్ల దూరం దూకి అగ్రస్థానంలో నిలిచాడు. ఈ ఈవెంట్‌లో భారతదేశం తన రెండవ స్వర్ణాన్ని గెలుచుకుంది. ఇక స్ప్రింట్ హర్డిల్స్ నుండి భారతదేశం మరో రెండు బంగారు పతకాలను జోడించింది. మహిళల 100 మీటర్ల హర్డిల్స్ ఈవెంట్‌ను యర్రాజీ జ్యోతి 12.99 సెకన్ల సమయంతో గెలుచుకుంది. భారత హర్డిలర్ రెండవ స్థానంలో వెనుకబడి ఫైనల్ హర్డిల్‌లోకి వెళ్ళిన తర్వాత, విజయం సాధించడానికి తీరని ఫైనల్ పుష్‌పై ఆధారపడింది. అలాగే పురుషుల 110 మీటర్ల హర్డిల్స్ రేసులో తేజస్ షిర్సే సీజన్‌లో అత్యుత్తమ సమయం 13.52 సెకన్లతో స్వర్ణం గెలుచుకోవడం ద్వారా డబుల్ సాధించాడు. రేసులో ఎక్కువ భాగం అతను నియంత్రణలో ఉన్నాడు. మరియు చివరి హర్డిల్‌ను క్లిప్ చేయకపోతే మెరుగైన సమయాన్ని నమోదు చేసుకునేవాడు. కాగా భారత పురుషులు మరియు మహిళల 4100 మీటర్ల రిలే జట్లు ఈ రోజు తరువాత పోటీపడతాయి.

# ఐసిటికి గురుదక్షిణగా ముఖేష్ అంబానీ రూ.151 కోట్లు విరాళం

**ముంబై, జూన్ 7:** భారతదేశం, ఆసియాలో అత్యంత ధనవంతుడైన ముఖేష్ అంబానీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐసిటి)కి రూ.151 కోట్లు విరాళంగా ఇచ్చారు. ఇది చరిత్రలో ఇది అతిపెద్ద విరాళం. దేశంలోని అత్యంత విలువైన కంపెనీ రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ముఖేష్ అంబానీ ఈ సంస్థ నుండి చదువుకున్నారు. గతంలో యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (యుడిసిటి) అని పిలిచేవారు. దీనిని 1933లో బొంబాయి విశ్వవిద్యాలయం స్థాపించింది. 2008లో దీనికి ఐసీటీ అని పేరు మార్చారు. డీమ్డ్ యూనివర్సిటీ హోదా ఇచ్చారు. అనితా పాటిల్ రాసిన 'ది డివైన్ సైంటిస్ట్' పుస్తకం ఆవిష్కరణ సందర్భంగా అంబానీ ఐసిటికి ఈ విరాళాన్ని ప్రకటించారు. ఈ పుస్తకం పద్మ విభూషణ్ ప్రొఫెసర్ మన్ మోహన్ శర్మ జీవితం ఆధారంగా రూపొందించారు. చాలా మంది ఆయనను భారతీయ కెమికల్ ఇంజనీరింగ్‌లో గొప్ప గురువుగా భావిస్తారు. గురుదక్షిణ గురించి మాట్లాడుతూ, శర్మ అభ్యర్థన మేరకు అంబానీ ఐసీటీకి రూ.151 కోట్లు విరాళంగా ఇస్తానని ప్రకటించారు. వారు మాకు ఏదైనా చెప్పినప్పుడు, మేము వింటామని అన్నారు. ముఖేష్ మీరు ఐసీటీ కోసం పెద్దగా ఏదైనా చేయాలి అని, అది ప్రొఫెసర్ శర్మ కోసం అని ప్రకటించడానికి నేను సంతోషంగా ఉన్నాను అని అంబానీ అన్నారు. యుడిసిటి క్యాంపస్‌ను సందర్శించడం ఎల్లప్పుడూ ఒక పవిత్ర ఆలయాన్ని సందర్శించినట్లు అనిపిస్తుందని అంబానీ అన్నారు. ప్రొఫెసర్ శర్మ, నేను మిమ్మల్ని నా అత్యంత



గౌరవనీయమైన గురువుగా, నా మార్గదర్శిగా, ప్రేరణకు మూలంగా భావిస్తాను.. శర్మ లాంటి గొప్ప వ్యక్తి జీవితాన్ని రాయడం చాలా కష్టమైన పని అని పాటిల్‌ను కూడా ప్రశంసించారు అంబానీ. తాను ఐఐటి - బొంబాయి కంటే యుడిసిటిని ఎంచుకున్నాను అని అంబానీ గుర్తు చేసుకున్నారు.

# ఆరు దేశాల్లో వాట్సాప్ బ్యాన్



**ముంబై, జూన్ 7:** వాట్సాప్ ఇప్పుడు బాగా ప్రాచుర్యం పొందిన ఇన్‌స్టంట్ మెసేజింగ్ యాప్‌గా మారింది. దీనికి పరిచయం అవసరం లేదు. ప్రతిరోజూలక్షలాది మంది యాక్టివ్ యూజర్లు ఈ యాప్‌ను ఉపయోగిస్తున్నారు. చిన్నా పెద్ద అనే తేడా లేకుండా ఉదయం నుంచి రాత్రి వరకు ఎక్కువగా ఉపయోగించే యాప్‌లలో వాట్సాప్ ఒకటి. కానీ వాట్సాప్ ఉపయోగించే చాలా మందికి వాట్సాప్ లాక్ చేయబడిన లేదా నిషేధించబడిన 6 దేశాల గురించి కూడా తెలియదు? ఈ దేశాలు వాట్సాప్‌ను నిషేధించాయి. ప్రపంచంలోని చాలా దేశాలలో వాట్సాప్ ఉపయోగిస్తున్నాయి. కానీ కొన్ని దేశాలు దీనిని నిషేధించాయి. చైనా, ఇరాన్, సిరియా, ఉత్తర కొరియా, ఖతార్, యుఎఇ వంటి దేశాలలో వాట్సాప్ పనిచేయదు. **చైనా:** విస్తృతమైన ఇంటర్నెట్ నియంత్రణలో భాగంగా వాట్సాప్‌ను నిషేధించారు. డేటా విధానాలతో మెరుగ్గా పనిచేసే స్థానికంగా అభివృద్ధి చేయబడిన యాప్‌లను ప్రభుత్వం ఇష్టపడుతుంది. **ఉత్తర కొరియా:** ఉత్తర కొరియాలో ఇంటర్నెట్ చాలా పరిమితం చేయబడింది. చాలా మంది పౌరులకు ఇంటర్నెట్ అందుబాటులో ఉండదు. ఉన్నత స్థాయి అధికారులు మాత్రమే ఇంటర్నెట్‌ను ఉపయోగిస్తారు. మరికొందరు క్వాంగ్‌మ్యోంగ్ అనే ఇంట్రానెట్‌ను ఉపయోగించాలి. **ఇరాన్:** వాట్సాప్ పై ఇరాన్ వైఖరి కాలక్రమేణా మారిపోయింది. రాజకీయ అశాంతి సమయంలో దీనిని నిషేధించారు. ఇటీవలి నివేదికలు ఆంక్షలు కొంతవరకు సడలింపు ఉన్నట్లు సూచిస్తున్నాయి. కానీ వినియోగదారులు ఇప్పటికీ ప్లాట్‌ఫామ్‌ను యాక్సెస్ చేయడంలో సవాళ్లను ఎదుర్కొంటున్నారు. వాట్సాప్‌ను ఉపయోగించడానికి వినియోగదారులు జుశివిలపై ఆధారపడాలి. **యుఎఇ:** వాట్సాప్ మెసేజింగ్ యుఎఇలో పనిచేస్తుంది. కానీ వాయిస్, వీడియో కాలింగ్ ఫీచర్లు పరిమితంంగా చేసింది. ఈ నిర్ణయం ఆ దేశ టెలికమ్యూనికేషన్ విధానాలు, స్థానిక నిబంధనలకు అనుగుణంగా ప్రత్యామ్నాయ లైసెన్స్ పొందిన యాప్‌లకు సంబంధించినది. **సిరియా:** సిరియా వాట్సాప్ వంటి ఎన్‌క్రిప్టెడ్ కమ్యూనికేషన్ సాధనాలను నిషేధించింది. **ఖతార్:** ఖతార్‌లో వాట్సాప్ వాయిస్, వీడియో కాలింగ్ ఫీచర్లు పరిమితంగా ఉన్నాయి.

# వాణిజ్యం

# ఇన్ఫోసిస్‌కు జిఎస్‌టి నుంచి క్లీన్ చిట్

**ముంబై, జూన్ 7:** దేశీయ రెండో అతిపెద్ద ఐటీ సేవల సంస్థ ఇన్ఫోసిస్‌కు భారీ ఊరట లభించింది. రూ.32,403 కోట్ల జీఎస్టీ నోటీసుకు సంబంధించి డైరెక్టర్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ నుంచి క్లీన్ చిట్ వచ్చింది. ఈ విషయాన్ని ఇన్ఫోసిస్ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో వెల్లడించింది. 201819 నుంచి 2021-22 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన ప్రీ షో కాజ్ నోటీసు ప్రొసీడింగ్స్‌ను మూసివేస్తున్నట్లు డీజీజీఐ నుంచి తమకు సమాచారం అందినట్లు పేర్కొంది. 2017 నుంచి 2022 మధ్య ఇన్ఫోసిస్ విదేశీ శాఖల్లో జరిగిన వ్యయాలకు సంబంధించి రూ.32,403 కోట్ల జీఎస్టీ నోటీసు 2024 జులైలో ఇన్ఫోసిస్ అందుకుంది. ఈ ప్రీషోకాజ్ నోటీసును కర్ణాటక రాష్ట్ర జీఎస్టీ అధికారులు జారీ చేశారు. విదేశీ శాఖల నుంచి దిగుమతి చేసుకున్న సేవలపై రివర్స్ ఛార్జ్ మెకానిజం కింద ఈ నోటీసు పంపారు. ఈ మొత్తం 2025 జూన్ 30తో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ ఆదాయంలో 85 శాతానికి సమానం. డీజీజీఐ జారీ చేసిన నోటీసులపై ఇన్ఫోసిస్ అప్పట్లోనే స్పందించింది. గతంలో తమపై ఉన్న అన్ని జీఎస్టీ బాకీలను చెల్లించామని, కేంద్ర, రాష్ట్ర నిబంధనలను పూర్తిగా పాటిస్తున్నట్లు తెలిపింది. తాజాగా ఈ నోటీసుకు సంబంధించి ప్రొసీడింగ్స్‌ను మూసివేసినట్లు డీజీజీఐ వెల్లడించడంతో ఆ మేర ఇన్ఫోసిస్‌కు ఊరట లభించింది.




# చోక్సీ బ్యాంకు ఖాతాలను అటాచ్ చేయాలి: సెబి ఆదేశాలు

**ముంబై, జూన్ 7:** గీతాంజలి జెమ్స్ షేర్లలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ నిబంధనలను ఉల్లంఘించిన కేసులో మొత్తం రూ.2.1 కోట్ల బకాయిలను తిరిగి పొందడానికి సెబి కీలక చర్యలు తీసుకుంది. ఆర్థికనేరగాడు, పరారీలో ఉన్న వజ్రాల వ్యాపారి మెహుల్ చోక్సీ బ్యాంకుఖాతాలు, షేర్లు, మ్యూచువల్ ఫండ్ హోల్డింగ్‌లను అటాచ్ చేయాలని మార్కెట్ నియంత్రణ సంస్థ సెబి ఆదేశించింది. గత నెలలో 15 రోజుల్లోపు చెల్లింపుచేయకపోతే ఆస్తులతోపాటు బ్యాంకు ఖాతాలను అటాచ్ చేస్తామని చోక్సీకి జారీ చేసిన డిమాండ్ నోటీసుల ఆధారంగా సెబి తాజా చర్యలు తీసుకుంది. గీతాంజలి జెమ్స్ లిమిటెడ్ షేర్లలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ నిబంధనలను ఉల్లంఘించిన కేసులో 2022, జనవరిలో సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబి) విధించిన జరిమానాను చోక్సీ చెల్లించకపోవడంతో డిమాండ్ నోటీసులు పంపింది. తాజా నోటీసుల్లో పెండింగ్‌లో ఉన్న రూ.2.1 కోట్ల బకాయిలలో రూ.1.5 కోట్లు జరిమానా, రూ.60 లక్షలు వడ్డీ అని సెబి తెలిపింది. వీరు పంజాబ్ నేషనల్ బ్యాంకును రూ.14వేల కోట్లకుపైగా మోసం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

# రికార్డుస్థాయిలో వెండి పరుగులు

**ముంబై, జూన్ 7:** ఇటీవల ఎంసీఎక్స్‌లో వెండి ధరలు రికార్డు గరిష్టాన్ని తాకాయి. దాదాపు 3.5 శాతం పెరిగి కిలోకు రూ. 1,05,000కు చేరుకున్నాయి, అయితే ప్రపంచ ధరలు 12 సంవత్సరాల గరిష్ట స్థాయి అయిన ఔన్సుకు 34.90 డాలర్లకు చేరుకున్నాయి. బలమైన పెట్టుబడిదారుల డిమాండ్, బలహీన పడుతున్న డాలర్, పెరిగిన భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఈవీ, సౌర రంగాల నుంచి పెరుగుతున్న పారిశ్రామిక డిమాండ్ ఈ స్థాయి పెరుగుదలకు కారణమని నిపుణులు పేర్కొంటున్నారు. జూన్ ప్రారంభంలో బంగారంతో పాటు వెండి కూడా ప్రధాన సాంకేతిక నిరోధక స్థాయిలను అధిగమించడంతో మార్కెట్ సెంటిమెంట్‌లో మార్పు కనిపించిందని వివరిస్తున్నారు. రెండు సంవత్సరాల తర్వాత యూఎస్ డాలర్ కనిష్ట స్థాయికి చేరుకోవడంతో పాటు భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, పునరుద్ధరించిన వాణిజ్య యుద్ధ ఆందోళనలు కూడా విలువైన లోహాల ర్యాలీకి ఆజ్యం పోస్తున్నాయని నిపుణులు వివరిస్తున్నారు. బంగారంవెండి నిష్పత్తి 107 నుంచి 95కి బాగా పడిపోయిందని బలమైన వృద్ధి సామర్థ్యంతో సాపేక్షంగా తక్కువ విలువ కలిగిన ఆస్తిగా బంగారం కంటే వెండికి పెట్టుబడిదారులు ప్రాధాన్యత పెరుగుతున్నట్లు సూచిస్తుందని పేర్కొంటున్నారు. ముఖ్యంగా వెండి ధరలు దీపావళి నాటికి రూ.1,20,000 చేరుకోవచ్చని వివరిస్తున్నారు. ఆర్థిక అనిశ్చితి పెరగడం, సేవల రంగంలో సంకోచం, మార్చి 2023 తర్వాత అత్యంత నెమ్మదిగా ప్రైవేట్ ఉద్యోగాల వృద్ధి వంటి కారణాలు నేపథ్యంలో గురువారం బంగారం ధరలు కూడా పెరిగాయి. ముంబైలో 22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.91,300 మరియు 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.99,600 వద్ద ఉంది. మూడు శాతం జీఎస్టీతో బంగారం ధరలు ముంబైలో 10 గ్రాములకు రూ.1 లక్షను తిరిగి చేరుకుని రూ.1,02,588 వద్ద ఉన్నాయి. గత కొన్ని నెలల్లో అద్భుతమైన పురోగతి తర్వాత బంగారం ధరలు రాబోయే రెండు నెలల్లో 1215 తగ్గవచ్చని వివరించడం గమనార్హం. ఈ నేపథ్యంలో పెట్టుబడిదారులు బంగారం, వెండి పెట్టుబడుల విషయంలో ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని సూచిస్తున్నారు.









Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.